thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 312 కరీంనగర్ ఆదివారం, 18 జనవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఆరో తరం ఫైటర్ జెట్‌పై భారత్ దృష్టి

న్యూఢిల్లీ : అత్యాధునిక ఆరో తరం ఫైటర్ జెట్‌ల అభివృద్ధిపై భారత్ దృష్టి సారించింది. ఇందుకు సంబంధించి యునైటెడ్ కింగ్‌డమ్(యూకే), జపాన్, ఇటలీ సంయుక్తంగా నిర్వహిస్తున్న గ్లోబల్ కాంబాట్ ఎయిర్ ప్రోగ్రామ్ (జీసీఏపీ) ప్రాజెక్టులో చేరేందుకు భారత్ ఆసక్తి చూపిస్తోంది. కానీ, రక్షణ రంగంలో భారత్, రష్యా మధ్య ఉన్న బలమైన బంధం నేపథ్యంలో జీసీఏపీలో భారత్‌ను చేర్చుకునే అంశంలో జపాన్ ఓ నిర్ణయానికి రాలేకపోతోంది. జపాన్ మీడియాలో ఈ మేరకు కథనాలు వెలువడ్డాయి. ఆరో తరం ఫైటర్ జెట్‌లను కలిసి అభివృద్ధి చేసేందుకు యూకే, జపాన్, ఇటలీ.. 2022 డిసెంబరులో జీసీఏపీ ప్రాజెక్టును చేపట్టాయి. 2035 నాటికి అత్యాధునిక ఫైటర్ జెట్‌ను అందుబాటులోకి తీసుకురావాలనేది లక్ష్యం.

# పట్టాలెక్కిన తొలి వందేభారత్ స్లీపర్




భారత్ లో తొలి వందే భారత్ స్లీపర్ ఎక్స్ ప్రెస్ రైలుకు ఇవాళ ప్రధాని మోడీ శ్రీకారం చుట్టారు. హౌరా–కామాఖ్య మార్గంలో దీన్ని ప్రధాని లాంఛనంగా ప్రారంభించారు. ఇప్పటికే ఈ ప్రీమియం రైలుకు సంబంధించిన ఫీచర్లు, ఇతర వివరాలను, ఫొటోలను రైల్వే శాఖ షేర్ చేసింది. ఇప్పటికే పరుగులు తీస్తున్న వందే భారత్ రైళ్లకు దేశవ్యాప్తంగా ఎంతో డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో స్లీపర్ రైళ్ల రాక రైల్వే రూపురేఖల్ని పూర్తిగా మార్చబోతోంది. ప్రధాని మోడీ ఇవాళ పశ్చిమ బెంగాల్ లోని మాల్దా టౌన్ నుంచి తొలి వందే భారత్ స్లీపర్ రైలును జెండా ఊపి ప్రారంభించారు. ఈ రైలు నంబర్ 27575 హౌరా నుంచి కామాఖ్య వరకూ ప్రయాణించబోతోంది. హౌరాలో సాయంత్రం 6:20కు బయలుదేరి కామాఖ్య కు రేపు ఉదయం 08:20కు ఇది చేరుకోనుంది. ఇందులో మొత్తం 823 మంది ప్రయాణించే అవకాశం ఉంది. రైలులో మొత్తం 16 ఏసీ కోచ్‌లు ఉన్నాయి. వీటిలో 11 థర్డ్ ఏసీ, 4 సెకండ్ ఏసీ, మరొక ఫస్ట్ ఏసీ కోచ్ ఉన్నాయి. ఈ వందే భారత్ స్లీపర్ ఎక్స్ ప్రెస్ గరిష్ట వేగం గంటకు 180 కిలోమీటర్లు. రెగ్యులర్ గా గంటకు 160 కిలోమీటర్ల వేగంతో ఈ రైలు ప్రయాణించబోతోంది. ఈ రైలును వారానికి 6 రోజుల పాటు నడపబోతున్నారు. హౌరా నుంచి గురువారాల్లో, కామాఖ్య నుంచి బుధవారాల్లో ఈ రైలు ప్రయాణించనుంది. అలాగే న్యూ జల్పాయ్ గురితో సహా 13 స్టాప్‌లు ఇచ్చారు. ప్రతీ స్టాప్ లోనూ 10 నిమిషాల హాల్ట్ ఉంటుంది. ఆ తర్వాత ప్రయాణికుల స్పందన, ఇతర అంశాల ఆధారంగా మార్పులు, చేర్పులు చేస్తారు. హౌరా నుంచి కామాఖ్యకు వందే భారత్ స్లీపర్ రైలులో థర్డ్ ఏసీ ఛార్జీ 2299గా నిర్ణయించారు. అలాగే న్యూజల్పాయ్ గురికి 1334, మాల్దాకు 960గా నిర్ణయించారు. అలాగే ఏసీ టూటైర్ లో కామాఖ్యకు 2970, న్యూజల్పాయ్ గురికి 1724, మాల్దాకు 1240 వసూలు చేస్తారు. ఫస్ట్ ఏసీలో కామాఖ్యకు 3640, న్యూజల్పాయ్ గురికి 2113, మాల్దాకు 1520 వసూలు చేస్తున్నారు. ఇవాళ తొలి వందే భారత్ స్లీపర్ రైలు ప్రారంభించిన అనంతరం ప్రధాని మోడీ విద్యార్థులతో కలిసి ఈ రైలులో ప్రయాణం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల అనుభవాల్ని అడిగి తెలుసుకున్నారు. వందే భారత్ ఎక్స్ ప్రెస్ రైళ్లు, ఇప్పుడు తీసుకొచ్చిన స్లీపర్ రైలుపై విద్యార్థులు సంతోషంగా ప్రధాని మోడీకి తమ అనుభవాలు వివరించారు.




## గణతంత్ర దినోత్సవం వేళ హై అలర్ట్..

ఢిల్లీ: గణతంత్ర దినోత్సవం–2026 సందర్భంగా అన్ని రాష్ట్రాలకు భద్రతా సంస్థలు హై అలర్ట్ ప్రకటించాయి. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీని లక్ష్యంగా చేసుకుని ఉగ్రదాడి జరిగే అవకాశముందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఖలిస్థానీ, బంగ్లాదేశ్ కేంద్రంగా పనిచేసే ఉగ్ర గ్రూపులు ఢిల్లీ, హరియాణా, పంజాబ్, ఉత్తర్ ప్రదేశ్, రాజస్థాన్, ముంబై, హైదరాబాద్ సహా పలు ప్రధాన నగరాల్లో దాడులకు పాల్పడే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ బ్యూరో హెచ్చరించింది. ఆయా నగరాల్లోని రద్దీగా ఉండే ప్రదేశాల్లో ఉగ్రమూకలు గగనతలం నుంచి డ్రోన్ల ద్వారా దాడులు జరిపే అవకాశముందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీలోని ముఖ్య ప్రాంతాల్లో మాక్‌డ్రిల్ నిర్వహిస్తూ నిఘా పెంచారు అధికారులు. ఇప్పటికే సుమారు 50,000 మందికి పైగా పోలీసులు, 65 కంపెనీల పారామిలిటరీ దళాలు ఢిల్లీలో మోహరించారు. గణతంత్ర వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అన్ని రాష్ట్రాల భద్రతా బలగాలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో పేర్కొంది.

# విద్యకే తొలి ప్రాధాన్యం



## పేదలకు పంచేందుకు భూమి లేదు.. మంచి విద్య అందిస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి

మహబూబ్‌నగర్: భారత తొలి ప్రధాని నెహ్రూ సాగునీటి ప్రాజెక్టులు, విద్యకే తొలి ప్రాధాన్యత ఇచ్చారని, తమ ప్రభుత్వం కూడా వాటికే ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్, చిట్టబోయినపల్లిలో ట్రిపుల్ ఐటీ నిర్మాణానికి సీఎం భూమి పూజ చేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో సీఎం రేవంత్‌రెడ్డి ముఖాముఖి నిర్వహించారు. దశాబ్దాల క్రితం కాంగ్రెస్ హయాంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులే ఇప్పటికీ జీవనాధారం అయ్యాయన్నారు. గతంలో భూస్వాములు, దొరల వద్ద లక్షలాది ఎకరాలు ఉండేదదని, భూగరిష్ఠ పరిమితి చట్టం తెచ్చి మిగులు భూములను కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు పంచిందని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు పేదలకు పంచేందుకు ప్రభుత్వం వద్ద భూమి లేదని, ఇప్పుడు చేయగలిగింది మంచి విద్య అందించటమేనన్నారు. విద్యతోనే సమాజంలో గౌరవం లభిస్తుందన్నారు. నిబద్ధత లేని చదువు వల్ల ప్రయోజనం ఉండదని, ప్రతి విద్యార్థి కష్టపడి చదువుకోవాలని సూచించారు. 25 ఏళ్లు కష్టపడి చదివితే.. 75 ఏళ్ల వరకు గౌరవంగా జీవించవచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ డీకే అరుణ, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

**పాలమూరును బీఆర్ఎస్ పట్టించుకోలేదు.. కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి ఫైర్..** పదేళ్ల పాలనలో కేసీఆర్ పాలమూరును పట్టించుకోలేదని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మంజూరు చేసిన ఒక్క ప్రాజెక్ట్ అయినా పాలుమూరులో ఉందా? అని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రూ.1,284 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సీఎం శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'మక్తల్, నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం సహా పాలమూరును అభివృద్ధి చేసింది కాంగ్రెస్ పార్టీ. మేం అధికారంలోకి వచ్చాకే ప్రాజెక్టుల్లో వేగం పెరిగింది. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును 2013లో అప్పటి కాంగ్రెస్ నేతలు సాధించారు. బీఆర్ఎస్ పాలనలో ప్రాజెక్టు పేరు మీద రూ.23 కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించారు. కానీ ప్రాజెక్టు పూర్తి చేయలేదు. ఉద్దండాపూర్ జలాశయం భూ నిర్వాసితులకు నిధులు చెల్లించలేదు. సంగంబండ వద్ద బండ పగుల గొట్టేందుకు కేసీఆర్ పదేళ్లలో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. మేం అధికారంలోకి వచ్చాక భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం ఇచ్చాం. పాలమూరు బిడ్డ సీఎం కావడం వారికి నచ్చలేదు. మనం వాళ్ల మోచేతి నీళ్లు తాగాలని కోరుకున్నారు. ప్రాజెక్టులపై అసెంబ్లీలో చర్చ పెడితే ఆ పార్టీకి ముఖం చాటేశారు. అందరం కలిసి మహబూబ్‌నగర్ జిల్లాకు ఐఐఎంను తీసుకొద్దాం. పాలమూరు ఎమ్మెల్యేలను కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే రానివ్వలేదు. మారీచుడు, సుబాహులను శుక్రాచార్యుడు పంపించి.. మేం చేసే ప్రాజెక్టులను అడ్డుకుంటున్నారు. మాకు కూడా వ్యూహాలు, ఎత్తుగడలు తెలుసు. ఎవరు ఎలా వచ్చినా ప్రజలు వారిని తరిమికొడతారు. డబుల్ బెడ్‌రూమ్ ఇచ్చిన ఇళ్లలోనే వాళ్లు ఓట్లు అడగాలి. ఇందిరమ్మ ఇళ్లు ఉన్న ఊళ్లోనే మేము ఓట్లు అడుగుతాం. మా సవాల్‌ను బీఆర్ఎస్ స్వీకరిస్తుందా?' అని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. 'హైదరాబాద్ రాష్ట్రానికి తొలి సీఎం పాలమూరు బిడ్డే. 75 తర్వాత మళ్లీ ఆ అవకాశం ఇప్పుడొచ్చింది. 17 ఏళ్లలో అన్ని చట్టసభల్లో పనిచేశా. ప్రజలకు ఏదైనా మేలు చేయాలనే తపన తప్ప నాకు మరో ఆలోచన లేదు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ సాగుతున్నాం. నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ పాలమూరు జిల్లాకు వెలుగులు తేవాలని ఎన్నో కార్యక్రమాలు చేపట్టాం. కానీ విద్య పరంగా, సాగునీటి పరంగా నాటి పాలకులు నిర్లక్ష్యం వహించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అప్పట్లో డీకే అరుణ, విఠల్ రావు కలిసి అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డికి వివరించారు. అనంతరం కిరణ్ కుమార్ రెడ్డి సీఎంగా ఉన్నపుడు ఆ ప్రాజెక్టు మంజూరైంది. కల్వకుర్తిలో మాడ్గులకు నీళ్లు రావాలంటే రూ. 75 కోట్లు అవసరం వచ్చాయి. కానీ ఆ నిధులను గత ప్రభుత్వం ఇవ్వలేదు. మేము అధికారంలోకి వచ్చాక రూ.1400 కోట్లతో నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పతకాన్ని తీసుకొచ్చాం. రూ.123 కోట్లతో జూరాల వద్ద బ్రిడ్జి నిర్మించాం' అని రేవంత్ రెడ్డి అన్నారు.

# ప్రధాని కొత్త కార్యాలయం సిద్ధం

## ఈ నెలలోనే ప్రారంభం

## సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా నిర్మాణం




న్యూఢిల్లీ: ఢిల్లీలో ప్రతిష్టాత్మక సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ప్రధానమంత్రి కొత్త కార్యాలయం ప్రారంభానికి సిద్ధమైంది. రైసినా హిల్ సమీపంలో అత్యాధునిక సౌకర్యాలతో రూపుదిద్దుకున్న ఈ భవన సముదాయంలోకి ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెలలోనే మారే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. నిర్మాణ దశలో 'ఎగ్జిక్యూటివ్ ఎన్‌క్లేవ్‌'గా పిలిచిన ఈ సముదాయానికి కేంద్ర ప్రభుత్వం 'సేవా తీర్థ్‌' అని నామకరణం చేసింది. ఈ ప్రాంగణంలో మొత్తం మూడు మెయిన్ బిల్డింగులు ఉన్నాయి. ఒకదాంట్లో ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంవో) ఉంటుంది. రెండో భవనం నుంచి కేబినెట్ సెక్రటేరియెట్ విధులు సాగుతాయి.

మూడో భవనంలో జాతీయ భద్రతా మండలి సెక్రటేరియట్(ఎన్ఎస్‌సీఎస్)తో పాటు జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ కార్యాలయం ఉంటుంది.

**ప్రత్యేకతలివే..** కొత్త కార్యాలయంలో విదేశీ ప్రముఖులు, అతిథులతో సమావేశమయ్యేందుకు వీలుగా హై–ఎండ్ రూమ్‌లను రూపొందించారు. ఇవి అత్యాధునిక సాంకేతికతను కలిగి ఉండటమే కాకుండా.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉన్నాయి. ముఖ్యంగా కేబినెట్ సమావేశాల కోసం ఒక హాలును సిద్ధం చేశారు. అధికారుల మధ్య సమన్వయం పెంచేందుకు 'ఓపెన్ ఫ్లోర్‌' మోడల్‌ను ఇక్కడ అమలుచేస్తున్నారు. కాగా.. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు ప్రధానమంత్రి కార్యాలయం సౌత్ బ్లాక్ నుంచే పనిచేస్తున్నది. తాజా మార్పుతో దశాబ్దాల చరిత్రకు తెరపడనుంది. నార్త్ బ్లాక్, సౌత్ బ్లాక్‌లలో ఉన్న హోం, ఫైనాన్స్, విదేశీ వ్యవహారాలు, రక్షణ శాఖలు ఇప్పటికే కొత్తగా నిర్మించిన 'కర్తవ్య భవన్‌'కు తరలివెళ్లాయి. ఖాళీ అయిన ఈ పురాతన కట్టడాలను భారీ మ్యూజియంగా మార్చనున్నారు. సేవా తీర్థ్ సమీపంలోనే ప్రధాని కొత్త నివాసం కూడా నిర్మాణం అవుతున్నది. ప్రస్తుతం 7 లోక్ కల్యాణ్ మార్గ్‌లో ఉన్న ప్రధాని నివాసాన్ని కూడా అక్కడికే మార్చనున్నారు.

చురకలు

ఆదివారం 18 జనవరి 2026




హైదరాబాద్: తెలంగాణలో కార్పొరేషన్ మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్‌ల రిజర్వేషన్లు ఖరారయ్యాయి.

మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు కేటాయించినట్లు మున్సిపల్ శాఖ డైరెక్టర్ శ్రీదేవి తెలిపారు. ఈ మేరకు మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. 121 మున్సిపాలిటీల్లో 5 ఎస్టీ, 17 ఎస్సీ, 38 బీసీలకు కేటాయించారు. కొత్తగూడెం కార్పొరేషన్- ఎస్టీ జనరల్, రామగుండం కార్పొరేషన్- ఎస్సీ జనరల్, మహబూబ్‌నగర్ కార్పొరేషన్- బీసీ మహిళ. మంచిర్యాల కార్పొరేషన్- బీసీ జనరల్, కరీంనగర్ కార్పొరేషన్- బీసీ జనరల్, జీహెచ్ఎంసీ-మహిళా జనరల్. గ్రేటర్ వరంగల్-జనరల్. ఖమ్మం కార్పొరేషన్-మహిళా జనరల్, నల్గొండ కార్పొరేషన్-మహిళా జనరల్, నిజామాబాద్ కార్పొరేషన్- మహిళా జనరల్.




మహబూబ్‌నగర్: దేశంలో ఏ ప్రాజెక్టు కట్టినా.. వాటిలో పాలమూరు బిడ్డల శ్రమ ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో రూ.1,284 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. "దేశంలోనే అత్యంత వెనుకబడిన మండలం ఈ జిల్లాలోని గట్టు మండలం. భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం పదేళ్లపాటు పాలమూరు జిల్లా ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసింది. కేసీఆర్ పదేళ్లపాటు పాలమూరు జిల్లాకు ఒక్క ప్రాజెక్ట కూడా తీసుకురాలేదు. పాలమరు-రంగారెడ్డి ప్రాజెక్టును 2013లో అప్పటి కాంగ్రెస్ నేతలు సాధించారు. ప్రాజెక్టు పేరు మీద రూ.23 కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించారు కానీ, ప్రాజెక్టు పూర్తి చేయలేదు. ఉద్ధండాపూర్ జలాశయం భూ నిర్వాసితులకు నిధులు చెల్లించలేదు. సంగంబండ వద్ద బండ పగుల గొట్టేందుకు కేసీఆర్ పదేళ్లలో ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని పదేళ్లపాటు నిర్లక్ష్యం చేశారు. గతంలో పాలమూరు జిల్లా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. జిల్లాలోని ప్రాజెక్టుల గురించి అడగలేదు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చ పెడితే సభకు రాకుండా పారిపోయారు. భాజపా ఎంపీలు రాష్ట్రానికి ఐఐఎం సాధిస్తే.. పాలమూరు జిల్లాలోనే భూమి ఇచ్చే బాధ్యత నాది. పాలమూరు జిల్లాను వెనకబడిన జిల్లాగా ఇంకా ఎన్నాళ్లు చూపించాలి? పదేళ్లలో రూ.1.80లక్షల కోట్లు ఖర్చు చేశారు కానీ.. ఒక్క ప్రాజెక్టు పూర్తి చేయలేదు. కాళేశ్వరం ప్రాజెక్టు ఒక్కటి పూర్తి చేశారు.. అది మూడేళ్లకే కుప్పకూలింది. పాలమూరు జిల్లాలోని ప్రాజెక్టులన్నీ పూర్తి చేసే బాధ్యత నాది. ఇవాళ రాష్ట్రంలో 3.50 కోట్ల మంది పేదలకు రేషన్ కార్డులపై సన్న బియ్యం ఇస్తున్నాం. గతంలో పదేళ్ల పాటు పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు. ఈ ప్రభుత్వం తొలి ఏడాదిలోనే 4.50లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసింది. మారీచ, సుబాహులు ఏ రూపంలో వచ్చినా ఈ సారి ప్రజలు తరిమి కొడతారు" అని సీఎం అన్నారు.




సంగారెడ్డి: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని సంగారెడ్డికి పిలిచి ఇన్సల్ట్ చేశానేమోనని తాను ఫీల్ అయ్యానని సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. తన కోసం రాహుల్ గాంధీ సంగారెడ్డికి వచ్చి.. తనను గెలిపించాలని ప్రచారం చేస్తే ఇక్కడి ప్రజలు ఓడించారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే సంగారెడ్డిలో తాను ఎమ్మెల్యేగా జీవితంలో పోటీ చేయనని శపథం చేశారు. ఇళ్ల జాగా లేని పేదలతో సంగారెడ్డిలోని గంజి మైదానంలో టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డితో పాటు మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ తన భుజంపై చేయి వేసి జగ్గారెడ్డిని గెలిపించాలని అడిగితే.. ఇక్కడి ప్రజలు ఓడించారని ఆవేదన వ్యక్తం చేశారు. తన జీవితంలో ఇది మరిచిపోలేనిదని అన్నారు. తన ఓటమికి కారణం పేద ప్రజలు కాదని.. ఇక్కడి మేధావులు.. పెద్దలు అని పేర్కొన్నారు. సంగారెడ్డిలో తన భార్య నిర్మల పోటీ చేసినా.. తాను ప్రచారానికి కూడా రానని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడికైనా వెళ్లి ప్రచారం చేస్తా కానీ.. సంగారెడ్డిలో మాత్రం చేయనని తేల్చి చెప్పారు.

## జంట నగరాల అస్తిత్వం దెబ్బతీస్తే ఉపేక్షించం: కేటీఆర్



హైదరాబాద్: సికింద్రాబాద్ కార్పొరేషన్ కోసం బీఆర్ఎస్ ర్యాలీకి సిద్ధమైంది. సికింద్రాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ.. మాజీ మంత్రి తలసాని ఆధ్వర్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ఎంజీ రోడ్‌లోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు భారీ శాంతి ర్యాలీకి నేతలు బయలుదేరారు. అయితే.. తమను పోలీసులు అడ్డుకున్నారని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. "జంట నగరాల అస్తిత్వం దెబ్బతీస్తే ఉపేక్షించం.

ప్రజలకు నిరసన హక్కు లేకుండా చేశారు. ప్రజల దీవెనలతో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుంది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. తుగ్లక్ పనులు చేస్తోంది" అని కేటీఆర్ అన్నారు. కోర్టు నుంచి అనుమతి తీసుకుని మళ్లీ ర్యాలీ నిర్వహిస్తామని ఆ పార్టీ నేత తలసాని అన్నారు. తాము నిర్వహిస్తున్నది శాంతియుతమైన ర్యాలీ అని.. అందరినీ ఆహ్వానించినట్లు తెలిపారు. ర్యాలీని అడ్డుకోవడం ప్రభుత్వానికి మంచిది కాదని మండిపడ్డారు.




## విమానాలకు అమెరికా హెచ్చరికలు.. మెక్సికోపై ట్రంప్ దాడి కోసమేనా?

వాషింగ్టన్: అమెరికా విమానయాన సంస్థలకు అగ్రరాజ్య ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ హెచ్చరికలు జారీ చేసింది. మెక్సికో, సెంట్రల్ అమెరికా, పనామా సహా తూర్పు పసిఫిక్ మహా సముద్రంలోని కొన్ని ప్రాంతాల గగనతలం మీదుగా ప్రయాణిస్తున్నప్పుడు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించింది. సైనిక కార్యకలాపాల నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో ముప్పు ఎదురయ్యే అవకాశం ఉందని ఎయిర్‌లైన్లను హెచ్చరించింది. ఈ మేరకు అమెరికాకు చెందిన అన్ని విమానయాన సంస్థలకు అడ్వైజరీ నోటీసు జారీ చేసింది. ఈ నోటీసు 60 రోజుల వరకు అమల్లో ఉంటుందని పేర్కొంది. "విమానం ఎంత ఎత్తులో ఉన్నా.. ల్యాండింగ్, టేకాఫ్ దశల్లో ఉన్నా సరే.. వాటికి ముప్పు ఎదురయ్యే ప్రమాదం ఉంది" అని ఎఫ్ఏఏ ఆ నోటీసుల్లో స్పష్టం చేసింది. సాధారణంగా సమీప ప్రాంతాల్లో యుద్ధం లేదా ఉద్రిక్త పరిస్థితులు ఉన్న సమయంలో ఇలాంటి నోటీసులు జారీ చేస్తుంటారు. ఇటీవల మెక్సికోపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యక్షంగానే తీవ్ర హెచ్చరికలు చేసిన సంగతి తెలిసిందే. ఆ దేశంలో ఉన్న మాదకద్రవ్యాల ముఠాలు, స్థావరాలను లక్ష్యంగా చేసుకుని భూతల దాడులు చేస్తామంటూ హెచ్చరించారు. లాటిన్ అమెరికాలోని మెక్సికో సహా క్యూబా, కొలంబియా వంటి దేశాలు మాదకద్రవ్యాలను తయారు చేస్తూ అమెరికాలోకి అక్రమంగా సరఫరా చేస్తున్నాయని అగ్రరాజ్య అధ్యక్షుడు ఆరోపించారు. ఈ పద్ధతి మార్చుకోకపోతే వెనెజువెలా పరిస్థితే ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా కట్టడి పేరుతో ఇటీవల వెనెజువెలాపై మెరుపుదాడులు చేసిన అమెరికా సైన్యం.. ఆ దేశాధినేతగా ఉన్న నికోలస్ మదురో, ఆయన భార్యను బంధించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే మిగతా లాటిన్ అమెరికా దేశాలకూ ఆయన వార్నింగ్ ఇచ్చారు. ఈ పరిణామాల వేళ తాజాగా ఎయిర్‌లైన్లకు ఎఫ్ఏఏ అడ్వైజరీ నోటీసులు జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. మెక్సికోపై దాడి చేసేందుకే విమానాలకు ఈ హెచ్చరికలు చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## ఈ పోరాటం ముగియలేదు.. బీఎంసీ చేజారడంపై ఉద్ధవ్ పార్టీ తొలిస్పందన





ముంబై: బృహన్‌ముంబై మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో 25 ఏళ్ల తర్వాత శివసేన ఆధిపత్యానికి బీజేపీ-షిండే శివసేన కూటమి గండికొట్టడంతో ఉద్ధవ్ ఠాక్రే సారథ్యంలోని శివసేన తొలిసారి స్పందించింది. మహారాష్ట్రలో రాజకీయ యుద్ధం ఇంతటితో ముగిసినట్టు కాదని.. మరాఠా ప్రజలకు సముచిత గౌరవం దక్కేంత వరకూ ఈ పోరాటం కొనసాగుతుందని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పేర్కొంది. 'యుద్ధం ఇప్పటితో ముగియలేదు. మరాఠా వ్యక్తులకు తగినంత గౌరవం దక్కేంత వరకూ ఈ పోరాటం ఇలాగే కొనసాగుతుంది' అని శివసేన యూబీటీ ట్వీట్ చేసింది.

**సీట్లు.. ఓట్లు...** బీఎంసీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ, ఏక్‌నాథ్ షిండే శివసేన కూటమి ఏకైక పెద్ద కూటమిగా నిలిచింది. శివసేన(యూబీటీ), మహారాష్ట్ర నవనిర్మాణ సేన(ఎంఎన్ఎస్) కూటమి సైతం గణనీయంగా సీట్లు, ఓట్లు సాధించింది. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన అధికారిక లెక్కల ప్రకారం.. బీజేపీ 89 సీట్లు గెలుచుకుంది. ఆ పార్టీకి 11,79,273 ఓట్లు పోలయ్యాయి. 21.58 శాతం ఓటింగ్ షేర్ సాధించింది. గెలిచిన అభ్యర్థుల్లో బీజేపీ ఓట్ షేర్ 45.22 శాతంగా ఉంది. దీంతో ఏకైక పెద్దపార్టీగా బీజేపీ నిలిచింది. బీజేపీ భాగస్వామి పార్టీ అయిన శివసేన(షిండే వర్గం) 29 సీట్లు గెలుచుకుంది. 2,77,326 ఓట్లు సాధించింది. మొత్తం ఓట్ షేర్‌లో 5 శాతం దక్కించుకుంది. బీజేపీ-శివసేన(షిండే) కలిసి బీఎంసీలో అతిపెద్ద కూటమిగా నిలిచింది. ఎంఎన్ఎస్‌తో కలిసి పోటీ చేసిన శివసేన(యూబీటీ) 65 సీట్లు గెలుచుకుంది. యూటీబీ సారథ్యంలోని సేనకు 7,17,735 ఓట్లు వచ్చాయి. మొత్తం పోలైన ఓట్లలో ఇది 13.13 శాతం. ఎంఎన్ఎస్ 6 సీట్లు దక్కించుకుంది. 74,946 ఓట్లు గెలుచుకుని.. 1.37 శాతం ఓట్ షేర్ సంపాదించింది. కాంగ్రెస్ పార్టీ 24 సీట్లు గెలుచుకుని 4.44 శాతం ఓట్ షేర్ సాధించింది. ఇతర పార్టీల్లో ఎఐఎంఐఎం 8 సీట్లతో 68,072 ఓట్లు సాధించింది. ఎన్‌సీపీ 3 సీట్లు, సమాజ్‌వాదీ పార్టీ 2 సీట్లు, ఎన్‌సీపీ(శరద్‌చంద్ర పవార్) పార్టీ ఒక సీటు గెలుచుకున్నాయి.

## 'లక్కీడ్రా' పేరుతో మోసాలు.. ఇన్‌ఫ్లూయెన్సర్లకు సజ్జనార్ వార్నింగ్

హైదరాబాద్: బెట్టింగ్ యాప్‌ల మోసాలపై ఉక్కుపాదం మోపడంలో కీలకంగా వ్యవహరించిన హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్.. ఇప్పుడు లక్కీడ్రాలపై దృష్టి సారించారు. డ్రాల పేరుతో అమయాక ప్రజలను మోసం చేస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఇన్‌ఫ్లూయెన్సర్లను హెచ్చరించారు. ఇలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఈ మేరకు ఎక్స్‌లో శనివారం పోస్ట్ పెట్టారు. కార్లు, బైకులు, డీజేలు ఇస్తామంటూ కొందరు ఇన్‌ఫ్లూయెన్సర్లు సామాజిక మాధ్యమాల్లో లక్కీడ్రా పేరుతో మోసాలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని సజ్జనార్ పేర్కొన్నారు. బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ల దందా బంద్ కావడంతో లక్కీ డ్రా అంటూ కొత్త వేషాలతో వీళ్లు దర్శనమిస్తున్నారని తెలిపారు. అమాయక ప్రజల ఆశను ఆసరాగా చేసుకుని మోసం చేసే ఇన్‌ఫ్లూయెన్సర్లను.. ది ప్రైజ్ చిట్స్ అండ్ మనీ సర్క్యులేషన్ స్కీమ్స్ (బ్యానింగ్) యాక్ట్, 1978




కింద కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ తరహా మోసాలకు పాల్పడే సెలబ్రిటీలైనా, సోషల్‌మీడియా స్టార్లయినా సరే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పాపులారిటీని అడ్డం పెట్టుకుని ప్రజలను దోచుకుంటే కఠిన చర్యలు తప్పవని సజ్జనార్ హెచ్చరించారు.

## త్వరలో మున్సిపల్ ఎన్నికలు.. కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాల్సిందే: రాంచందర్ రావు



హైదరాబాద్, జనవరి 17: రాష్ట్రంలో త్వరలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుందని.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తాము సిద్ధంగా ఉన్నామని తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు పేర్కొన్నారు. శనివారం నాడు మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు చేసిన కృషిని ఆయన అభినందించారు. దాదాపు 5 వేల సర్పంచ్ స్థానాలకు పోటీ చేశామని.. గతంలో కంటే బీజేపీ సర్పంచ్‌ల సంఖ్య పెరిగిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బీజేపీ బలోపేతమైందని.. ఇందుకు ఈ ఫలితాలే నిదర్శనమని చెప్పారు.

**బీఆర్ఎస్ ముక్కలవడం ఖాయం..** బీఆర్ఎస్ పార్టీ త్వరలో ముక్కలవుతుందని, ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని తెలంగాణ బీజేపీ చీఫ్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లడం, సభలు నిర్వహించడం తప్ప ఏమీ చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 40 శాతం కమిషన్‌గా మారిపోయిందని, పారిశ్రామికవేత్తలను బెదిరిస్తుందని ఆరోపణలు చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు పెద్దఎత్తున నిధులు అందిస్తోందని.. వాటితోనే అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రాజెక్టులకు, విద్యాలయాలకు భూమి కేటాయించడం లేదని ఆయన విమర్శించారు.

**అబద్ధాలు ప్రచారం..** కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు ఏమీ చేయలేదని రాంచందర్ రావు విమర్శించారు. గ్రామాల్లో అభివృద్ధికి ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లాల్సిన అవసరం లేదని, కేంద్ర నిధులతోనే చేయవచ్చని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర పథకాలపై అబద్ధాలు ప్రచారం చేస్తోందని.. తప్పుడు సమాచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందని ఆరోపించారు. మున్సిపాలిటీల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. గ్రామాలు, పట్టణాల్లో కేంద్ర పథకాలను తీసుకెళ్లాలని సూచించారు. ఇటీవల త్రివేండ్రం ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేశామని.. కేరళలో కార్యకర్తలపై దాడులు జరిగినా పట్టువదలకుండా పనిచేశామని, ముంబై కార్పొరేషన్‌లోనూ గెలిచామని గుర్తుచేశారు. బీఎంసీ ఎన్నికల్లో 29 మున్సిపాలిటీల్లో 25 స్థానాల్లో బీజేపీ గెలిచిందని పేర్కొన్నారు.

**అందుకు మేం సిద్ధం..** తెలంగాణ అభివృద్ధి చెందాలంటే బీజేపీని గెలిపించాలన్నారు రాంచందర్ రావు. ప్రజల సేవకు కమిట్మెంట్‌తో పనిచేస్తామని, ప్రజలతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన తెలిపారు. మున్సిపాలిటీలకు కేటాయించిన ప్రాంతాల్లో నాయకులు అక్కడే ఉండాలని, బీజేపీ జెండాను ఎగురవేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పిలుపునిచ్చారు.





డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం ఆదుర్రులో సంక్రాంతి పండక్కి వచ్చిన కొత్త అల్లుడికి 1,574 రకాల ఆహార పదార్థాలతో విందు ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన విజ్జెపు వెంకటరత్నం, సుశీల దంపతులు గత ఫిబ్రవరిలో తమ కుమార్తె కీర్తిశ్రీని పి.గన్నవరం మండలం ముంగండకు చెందిన సాయిశరత్‌కు ఇచ్చి వివాహం చేశారు. అల్లుడికి వివిధ ప్రాంతాల నుంచి తెచ్చిన స్వీట్లు, పిండివంటలు, పలు రకాల పండ్లు, శీతలపానీయాలతో విందు ఏర్పాటు చేశారు.




## ఏపీఎస్ఆర్టీసీకి ప్రతిష్టాత్మక అవార్డు.. మంత్రి మండిపల్లి ప్రశంసలు

అమరావతి: ఏపీఎస్ఆర్టీసీకి ప్రతిష్టాత్మక 'గవర్నెన్స్ నౌ- 6వ డిజిటల్ ట్రాన్స్ఫర్మేషన్ సమ్మిట్ల అవార్డు రావడం గర్వకారణమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఆర్టీసీ అధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది.. ప్రయాణికులకు అంకితభావంతో సేవలు అందిస్తున్నారని ప్రశంసించారు. ప్రయాణికులకు ముందస్తు సమాచారం అందించడం ద్వారా సేవల నాణ్యత మరింత మెరుగుపడిందన్నారు. డిజిటల్ సాంకేతికతను ప్రజాసేవకు వినియోగించిన ఆర్టీసీ కృషికి జాతీయ స్థాయి గుర్తింపు వచ్చిందని అన్నారు. ప్రధాన బస్టాప్‌లలో ఆటోమేటిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్ (ూూూ) అమలు ప్రశంసనీయమన్నారు. అవార్డు సాధనలో కీలక పాత్ర పోషించిన ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావుకు మంత్రి అభినందనలు తెలిపారు. సాంకేతికతను అందిపుచ్చుకుని సీఎం చంద్రబాబు విజన్‌కు అనుగుణంగా ఆర్టీసీ ముందడుగు వేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో ప్రయాణికులకు మరింత ఆధునిక, సౌకర్యవంతమైన సేవలు అందిస్తామన్నారు. 2025 ఏడాదికి గాను ఏపీఎస్ఆర్టీసీ ఈ అవార్డుకు ఎంపికైంది. అన్ని ప్రధాన బస్ స్టేషన్లలో ఆటోమేటిక్ అనౌన్స్‌మెంట్ సిస్టమ్ (ూూూ) ను ఏర్పాటు చేసి అమలు చేస్తున్నందుకు అవార్డు సాధించింది. ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు దిల్లీలో అవార్డు తీసుకున్నారు.

## ప్రపంచ స్వచ్ఛ ఇంధన రంగంలో మైలురాయి : చంద్రబాబు



అమరావతి: ప్రపంచ స్వచ్ఛ ఇంధన రంగంలో ఆంధ్రప్రదేశ్ మైలురాయి సాధించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 2024 అక్టోబర్‌లో ఆంధ్రప్రదేశ్ సమగ్ర స్వచ్ఛ ఇంధన విధానాన్ని ప్రారంభించినప్పుడు.. ఏపీని దేశ గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తీర్చిదిద్దాలనే స్పష్టమైన సంకల్పాన్ని వ్యక్తం చేశామని గుర్తుచేశారు. ఇవాళ కాకినాడలో AM Gree అ సంస్థ చేపడుతున్న 1.5 MTPA గ్రీన్ అమోనియా ప్రాజెక్టు ఏర్పాటు పనులు ప్రారంభించనుండటం మైలురాయిగా నిలుస్తోందన్నారు. దీని ద్వారా ఆంధ్రప్రదేశ్ నికర గ్రీన్ ఎనర్జీ ఎగుమతిదారుగా మారే దిశగా మరో కీలక అడుగు వేసిందని సీఎం తెలిపారు. 10 బిలియన్ డాలర్ల విలువైన ఈ సమగ్ర పెట్టుబడి ప్రాజెక్ట్‌లో 7.5 గిగావాట్ల సౌర, పవన విద్యుత్ సామర్థ్యం, 1 గిగావాట్ పంప్డ్ స్టోరేజ్ హైడ్రో విద్యుత్ కేంద్రం ఉన్నాయన్న ఆయన.. అన్నీ ఆంధ్రప్రదేశ్‌లోనే ఏర్పాటు కావడం తమ ఎండ్-టు-ఎండ్ స్వచ్ఛ ఇంధన ఎకోసిస్టమ్ బలాన్ని స్పష్టంగా చూపిస్తోందన్నారు. కాకినాడలో ఉత్పత్తి అయ్యే గ్రీన్ అమోనియా జర్మనీతో పాటు ఇతర అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి అవుతుందని తెలిపారు. ఇది ప్రపంచంలోనే తొలి తరహా ప్రాజెక్ట్ అని సీఎం అన్నారు. ఈ చారిత్రక ప్రాజెక్ట్‌కు సంబంధించిన పరికరాల ఏర్పాటు కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, తాను పాల్గొంటున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

## కోడిపందేల్లో లక్కీ డ్రా.. బుల్లెట్ బండి సొంతం

మచిలీపట్నం: కృష్ణా జిల్లా మచిలీపట్నంలో కోడి పందేల్లో ఓ వ్యక్తి బుల్లెట్ బండి దక్కించుకున్నాడు. లక్కీ డ్రాలో రూ.2.50 లక్షల విలువ చేసే బైక్‌ను కైవసం చేసుకున్నాడు. మచిలీపట్నం మంగినపూడి బీచ్ రోడ్డులోని ఓ బరిలో నిర్వాహకులు లక్కీ డ్రా తీశారు. ఒక్కో కూపన్ రూ.500కు విక్రయించారు.

చివరి రోజు పందేలు ముగిసిన తర్వాత డ్రా తీశారు. ఇందులో ఆకుల సతీష్ అనే వ్యక్తికి బుల్లెట్ బండి వరించింది. సెకండ్ లక్కీ డ్రా విజేతకు డబుల్ డోర్ ఫ్రిజ్ అందజేశారు. మొత్తం ఐదుగురు లక్కీ డ్రా విజేతలకు బహుమతులు అందజేశారు.






## నంద్యాలలో విషాదం.. ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య

నంద్యాల : నంద్యాల ఎన్జీవో కాలనీలో విషాదం చోటుచేసుకుంది. ఇద్దరు పిల్లలను చంపి.. తల్లి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతులను మల్లిక (26), ఇషాన్ సాయి(2), పరిమిత(7 నెలలు)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక లలితా నగర్‌కు చెందిన ఉదయ్ కిరణ్‌కు.. ఎన్జీవో కాలనీకి చెందిన మల్లికతో ఏడేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. కొన్నేళ్ల నుంచి భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. నిన్న రాత్రి కూడా గొడవ జరిగినట్లు సమాచారం. అనంతరం పిల్లలను తీసుకుని గదిలోకి వెళ్లి మల్లిక తలుపు వేసుకుంది. తర్వాత పిల్లలను చంపి తానూ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఉదయం గది తలుపులు బద్దలు కొట్టి చూడగా.. ముగ్గురూ విగత జీవులుగా పడి ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




ఢాకా: బంగ్లాదేశ్‌లో మైనారిటీలే లక్ష్యంగా దాడులు కొనసాగుతున్నాయి. శుక్రవారం మరో హిందువును అక్కడి వ్యక్తి కారుతో ఢీకొట్టి హత్య చేసినట్లు స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. మీడియా కథనాల ప్రకారం.. రాజ్‌బరిలోని కరీం ఫిల్లింగ్ స్టేషన్‌లో రిపోన్ సాహా (30) పనిచేస్తున్నాడు. శుక్రవారం బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) రాజ్‌బరి జిల్లా యూనిట్ మాజీ కోశాధికారి అబుల్ హాషేమ్ పెట్రోల్ కోసం వచ్చాడు. పెట్రోల్ కొట్టించుకున్నాక డబ్బు ఇవ్వకుండా వెళ్లడానికి ప్రయత్నించడంతో రిపోన్ అతడిని ఆపడానికి ప్రయత్నించాడు. ఇంధనానికి అయిన డబ్బు చెల్లించాలని అడగడంతో ఆగ్రహానికి గురైన హాషేమ్ కారుతో రిపోన్ పైకి దూసుకువెళ్లాడు. కారు తన పైనుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలపాలైన రిపోన్ అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు వాహనాన్ని స్వాధీనం చేసుకొన్నారు. అబుల్ హాషేమ్‌ను, అతడి కారు డ్రైవర్‌ను అరెస్టు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు. కాగా దాదాపు మూడు వారాల వ్యవధిలోనే పది మంది హిందువులు హత్యకు గురవడంతో బంగ్లాలో హిందువుల భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది.

## దావోస్‌కు ఏపీ సీఎం చంద్రబాబు

ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు మరోసారి దావోస్ పర్యటనకు వెళుతున్నారు. భారీ పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా చంద్రబాబు రేపు దావోస్ బయలుదేరనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రపంచ దేశాల ఆర్థిక సదస్సులో ప్రధాన వక్తగా మాట్లాడనున్నారు.


మొత్తం ఐదు సెషన్లు ఉండగా మూడు సెషన్లతో చంద్రబాబు, రెండు సెషన్లలో లోకేష్ మాట్లాడనున్నారు. మొత్తం నాలుగు రోజుల పాటు సీఎం దావోస్ లో పర్యటిస్తుండగా ఈ పర్యటనలో 36 కార్యక్రమాల్లో పాల్గొంటారు. అంతేకాకుండా ఐబీఎం, గూగుల్ క్లౌడ్, ఏపీ మోలర్ మేర్స్క్ సీఈవోలతో చంద్రబాబు భేటీ కానున్నారు. వీరితో పాటు స్విట్జర్లాండ్, యూఏఈ సహా పలు దేశాల ప్రతినిధులతో సమావేశం అవ్వనున్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో క్లీన్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్ తో పాటు ఐటీ, పలు కీలక రంగాల్లో పెట్టుబడులు ఆకర్షించాలని ప్రభుత్వం భావిస్తుంది. ఇక పర్యటన అనంతరం చంద్రబాబు తిరిగి ఈ నెల 23న అమరావతికి పయనమవుతారు.




## ఎటూ చూసినా ఆందోళనలే: ఇరాన్ పరిస్థితులను వివరించిన భారతీయులు

ఇరాన్‌లో పరిస్థితులు క్షీణించడంతో అక్కడ చిక్కుకున్న భారతీయులను విదేశాంగ శాఖ సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చింది. తొలివిడతలో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి తర్వాత పలువురు భారతీయులు దిల్లీకి చేరుకున్నారు. అనంతరం వారు ఇరాన్‌లో పరిస్థితుల గురించి మీడియాతో మాట్లాడారు. ఇరాన్‌లో ఎక్కడ చూసినా ఆందోళనకారులే ఉన్నారని.. ఇంటి నుంచి బయటకు వచ్చే పరిస్థితులే లేవన్నారు. వీధుల్లో నిరసనకారుల మృతదేహాలు, ప్రజల హాహాకారాలతో పరిస్థితులు దారుణంగా ఉన్నాయన్నారు. ఇంటర్నెట్ సదుపాయం నిలిపివేయడంతో తమ పరిస్థితిని కుటుంబసభ్యులకు వివరించే అవకాశం లేక తీవ్ర భయాందోళనకు గురయ్యామన్నారు.

విదేశాంగశాఖ అధికారులను సంప్రదించడానికి కూడా వీలు కాలేదన్నారు. ఈ రెండు వారాలపాటు క్షణమొక యుగంలా గడిచిందన్నారు. తిరిగి భారత్‌కు వస్తామనుకోలేదని.. ఇటువంటి క్లిష్ట సమయంలో తమను సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చినందుకు కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. తమ వారి కోసం విమానాశ్రయానికి చేరుకున్న కుటుంబసభ్యులు మాట్లాడుతూ.. చాలా రోజులుగా తమ వారితో ఎటువంటి సంప్రదింపులు లేవన్నారు. ఇరాన్‌లో ఉద్రిక్తతల నేపథ్యంలో వారి పరిస్థితిపై తాము ఆందోళన చెందామని.. కానీ మోదీ ప్రభుత్వం చొరవతో తమ కుటుంబసభ్యులు తిరిగి వచ్చినందుకు ఆనందంగా ఉందన్నారు. ఇరాన్‌లో ప్రస్తుతం 10 వేలమందికి పైగా భారతీయులు (విద్యార్థులు సహా) నివసిస్తున్నట్లు అంచనా. వివిధ ప్రాంతాల్లో ఉన్న వీరిని సంప్రదించేందుకు టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయ సిబ్బంది ప్రయత్నాలు చేస్తోంది. అనేక ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు నిలిచిపోవడం, మరికొన్ని ప్రాంతాల్లో అప్పుడప్పుడు పనిచేస్తుండడం ఇందుకు ఇబ్బందికరంగా మారినట్లు తెలుస్తోంది. దీంతో ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వారిని చేరుకునేందుకు ఎంబసీ సిబ్బంది ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. అందుబాటులో ఉన్న మార్గాల్లో దేశాన్ని వీడాలని విదేశాంగ శాఖ (వీజూూ) వారికి సూచించింది. స్వదేశానికి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నవారిని సురక్షితంగా తీసుకురావడానికి చర్యలు తీసుకుంటోంది.




అమరావతి: మద్యం కుంభకోణం కేసులో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డికి ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ నెల 22న విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొంది. మద్యం కుంభకోణం కేసు దర్యాప్తు కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ విచారణకు గతంలో విజయసాయిరెడ్డి హాజరై పలు అంశాలను వెల్లడించారు. ఈ కేసు విషయంలో రెండుసార్లు మీడియా ముందుకు వచ్చారు. గత ఏడాది ఏప్రిల్ 22న సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా తాను ఈ కేసులో విజిల్ బ్లోయర్ అంటూ పోస్టు పెట్టారు.




హైదరాబాద్: సంక్రాంతి రద్దీ నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. పండగ అనంతరం ఏపీ నుంచి హైదరాబాద్ వచ్చే వాహనాలను దారి మళ్లిస్తున్నారు. ఎన్‌హెచ్-65 విస్తరణ పనుల దృష్ట్యా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. చిట్యాల, పెద్దకాపర్తి, కొర్లపహాడ్, పంతంగి టోల్‌ప్లాజాల వద్ద ట్రాఫిక్ జామ్ అయ్యే అవకాశాలు ఉండటంతో.. పోలీసులు ప్రత్యామ్నాయ మార్గాలు సూచించారు. గుంటూరు నుంచి హైదరాబాద్ వచ్చే వాహనాలను దారి మళ్లిస్తున్నారు. గుంటూరు-మిర్యాలగూడ- హాలియా- చింతపల్లి- మాల్ మీదుగా హైదరాబాద్‌కు వాహనాల మళ్లింపు చేపట్టారు. మాచర్ల- సాగర్- పెద్దవూర- చింతపల్లి- మాల్ మీదుగా వాహనాలను దారి మళ్లిస్తున్నారు. విజయవాడ నుంచి వచ్చే భారీ వాహనాలు కోదాడ- మాల్ మీదుగా హైదరాబాద్‌కు మళ్లిస్తున్నారు. ఎన్‌హెచ్-65పై ట్రాఫిక్ జామ్ ఏర్పడితే చిట్యాల నుంచి భువనగిరి మీదుగా వాహనాలను దారిమళ్లించనున్నారు. డ్రోన్ కెమెరాలు, సీసీ టీవీలతో ట్రాఫిక్ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

## అమరావతిపై విషం చిమ్మేలా జగన్ మాట్లాడుతున్నారు: మంత్రి పార్థసారథి



అమరావతి: రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పట్ల వైకాపాకి గౌరవం లేదని మంత్రి పార్థసారథి అన్నారు. అమరావతిపై విషం చిమ్మేలా జగన్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వైకాపా నాయకులకు ప్రజలు, రైతుల సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే అసెంబ్లీకి వచ్చి ప్రశ్నించాలని సవాల్ చేశారు. మూడు రాజధానుల పేరుతో జగన్ ఐదేళ్లపాటు కాలయాపన చేసి, ఒక్క రాజధాని కూడా నిర్మించకుండా రాష్ట్రాన్ని అయోమయంలోకి నెట్టిన తుగ్లక్ పాలనను ప్రజలు చూశారన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజల ఆగ్రహానికి గురైన వైకాపాకి అమరావతి పాపమే శాపమై కేవలం 11 సీట్లకే పరిమితం అయిందని ఆక్షేపించారు. నది ఒడ్డున రాజధాని ఎందుకు అని ప్రశ్నించే జగన్ రెడ్డికి.. లండన్, వాషింగ్టన్, కైరో వంటి ప్రపంచ నగరాలన్నీ నదీ తీరాల్లోనే అభివృద్ధి చెందిన విషయం తెలియకపోవడం ఆశ్చర్యకరమన్నారు. ఒకప్పుడు సైబరాబాద్‌ను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దిన చంద్రబాబు, ఇప్పుడు అమరావతిని క్వాంటం వ్యాలీగా తీర్చిదిద్ది రాష్ట్ర భవిష్యత్తుకు దారి చూపనున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వరల్డ్ బ్యాంక్, ఏడీబీ, నాబార్డ్ నుంచి రూ.వేల కోట్ల నిధులు సమీకరించి అమరావతి పనుల్లో వేగం పెంచిందన్నారు. అమరావతిలో భూముల విలువ పెరగడం ద్వారా వచ్చే ఆదాయంతో రాయలసీమ, ఉత్తరాంధ్ర సహా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్న స్పష్టమైన ఆర్థిక దృష్టితో ప్రభుత్వం ముందుకెళ్తోందని వివరించారు.

## అమరావతిలో పొట్టి శ్రీరాములు 58 అడుగుల విగ్రహం: డూండి రాకేష్



అమరావతి: ఈనెల 20న కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండి రాకేష్ కోరారు. జీవో నంబర్ 15తో అమ్మవారి ఆత్మార్పణ కార్యక్రమం ప్రభుత్వ అధికారిక కార్యక్రమమైందని తెలిపారు. వైకాపా హయాంలో దేవాదాయశాఖ మంత్రిగా పనిచేసిన వెల్లంపల్లి.. వైశ్యులకు, కన్యకాపరమేశ్వరి ఆలయాలకు చేసిందేమీ లేదని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో 20న అధికారిక కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

పొట్టిశ్రీరాములు 58 రోజుల దీక్షకు ప్రతీకగా మార్చి 16న అమరావతిలో 58 అడుగుల విగ్రహావిష్కరణ చేయనున్నట్లు డూండి రాకేష్ వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ఆర్యవైశ్యులకు పెద్దపీట వేస్తోందన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండను .. వాసవీ పెనుగొండగా పేరుమార్పు చేయడం ఆనందదాయకమన్నారు.

చురకలు

## సంపాదకీయం

# చైనాతో డీల్.. మళ్లీ ఫైటింగ్.. ఈ ట్రంప్ ఇక మారడంతే?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన మాటలతో మరోసారి ప్రపంచ దృష్టిని ఆకర్షించారు. ఇటీవల చైనాతో వాణిజ్య ఒప్పందానికి సంకేతాలు ఇచ్చిన ట్రంప్.. ఇప్పుడు మళ్లీ కఠిన హెచ్చరికలు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది.

**డీల్ నుండి వార్నింగ్‌కు.. పాలిటిక్స్‌లో కొత్త మలుపు!...** ఇటీవల దక్షిణ కొరియా పర్యటనలో భాగంగా ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ తో సుమారు రెండు గంటలపాటు గోప్యంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో వాణిజ్య టారిఫ్‌లు, అరుదైన ఖనిజాల సరఫరా, అలాగే తైవాన్ పరిస్థితిపై చర్చలు జరిగినట్టు సమాచారం.


**టారిఫ్‌ల తగ్గింపుతో సానుకూల సంకేతాలు...** ఆ తర్వాత ట్రంప్ చైనా మీద టారిఫ్‌లను 10 శాతం మేర తగ్గిస్తున్నట్టు ప్రకటించడం, రెండు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం త్వరలో కుదరనుందనే సంకేతాలు ఇవ్వడం, ప్రపంచ మార్కెట్లలో సానుకూల ప్రభావం చూపించింది.

**అకస్మాత్తుగా ఎందుకు హెచ్చరికలు?...** కానీ ఇప్పుడు అదే ట్రంప్ మళ్లీ చైనాకు వార్నింగ్ ఇవ్వడం ఆసక్తికరంగా మారింది. ఓ ప్రముఖ మీడియా ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన చేసిన వ్యాఖ్యలు కీలకంగా మారాయి. "తైవాన్‌పై చైనా మిలిటరీ చర్య తీసుకుంటే ఏమవుతుంది అనేది వారికే తెలుసు. ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నంతకాలం వారు జాగ్రత్తగా ఉంటారు" అని వ్యాఖ్యానించారు. "నేను ఎలాంటి రహస్యాలు బయటపెట్టను, కానీ జరిగే పరిణామాలు చైనాకు ఖచ్చితంగా తెలుసు," అని మరోమారు హెచ్చరించారు.

**జియో పాలిటిక్స్ లో ట్రంప్ వ్యూహం...** ఇక ఈ వ్యాఖ్యలు వస్తున్న సమయమే అమెరికా–చైనా మధ్య సంబంధాలు మళ్లీ సున్నిత దశలోకి వెళ్తున్నాయన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. గత కొన్నేళ్లుగా రెండు దేశాల మధ్య వాణిజ్య యుద్ధం, సాంకేతిక ఆంక్షలు, తైవాన్ సమస్య వంటి అంశాలు ప్రపంచ రాజకీయాలను ప్రభావితం చేస్తున్నాయి. చైనాతో మృదువుగా వ్యవహరించిన ట్రంప్ ఇప్పుడు అకస్మాత్తుగా గట్టిగా మాట్లాడటానికి కారణమేమిటన్నదే ఇప్పుడు విశ్లేషకుల చర్చ. కొందరి అభిప్రాయం ప్రకారం.. అమెరికా లో షట్ డౌన్ నడుస్తుండడంతో ట్రంప్ మళ్లీ "అమెరికా ఫస్ట్" నినాదాన్ని బలంగా వినిపిస్తూ దేశభక్తి భావనను పెంచే ప్రయత్నం చేస్తున్నారంటున్నారు. మరికొందరు, ఇది కేవలం చర్చలలో తమ బలాన్ని పెంచుకోవడానికి చేసే వ్యూహాత్మక చర్యగా భావిస్తున్నారు.

**ట్రంప్ స్టైల్ మారదు!..** మొత్తం మీద చైనాతో డీల్ ఒకవైపు.. మళ్లీ వార్నింగ్‌లు మరోవైపు ట్రంప్ పాలిటిక్స్ ఎప్పటిలాగే అంచనా వేయలేనిది. ఆయన చర్యలు, వ్యాఖ్యలు మరోసారి అంతర్జాతీయ వేదికపై అమెరికా–చైనా సంబంధాలపై కొత్త ఊపిరి రేపుతున్నాయి. కీలకంగా చెప్పాలంటే ట్రంప్ శైలీ మారదు.. నిన్న డీల్, ఈ రోజు ఫైట్. చైనాతో ఆయన రాజకీయ గేమ్ ఇంకా కొనసాగుతూనే ఉంది.

# భారతీయ ప్రజాస్వామ్య చారిత్రక చిహ్నం... పాత పార్లమెంట్ భవనం - జనవరి 18, 1927...పాత పార్లమెంట్ భవనం ప్రారంభ దినం



భారతదేశం స్వాతంత్ర్యానికి ముందే బ్రిటిష్ పాలకులు నిర్మించిన పార్లమెంట్ భవనం, దేశ ప్రజాస్వామ్యానికి నాంది పలికింది. 1927 ఆగస్టు 18న ప్రారంభమైన ఈ భవనం భారత రాజకీయ, చారిత్రక, సాంస్కృతిక పరిణామాలకు పునాది వేసింది. ఇది వృత్తాకార రూపంతో ప్రత్యేకమైన నిర్మాణ శైలికి ఉదాహరణగా నిలిచింది. పార్లమెంట్ భవన నిర్మాణానికి 1919లో బ్రిటిష్ ప్రభుత్వం పునాది వేసింది. ఈ ప్రాజెక్ట్ రూపకల్పనకు ఎడ్విన్ లుటియన్స్ మరియు హెర్బర్ట్ బేకర్, బ్రిటిష్ రాజ్ ప్రతిష్ఠాత్మక ఆర్కిటెక్ట్‌లు, వ్యవహరించారు. వృత్తాకార డిజైన్‌తో రూపొందించబడిన ఈ భవనం 560 అడుగుల వ్యాసార్థాన్ని కలిగి ఉంది. భారతీయ శిల్పకళ, పాశ్చాత్య నిర్మాణ శైలుల మేళవింపుతో రూపొందించ బడింది. 1921 నుంచి 1927 వరకు ఆరు సంవత్సరాల పాటు భవన నిర్మాణం జరిగింది. ఈ ప్రాజెక్టు కోసం 83 లక్షల రూపాయల భారీ ఖర్చు జరిగింది. భవనానికి మధ్యభాగంలో గుమ్మటం (డోమ్) ఉంది, ఇది భారతీయ ఆచారాన్ని ప్రతిబింబిస్తుంది. భవనం చుట్టూ సుందరమైన తోటలు, పార్కులు నిర్మించ బడ్డాయి. భవనం మొత్తం మూడు ముఖ్యమైన మండపాలను కలిగి ఉంది: లోక్‌సభ (జన ప్రతినిధుల సభ), రాజ్యసభ (సభ్యుల మండలి), సెంట్రల్ హాల్ (చారిత్రక సమావేశాలకు కేంద్రం). ఈ మండపాలు భవనంలో ప్రజాస్వామ్యానికి ప్రాథమిక వేదికలుగా ఉన్నాయి. సెంట్రల్ హాల్ ప్రత్యేకత ఏమిటంటే, ఇదే ప్రాంతంలో 1947లో భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రకటించ బడింది. భారత పార్లమెంట్ భవనం అనేక చారిత్రక సంఘటనలకు వేదికగా నిలిచింది. బ్రిటిష్ ఇండియా లెజిస్లేటివ్ కౌన్సిల్ సమావేశాలకు ఉపయోగించ బడింది. భారత జాతీయ కాంగ్రెస్ వంటి సంస్థలు ఇక్కడ అనేక చర్చలు జరిపాయి. 1947 ఆగస్టు 15న, భారత స్వాతంత్ర్యం ప్రకటించిన తర్వాత, మొదటి పార్లమెంట్ సమావేశం ఈ భవనంలోనే జరిగింది. భారత రాజ్యాంగం కూడా ఈ భవనంలో రచించ బడింది. 1950లో భారత రాజ్యాంగం అమలులోకి వచ్చినప్పుడు, ఇది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యానికి ప్రధాన కేంద్రంగా నిలిచింది. భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఈ భవనం ప్రత్యేక స్థానం కలిగి ఉంది. అయితే కాలక్రమేణా, భవనపు అవసరాలు దేశ ప్రజల అవసరాలకు తగినట్లు మారే అవకాశం లేకపోయింది. 1927లో నిర్మించిన ప్రస్తుత పార్లమెంటు భవనంలో నేటి అవసరాలకు తగినంత స్థలం లేకపోవడంతో పాటు తగినన్ని సౌకర్యాలు కొరవడడంతో నూతన పార్లమెంటు భవన నిర్మాణానికి 2020 డిసెంబరు 10న భారత ప్రధాని నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసారు. 2023 మే 28న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. 2023 సెప్టెంబరు 19న నూతన భవనంలో పార్లమెంట్ ఉభయ సభల కార్యకలాపాలు ప్రారంభించ బడ్డాయి. ఇది ఆధునిక సదుపాయాలు, విస్తృత వసతులతో నిర్మించ బడింది. అయినప్పటికీ, పాత పార్లమెంట్ భవనం చారిత్రక వారసత్వంగా నిలిచి భారత ప్రజాస్వామ్య పునాది మీద వెలుగు నింపుతోంది. పాత పార్లమెంట్ భవనం కేవలం ఒక భవనం మాత్రమే కాదు; ఇది భారతదేశ ప్రజాస్వామ్య, స్వాతంత్ర్య యుగానికి చారిత్రక సాక్ష్యం. ఇది ప్రజల భావప్రకటన, సమానత్వం, స్వేచ్ఛల సాధనకు వేదికగా నిలిచింది. భారతదేశ చరిత్రలో పాత పార్లమెంట్ భవనం అనతి కాలం గడిచిన తర్వాత కూడా గౌరవప్రదమైన గుర్తుగా నిలుస్తుంది. భవిష్యత్తు తరాలకు ఇది ప్రజాస్వామ్య ప్రాముఖ్యతను గుర్తు చేస్తూ స్ఫూర్తిగా నిలుస్తుంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# "నట పరిపాలనా సార్వ భౌముడు నందమూరి తారక రాముడు" - జనవరి 18... ఎన్టీఆర్ వర్ధంతి



తెలుగువారు "అన్నగారు" అని అభిమానంతో, ప్రేమతో, ముద్దుగా పిలుచుకునే నందమూరి తారక రామారావు, అటు సినీరంగంలో అటు రాజకీయ రంగంలో మకుట రహిత మహారాజుగా ఖ్యాతిని ఆర్జించారు. తెలుగు, తమిళం, హిందీ భాషలలో కలిపి దాదాపు 400 చిత్రాలలో తన నటనా చాతుర్యాన్ని ప్రదర్శించారు. నటనకే పరిమితం కాక, పలు చిత్రాలను నిర్మించి, మరి ఎన్నింటికో దర్శకత్వం బాధ్యతలు చేపట్టారు. సినీ కళామతల్లి సేవలతో పాటు, ప్రజా సేవ కూడా చేయాలని నిర్ణయించుకొని, రాజకీయ పార్టీని స్థాపించి కేవలం తొమ్మిది మాసాల్లోనే ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ ఏకచ్ఛత్రాధిపత్యానికి తెరదించి, హస్తానికి అధికారాన్ని గతం చేసి, తెలుగుదేశం పక్షాన హస్తగతం చేసుకున్నారు. మూడు విడతలుగా ఏడు సంవత్సరాల పాటు అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా పని చేశారు. పట్టుదలకు, క్రమశిక్షణకు మారుపేరుగా తెలుగు భాషకు, తెలుగు జాతికి, దేశవ్యాప్త గుర్తింపు తెచ్చిన బహుముఖ ప్రజ్ఞాశాలి, అఖిలాంధ్ర అందాల నటుడు నందమూరి తారక రాముడు. నాలుగు దశాబ్దాల సినీ ప్రస్థానంలో, పదమూడేళ్ల రాజకీయ జీవితంలో చిరస్మరణీయునిగా వెలుగొందారు ఆయన. ఎన్టీఆర్, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు"గా ఖ్యాతిగాంచారు. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, సుయోధనుడు రావణుని వంటి పౌరాణిక పాత్రల తో బాటు వైవిధ్య భరిత సాంఘిక, జానపద చిత్రాలలో విభిన్న పాత్రలను పోషించారు. సాటిలేని మేటిగా "చిత్రసీమ రారాజుగా భాసిల్లిన స్థితప్రజ్ఞులు రామారావు, 44 ఏళ్ల సినీ ప్రస్థానంలో, 13 చారిత్రక, 55 జానపద, 186 సాంఘిక, 44 పౌరాణిక చిత్రాలతో పాటు పలు తెలుగు, తమిళ చలన చిత్రాలలో విభిన్న పాత్రలకు జీవం పోశారు. 1982 మార్చి 29న తెలుగుదేశం పార్టీని స్థాపించి, కేవలం తొమ్మిది మాసాల కాల వ్యవధి లోనే, అప్పటి వరకు అప్రతిహతంగా కొనసాగిన కాంగ్రెస్ పాలనకు చరమగీతం పాడించి, ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనా పగ్గాలు చేత బుచ్చుకుని, ఎనిమిదేళ్ళు ముఖ్యమంత్రిగా, ప్రజల హృదయాలలో స్థిర స్థానం పొందారు. 1923 మే న కృష్ణాజిల్లా పామూరు మండలం నిమ్మకూరులో లక్ష్మయ్య, వెంకట రామమ్మ దంపతులకు జన్మించి, తారక రాముని"గా నామాంకితులై, విజయవాడ మున్సిపల్ స్కూల్లో, తర్వాత ఎస్.ఆర్. ఆర్ కళాశాలలో చదివారు. "కవి సామ్రాట్ విశ్వనాథ సత్య నారాయణ తెలుగు భాష ఉపాధ్యాయునిగా రామారావుకు "ఆడ వేషం" వేసే అవకాశం కల్పిస్తే, మీసాలు తీయకనే నటించి, "మీసాల నాగమ్మ" పిలువ బడ్డారు. విద్యాభ్యాస సమయంలో ఆస్తి హరించుకు పోగా, కొద్ది రోజులు పాల వ్యాపారం, కిరాణా షాపు, ఒక ముద్రణాలయాన్ని నడిపారు. 1942 లో మేనరికంగా బసవ తారకంను వివాహ మాడారు. నాటి ప్రఖ్యాత నటులు "కొంగర జగ్గయ్య, రక్త కన్నీరు నాగభూషణం, కె.వి.ఎస్. ముక్కామల" లాంటి నటులతో "నేషనల్ ఆర్ట్ థియేటరు నాటక సంస్థను స్థాపించారు. తర్వాత కాలంలో సదరు సంస్థ కొన్ని చిత్రాలు కూడా తీసింది. జయకృష్ణ, సాయికృష్ణ, హరికృష్ణ మోహన కృష్ణ, బాలకృష్ణ, రామకృష్ణ, జయశంకర్ కృష్ణ, కుమారులు కాగా, పురంధరేశ్వరి, భువనేశ్వరి, ఉమా మహేశ్వరి కూతుళ్ళు కలిగారు. 1947 లో పట్టభద్రులై మద్రాసు సర్వీస్ కమిషన్ పరీక్షలు రాసి 1100 మందికి, ఏడుగురిలో ఎంపికై సబ్ రిజిస్ట్రార్ ఉద్యోగం పొంది, తన కార్యక్షేత్రం సినీ రంగంగా ఎంచి, ఉద్యోగాన్ని వదిలారు. ప్రముఖ సినీ నిర్మాత బి.ఎ.సుబ్బారావు రామారావును మద్రాసు పిలిపించి, "పల్లెటూరి పిల్ల" చిత్రంలో కథానాయకుడి పాత్రను 116 రూపాయల పారితోషకం అందించారు. అయితే 1949 లో విడుదలైన "మన దేశం" ఎన్టీఆర్ కెమెరా ముందు నిలిచిన తొలి చిత్రం అయింది. తర్వాత దర్శకుడు యోగానంద్ కలిసి మద్రాసులో చిన్న గదికి మకాం మార్చారు. 1951లో నటించిన, నాటికీ నేటికీ తెలుగు ప్రజల హృదయాలలో నిలిచిన పాతాళభైరవి" చిత్రం. 10 కేంద్రాలలో శత దినోత్సవాలు జరుపుకుంది. 1956 లో మాయాబజార్ల చిత్రానికి ఎన్టీఆర్ తీసుకున్న 7500 రూపాయల పారితోషికం నాడు అత్యధికం. తర్వాత భూకైలాసు "వెంకటేశ్వర మహత్యం" భారీ విజయాలు సాధించగా, "శ్రీమద్విరాటపర్వం"లో ఐదు పాత్రలు పోషించి ఔరా అనిపించు కున్నారు. 1952 నుండి ఎన్టీఆర్ పారితోషికం లక్షల్లోకి చేరింది. "లవకుశ", "సీతారామ కళ్యాణం", "దాన వీర శూర కర్ణ", "నర్తనశాల", "విశ్వామిత్ర" లాంటి చిత్ర రాజాలు, ఆయన నటనకు కలికి తురాయిలుగా నిలిచాయి. "న భూతో న భవిష్యతి" అనిపించాయి. "అడవి రాముడు" "యమగోల" బాక్సాఫీసు విజయాలు సాధించాయి. చిత్ర సీమలో రారాజుగా ఉన్న ఎన్టీఆర్ "ప్రజా సేవ" వైపు తమ దృష్టిని మరల్చారు. 1978లో రాష్ట్ర కాంగ్రెస్ లో కుమ్ములాటలు, ఐదేళ్లలో 4గురు సీఎంలు మారడం, ఢిల్లీలో అధిష్టాన నిర్ణయానుసారం, సీఎంలు ఎన్నుకోబడిన సాంప్రదాయం, కాంగ్రెసు ప్రతిష్టను దిగజార్చడం జరిగింది. ఈ క్రమంలోనే 1982 మార్చి 21న హైదరాబాద్ కు చేరి, మార్చి 29 సాయంత్రం, రాజకీయ పార్టీని స్థాపించ నున్నట్లు ప్రకటించి, "తెలుగుదేశం" అని పేరు ఖాయం చేశారు. తన "చేవ్రోలెటు కారునే "చైతన్య రథం"గా మార్పించి, దానిపై నలు మూలలా ఆంధ్రదేశ మంతటా పర్యటించి, ప్రచారం చేశారు. ఆంధ్రుల ఆత్మగౌరవ నినాదంతో, ప్రజల మనోభావాలను ప్రభావితం చేసి "ఢిల్లీలో తాకట్టు పెట్టిన ఆత్మగౌరవ పునరుద్ధరణ" పార్టీ లక్ష్యమని చాటి, ఎన్నికల బరిలో దిగి సర్వం తానే అయి, ప్రజాకర్షణతో, ఉద్వేగ భరితంగా, ఉద్రేక పూరితంగా ప్రసంగాలతో ప్రజా మద్దతు పొందారు. 1983 జనవరి 7న ప్రకటిత శాసన సభ ఫలితాలలో, 199 స్థానాలను సునాయాసంగా గెలుచుకొని, 97 ఏళ్ల కాంగ్రెస్ పాలనకు బ్రేక్ వేయ గలిగారు. టిడిపి వ్యవస్థాపక నేతలలో ఒకరైన నాదెండ్ల భాస్కర్ రావు, 1986 ఆగస్టు 16న, నాటి దేశ ప్రధాని ఇందిర, ఆంధ్ర ప్రదేశ్ గవర్నర్ రాంలాల్ సహకారంతో, ఎన్టీఆర్ ను పదవీచ్యుతుని గావించి, అధికారం హస్తగతం చేసుకోగా, ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమ ఫలితంగా, సెప్టెంబర్ 16న తెలుగుదేశం అధినేత ఎన్టీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అయినారు. ఎన్టీఆర్ ఎందరో ప్రస్తుత ప్రజా ప్రతినిధులకు రాజకీయ జీవితాలను ప్రసాదించారు. విడిపోయిన తెలుగు రాష్ట్రాలకు సంబంధించి, ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నారా బాబు నాయుడు, దివంగత ఎన్టీఆర్ మంత్రివర్గంలో పని చేసిన వారే కావడం విశేషం. 1985 జూన్ 1న శాసన మండలి రద్దు, హుస్సేన్ సాగర్ కట్టపై ప్రసిద్ధుల విగ్రహాల ఏర్పాట్లు, సినిమా థియేటర్లకు స్లాబ్ విధానం, 1989 లో మొత్తం మంత్రివర్గాన్ని ఏకపక్షంగా రద్దుపరచి, కొత్త మంత్రి మండలి ఏర్పాటు, నేషనల్ ఫ్రంట్ ఏర్పాటులో కీలక పాత్ర, రెండు రూపాయల కిలో బియ్యం పథకం, సంపూర్ణ మద్య నిషేధం, స్త్రీలకు ఆస్తిలో వాటా 1991 నంద్యాలలో గౌరవ సూచకంగా, నాటి ప్రధాన మంత్రి పీవీ నరసింహారావుకు పోటీ పెట్టక పోవడం, 1989... 1994 మధ్య ప్రతిపక్ష పార్టీ నేతగా వ్యవహరించడం, 1993లో లక్ష్మీపార్వతిని వివాహ మాడటం, ఆమె సహచర్యం, తారకరాముని రాజకీయ ప్రస్థానంలో, ముఖ్యాతి ముఖ్య అంశాలుగా మిగిలాయి. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**


# బహుముఖ ప్రజ్ఞాశాలి నాళం కృష్ణారావు - జనవరి 18...నాళం కృష్ణారావు జయంతి



నాళం కృష్ణారావు (జనవరి 18 , 1881 – మార్చి 17, 1961) బాల సాహిత్యబ్రహ్మ, మధుర కవి. తెలుగు వైతాళికుడు. సంఘ సంస్కర్త. గౌతమీ గ్రంథాలయం స్థాపకుడు."మానవసేవ" పత్రిక సంపాదకులు. స్వాతంత్ర్య సమర యోధుడు, బహు భాషావేత్త. బ్రహ్మ సమాజం మతస్థుడిగా తన గురువు అయిన కందుకూరి వీరేశలింగం పంతులుగారి కన్నా ముందే జంధ్యాన్ని పరి త్యజించారు. స్త్రీ విద్యను ప్రోత్సహించారు. వితంతు వివాహాలు జరిపించారు. ఇతర కులస్థులతో తన పెద్ద కుమారునికి వివాహం జరిపించారు. చింతా శేషయ్య అనే అట్టడుగు కులస్థుడికి తన యింట్లో నివాసం ఏర్పరిచి బ్రహ్మ మతస్థుడిగా తీర్చిదిద్దారు. ఇక సాహిత్యం విషయానికి వస్తే...నాళం కృష్ణారావు అద్భుతమైన భావుకుడు. బాలసాహిత్యంలో నాళంది అగ్రస్థానం. ప్రకృతి కవిత్వంలో , భావ కవిత్వంలో నాళంది అందె వేసిన చేయి. అయన పద్యాలు తెలుగు భాషకు సొబగులు. వాటిని చదివితే తెలుగు భాష సుపరిచితమై, పద్య రచనా పాటవం పెరుగుతుంది. వినూత్న భావాలు మదిలో మెదలుతాయి. చిన్న చిన్న కథల్ని తేటగీతి పద్యాల్లో చెప్పటం నాళం ప్రత్యేకత. ముఖ్యంగా పిల్లలకు తేలికగా అర్థమయ్యే రీతిలో పద్యాలు రచించారు. చిన్ని చిన్ని పదాలతో తేట తెలుగు పలుకుల రుచి చూపించారు. తేటగీతులలో అద్భుత కావ్యరచనలు చేశారు. నాళం కృష్ణారావు 1881 జనవరి 18 తేదీన నాళం కామరాజు, లక్ష్మమ్మల చివరి సంతానంగా తూర్పుగోదావరి జిల్లా మండపేట గ్రామంలో జన్మించారు. 1911–15 ప్రాంతాలలో ఆయన నిర్వహించిన తొలి తెలుగు సచిత్రమాస పత్రిక 'మానవ సేవ'. పుస్తక పఠనాసక్తిని కలిగించేందుకు 1898వ సంవత్సరంలో రాజమహేంద్ర వరంలో వీరేశలింగం గ్రంథ భాండాగారాన్ని నెలకొల్పారు. అదే క్రమంగా వృద్ధి చెంది వసురాయ గ్రంథ మండలిగా మారింది. దానికే సర్వజన గ్రంథ మండలి అనే పేరు కూడా వచ్చింది. ఎలాంటి విచక్షణకు తావు లేకుండా సమాజం లోని సర్వ సభ్యులకు గ్రంథాలయం ప్రవేశాన్ని కలిగించింది. కృష్ణారావు పదిహేడో ఏట రాజమండ్రిలో గౌతమీ గ్రంథాలయాన్ని స్థాపించారు. ఈ గ్రంథాలయమే ఈ నాటికీ అదే పేరుతో ఆంధ్ర దేశంలోని విలువైన, ప్రముఖమైన గ్రంథాలయాల్లో ఒకటిగా విరాజిల్లుతున్నది. శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి అధ్యక్షులుగా, నాళం కృష్ణారావు కార్యదర్శిగా ఉన్న రోజుల్లో స్వర్ణయుగాన్ని చూసింది గౌతమి. శ్రీకృష్ణరాయ ఆంధ్ర విజ్ఞాన సర్వస్వాన్ని సంకలనం చేశారు. కందుకూరి వీరేశలింగం పంతులు స్థాపించిన హితకారిణీ సమాజానికి, వీరేశలింగ పాఠశాలకు పంతులు తర్వాత జీవితాంతం అధ్యక్షులుగా పని చేశారు. ఆయన రాసిన 'గాంధీ విజయధ్వజ నాటకం' (1921), 'గాంధీ దశావతార లీలలు' (1932) గ్రంథాలను బ్రిటిష్ ప్రభుత్వం నిషేధించింది. పదివేల సామెతలు జాతీయ లోకోక్తులు పేరుతో సేకరించారు. కృష్ణారావు లాఠీఛార్జి, జైలు జీవితం మరొక పార్శ్వం సాహిత్యం. బాల్యం నుండి తుదిశ్వాస వరకు తేటగీతులలో కావ్య రచన చేశారు. కృష్ణారావు ఆశలన్నీ భావిభారత పౌరులయిన పిల్లల పైనే ఉండేవి. అందుకే ఆయన కావ్యనాయకుడు పిల్లవాడు. ఆయా 'గోరుముద్దలు', 'మీగడ తరగలు', 'వెన్నె బడుగలు', 'పాల తరగలు' 'తేనె చినుకలు' తినిపిం చారు. 'వెన్నెల వెలుగులు', 'విరిదండ', 'దీపావళి' 'పాపాయి' లను అందించారు. మీగడ తరకలు (కవితాసంకలనం) గోరుముద్దలు, వెన్న బుడగలు, పాల తరకలు, తేనె చినుకులు, వెన్నెల వెలుగులు, విరిదండ, దీపావళి, ముద్దు – పాపాయి, గ్రంథాలయ సూక్తులు, మిత్ర లేఖావళి, అనుతాపము, దేశమాత పరిదేవనము, వితంతు వివాహ చరిత్ర, స్త్రీల యెడ పురుషుల గావించు, పంచ మహా పాతకాలు, ప్రేమ సాగరము, తెలుగు జాతీయములు, శ్రీ కృష్ణరాయాంధ్ర విజ్ఞాన సర్వస్వము, గాంధీమహాత్ముని దశావతార లీలలు తదితర రచనలు చేశారు. వీటిలో కొన్ని పుస్తకాలను గుంటూరులోని బొమ్మిడాల ఛారిటబుల్ ట్రస్ట్ వారు 2011 లో పునర్ముద్రణ గావించారు. ఆయన సతీమణి నాళం సుశీలమ్మ తమ విదేశీ వస్త్రాలన్నీ దహనం చేసి, మహాత్ముడు రాజమండ్రి వచ్చినప్పుడు ఆయనకు పండ్లరసం అందించారు. కృష్ణారావు నిరాడంబరుడు. కీర్తికాంక్షా రహితుడు.'సేవ'కే ప్రాధాన్యం ఇచ్చిన మనిషి. తమ అనంతరం మానవసేవ చేయాల్సిందిగా, తన తనయ కళాప్రపూర్ణ ఊటుకూరి లక్ష్మీకాంతమ్మను నిర్దేశించారు.1961 మార్చి 17 న మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# హిందీ సాహిత్య దిగ్గజం హరి వంశ రాయ్ - జనవరి 18...హరివంశ రాయ్ బచ్చన్ వర్ధంతి



డాక్టర్ హరివంశ్ రాయ్ బచ్చన్ ( 1907 నవంబరు 27 – 2003 జనవరి 18) 20 వ శతాబ్దం ప్రారంభంలో హిందీ సాహిత్యంలోని నయా కవితా సాహిత్య ఉద్యమం లోని భారతీయ కవి. హిందీ సాహిత్యంలో సాటిలేని వారసత్వా న్ని మిగిల్చిన సాహిత్య దిగ్గజం ఆయన. 20వ శతాబ్దపు ఛాయా వాద ఉద్యమం మార్గదర్శకునిగా పరిగణించబడే హరివంశ్ రాయ్ బచ్చన్ గురించి ప్రస్తావించ కుండా హిందీ సాహిత్యం గురించి ప్రస్తావిం చడం సాధ్యం కాదు. 60 సంవత్స రాల పాటు సాగిన సాహిత్య జీవితంతో, బచ్చన్ 30కి పైగా కవితలు రాశారు. ప్రతి ఒక్కటి శక్తివంతమైన చిత్రాలతో, సమ కాలీన సామాజిక, రాజకీయ పరిస్థితులను ప్రతిబింబించేలా ఉన్నాయి. హరివంశ్ రాయ్ బచ్చన్ బ్రిటిష్ ఇండియా లోని యునైటెడ్ ప్రావి న్సెస్ ఆఫ్ ఆగ్రా లోని ప్రతాప్ గఢ్ జిల్లాకు చెందిన బాబు పట్టి గ్రామం లో కాయస్థ కులంలోని శ్రీవాస్తవ వంశానికి చెందిన అవధి భారతీయ హిందూ కుటుంబంలో నవంబర్ 27, 1907న జన్మించారు. ఆయన ముందు శ్యామాను వివాహం చేసుకోగా, ఆమె త్వరగా మరణించడంతో మళ్లీ తేజీ బచ్చన్‌ను వివాహం చేసుకున్నారు. అనేక ప్రసిద్ధ కవితలు వ్రాసారు. సిల్సిలా (1981), ఆలాప్ (1977) మరియు ఫిర్ భీ (1972) అనే బాలీవుడ్ చిత్రాలలో గీత రచయి తగా కూడా పనిచేశారు. 1941 నుండి 1957 వరకు, అలహా బాద్ విశ్వ విద్యాలయంలో ఆంగ్ల విభాగంలో అధ్యాపకునిగా బోధించారు. ఆ తరువాత రెండు సంవత్స రాలు కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయానికి చెందిన సెయింట్ కాథరీన్ కళా శాలలో ప్రఖ్యాత ఐరిష్ రచయిత డబ్ల్యూ.బి.యీట్స్ రచనలపై పి. హెచ్.డి చేసారు. కేంబ్రిడ్జ్ యూనివర్శిటీలో పి హెచ్ డి చేసిన మొదటి భారతీయునిగా గుర్తింపు పొందారు. హరివంశ్ రాయ్ హిందీ కవిత్వం రాసేటప్పుడు సాధారణంగా సాంప్ర దాయంగా ఉపయోగించే శ్రీవాస్తవ వంశ పేరుకు బదులుగా "బచ్చను (బాలుడు) అనే కలం పేరును ఉపయో గించారు. భారత దేశానికి తిరిగి వచ్చిన తరువాత, అలహాబాద్ విశ్వ విద్యాలయంలో ఆంగ్ల సాహిత్యం బోధించారు. అలహా బాద్‌లోని ఆల్ ఇండియా రేడియోలో కూడా పని చేశారు. బచ్చన్ అనేక హిందీ భాషలలో (హిందూస్థానీ, అవధి) నిష్ణాతులు. దేవనాగరి లిపిలో రాసిన కవితల్లో హిందూస్థానీ పదజాలం విస్తృతంగా వాడారు. ఒమర్ ఖయ్యామ్ చేత పర్షియన్, ఉర్దూ కవిత్వం పట్ల ప్రభావితమయ్యారు. బచ్చన్ తన ప్రారంభ రచన మధుశాల ద్వారా అనూహ్య గుర్తింపు పొందారు. సామాన్యుడి దృక్కోణంలో రాసిన ఆయన కవితలు దేశంలోని అసంఖ్యాక సామాన్యులకు స్వరం వినిపిం చాయి. బచ్చన్ కవిత్వం స్వేచ్ఛ కోసం సామాన్యుని కోరిక, జీవితం, మరణం, ప్రేమ, వాంఛ మొదలైన అనేక ఇతి వృత్తాలతో ముడి పడి ఉంది. హరివంశ్ రాయ్ అనేక కవితలు ఆయన వ్యక్తిగత జీవితం, విషాదాల నుండి ప్రేరణ పొందాయి. బచ్చన్ రచించిన చాలా కవితలలో ప్రేమికుడి వేదన ప్రధానమైన ఇతివృత్తాలలో ఒకటిగా నిలిచింది. మధుశాల అనేది 135 పద్యాల కవిత్వం, ఇది హరివంశరాయ్ బచ్చన్‌ను ఎనలేని గుర్తింపు తెచ్చి పెట్టింది. ఆంగ్లం, మలయాళం, బెంగాలీ మరియు మరాఠీలోకి అనువదించ బడింది. హరివంశ్ రాయ్ బచ్చన్ రచించిన అత్యంత ప్రజాదరణ పొందిన కవితలలో ఇది ఒకటి. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనే వారికి ప్రేరణగా బచ్చన్ అగ్నిపథ్ అనే కవితను రాశారు. 1969లో సాహిత్య అకాడమీ అవార్డుతో బచ్చన్ ను సత్క రించారు. 1976 లో హిందీ సాహిత్యానికి చేసిన సేవకు గాను పద్మ భూషణ్ పురస్కారాన్ని అందు కున్నారు. ఆయన భార్య తేజీ బచ్చన్ సామాజిక కార్యకర్త. హరివంశ్ రాయ్ కుమారుడు, మనుమడు పరిచయం అక్కరలేని ప్రఖ్యాత హిందీ నటులు అమితాబ్ బచ్చన్, అభిషేక్ బచ్చన్. హిందీ సాహిత్యంలో తనదంటు ప్రత్యేక ముద్ర వేసుకున్న బచ్చన్ దీర్ఘకాలిక అనారోగ్యానికి గురై, 2003 జనవరి 18న తనువు చాలించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

చురకలు



## సీఎండీకే 'షాక్'

హైదరాబాద్: విద్యుత్తు సంస్థలో కొందరు సిబ్బంది, అధికారుల అక్రమాలపై ఫిర్యాదులు రావడంతో విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై చర్యలకు విజిలెన్స్ విభాగం సిఫార్సు చేసింది. నివేదిక ఆధారంగా క్రమశిక్షణ చర్యలకు ఆదేశించి నెలలు గడుస్తోంది. అయినా చర్యలు తీసుకోకపోవడంపై ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ ఇటీవల ఓ సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ఏఈ, పైస్థాయిలో సీఎండీకి తప్ప మధ్యలో ఎవరికీ బాధ్యతలు పట్టవా అంటూ అసహనం వ్యక్తం చేశారు. అవినీతికి పాల్పడటం, అనుమతి లేకున్నా, సరైన పత్రాలు లేకుండా విద్యుత్తు కనెక్షన్లు, మీటర్లు ఇవ్వడం, ఆక్యుపెన్సీ పత్రం లేకుండా బహుళ అంతస్తులకు కరెంట్ సరఫరా చేయడం వరకు కొందరు సిబ్బంది పలు అక్రమాలకు పాల్పడ్డారు. ప్రతి సర్కిల్‌లో ఓ అండ్ ఎం విభాగంపై ఫిర్యాదులు వచ్చాయి. ఏఈ, డీఈలను బాధ్యులను చేశారు.

**సర్కిళ్ల వారీగా ఆదేశాలు ఇలా..**

హైదరాబాద్ సౌత్ సర్కిల్‌లో చర్యలకు నవంబరు 28న ఎస్ఈని ఆదేశించారు. మరో కేసులో అక్టోబరు 10న చర్యలకు సిఫార్సు చేశారు. సంగారెడ్డి సర్కిల్‌లో విజిలెన్స్ విచారణ జరిపి సీఈ చర్యలు తీసుకోవాలని నవంబరు 15న సిఫార్సు చేసినా మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఓసీ లేకుండా బహుళ అంతస్తుల భవనానికి మీటర్ల జారీలో బోయిన్




పల్లి ఆపరేషన్ ఏఈ, ఏడీఈ బోయిన్‌పల్లి ఐఎస్ఎస్ఈ ఏడీఈపై చర్యలకు మెట్రోజోన్ సీఈని ఆదేశించారు.

సైబర్‌సిటీ, రాజేంద్రనగర్ సర్కిల్‌లో బాలాజీనగర్ సెక్షన్ లైన్‌మెన్, కేపీహెచ్‌బీ సెక్షన్ లైన్ ఇన్‌స్పెక్టర్, గతంలో అల్వాల్ సెక్షన్‌లో పనిచేసిన ఏఈ, ప్రైవేటు మీటర్ రీడర్, ఇబ్రహీంబాగ్ లైన్‌మెన్‌పై చర్యలకు నవంబరు 6న ఆదేశాలు వెళ్లాయి.

హబ్సిగూడ సర్కిల్‌లో చర్యలకు మేడ్చల్ జోన్ సీఈని ఆదేశించారు. మరో కేసులో అల్విన్‌కాలనీ లైన్‌మెన్, పేట్‌బషీరాబాద్ లైన్‌మెన్‌పై చర్యలకు అక్టోబర్ 30న ఆదేశించారు.

ఈ నెల 3న సరూర్‌నగర్ సర్కిల్‌లో చర్యలకు రంగారెడ్డి జోన్ సీఈని ఆదేశించారు. మేడ్చల్‌సర్కిల్‌లో కేటగిరీ-8 కింద కాకుండా కేటగిరీ 1, 2 కింద కనెక్షన్ జారీ, డిస్కం ఆదాయానికి గండి కొట్టడంతో కూకట్‌పల్లి లైన్ఇన్‌స్పెక్టర్, ఏఈ, ఏడీఈ, బాచుపల్లి లైన్ఇన్‌స్పెక్టర్, ఏఏఈ, ఏడీఈ, మియాపూర్ ఏడీఈపై చర్యలకు ఆదేశించారు.

## జాతీయ వనం.. మురుగు కూపం

మన్సూరాబాద్: విశాలమైన పచ్చని వనంలో వన్యప్రాణులు స్వేచ్ఛగా ఉండే పరిస్థితి క్రమంగా తగ్గిపోతోంది. సమీప ప్రాంతాల మురుగు వెళ్లేందుకు సరైన డ్రైనేజీలైన్ లేకపోవడంతో మురుగు అడవిలోకి వస్తోంది. జాతీయ వనంలోకి కొంత ప్రాంతం మురుగు కూపంగా మారిపోతోంది. మురుగు, వర్షపు నీరు అటవీప్రాంతంలోని చెరువులోకి చేరుతోంది. ఆ నీరు కొన్ని రకాల జంతువులకు ప్రాణాంతకంగా మారుతోంది. ఈ సమస్య 20 ఏళ్లుగా ఉన్నా.. ఈ ఏడాది అధిక వర్షాలతో మరింత ఇబ్బందికరంగా మారింది. సమస్యకు పరిష్కారం చూపించడంలో ఆటోనగర్, అటవీశాఖ, జీహెచ్ఎంసీ అధికారులు విఫలమవుతున్నాయి. అక్కడే కొంతమంది ట్యాంకర్లతో రసాయనాలు తీసుకొచ్చి వదిలేస్తున్నారు.

**చెట్లు ఎండిపోయి..:** మురుగు, వ్యర్థాలతో సుమారు 15 ఎకరాల అటవీ స్థలం నిండిపోయింది. మురుగు ఉన్న చోట చెట్లు ఎండిపోయాయి. వన్యప్రాణులకు జరిగే నష్టం వివరాలను అధికారులు బయటపెట్టడం లేదు. ఆటోనగర్ పారిశ్రామిక వాడలో మురుగు శుద్ధి కేంద్రం నిర్మించినా సమస్య పరిష్కారం కాలేదు. దాని సామర్థ్యం తక్కువగా ఉండటం, నిర్వహణ లోపంతో మురుగు అలాగే బహిరంగ ప్రదేశంలోకి వెళ్లిపోతోంది.

ఆటోనగర్ పారిశ్రామికవాడ నుంచి వరద కాలువ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. దాన్ని సౌత్ ఎండ్ పార్కు కాలనీ దాకా నిర్మించి వదిలేశారు. పనులు పూర్తి చేస్తే అడవిలోకి మురుగు వెళ్లకుండా నివారించవచ్చు.

మహావీర్ హరిణ వనస్థలి జాతీయ ఉద్యానవనం: 14.50కి.మీ విస్తీర్ణంలో ఉంది. విజయవాడ జాతీయ రహదారి పక్క నుంచి కుంట్లూర్, బండ్లగూడ, మన్సూరాబాద్, తట్టిఅన్నారం, మర్పల్లి, కుత్బుల్లాపూర్ ప్రాంతాల్లో విస్తరించింది.

**వన్యప్రాణులు:** చుక్కల జింకలు: 1000, కృష్ణా జింకలు: 500, దుప్పులు, నెమళ్లు: లెక్కలు లేవు. కుందేళ్లు, పక్షులు ఎక్కువ సంఖ్యలో ఉన్నాయి.


**బెజవాడ సాయిప్రకాశ్, ఎఫ్ఆర్వో**

మురుగు వద్దకు జంతువులు రాకుండా కంచె ఏర్పాటు చేశాం. రసాయన ట్యాంకర్లు రాకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. ప్రహరీ పూర్తయితే మురుగు రాకుండా ఉంటుంది.

## ఆకాశహర్మ్యాల్లో.. అగ్నిని ఆర్పేదెలా?

హైదరాబాద్: బృహత్‌నగరంలో సూపర్ హైరైజ్ భవనాలు రాబోతున్నాయ్.. ప్రస్తుతం నగరంలోని అత్యధిక ఎత్తయిన భవనం కోకాపేట్‌లో(60 అంతస్తుల భవనం) ఉండగా త్వరలో ఘట్‌కేసర్‌లో 72 అంతస్తుల భవనం నిర్మించబోతున్నారు. ప్రొవిజినల్ ఎన్వోసీ కోసం దరఖాస్తు చేసుకోగా.. అనుమతులు జారీ చేసినట్టు అగ్నిమాపకశాఖ డైరెక్టర్ జనరల్ విక్రమ్‌సింగ్‌మాన్ ఇటీవల వెల్లడించారు. దక్షిణాసియాలోనే ఇంత ఎత్తయిన భవనం లేదన్నారు. ఇలాంటి భవనాల్లో ప్రమాదాల సమయంలో మంటలార్పే అధునాతన పరికరాలు ఇకపై కొనుగోలు చేస్తామని, సాంకేతికతను వినియోగించుకుంటామని తెలిపారు. 850కి పైగా ఎత్తయిన భవనాలు.. ఎత్తయిన భవనాల విషయంలో ముంబయి తర్వాత రెండోస్థానంలో కొనసాగుతుండగా.. ప్రస్తుతం నగరంలో 850కి పైగా ఎత్తయిన భవనాలున్నాయి. అయితే మంటలు ఆర్పే బ్రాంటోస్కై లిఫ్ట్ వాహనాలు కేవలం 54 మీటర్ల ఎత్తు వరకు (18 అంతస్తులు) మాత్రమే సేవలందిస్తాయి. 72 అంతస్తుల వరకు (220 నుంచి 250 మీటర్ల ఎత్తు) సేవలందించే వాహనాలు, పరికరాలు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉంది. 72 అంతస్తుల భవనానికి బయటి నుంచి మంటలార్పే వ్యవస్థ లేనందున పూర్తిగా లోపలి వ్యవస్థలపైనే ఆధారపడాల్సి ఉంటుంది. 2030 నాటికి 112 నుంచి 120 మీటర్ల ఎత్తున్న బ్రాంటో స్కై లిఫ్ట్, 150 మీటర్ల టర్న్‌టేబుల్ లాడర్, ఫైర్ ఫైటింగ్ డ్రోన్‌లు, అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యల్లో బరువు మోసేందుకు ఉపయోగపడే ఎకోస్కెలిటన్ సూట్‌లు కొనుగోలు చేయాల్సిన అవసరం ఉంది. దేశంలో ఏ నగరంలోనూ 100 మీటర్ల పైన మంటలను బయటి నుంచి ఆర్పే వ్యవస్థ లేదు. లోపలున్న స్ప్రింక్లర్, రైజర్, ప్రెజరైజేషన్ వ్యవస్థలపైనే ఆధారపడాలి.

## పర్యాటక శోభ దక్కేనా..?



బూర్గంపాడు : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రాచీన శైవక్షేత్రాల్లో మోతెగడ్డ వీరభద్రుడి ఆలయం ఒకటి. ఇక్కడ వీరభద్రుడు భద్రకాళీ సమేతుడై స్వయంభూగా కొలువై ఉన్నాడు. నిత్యం పరవళ్లు తొక్కే పావన గోదావరి నడుమ ఈ ఆలయం ద్వీపకల్పంలా వెలుగొందుతోంది. సారపాక నుంచి భద్రాచలం వెళ్లే వారికి వంతెన మీద నుంచి ఈ ఆలయం కనిపిస్తూ ఉంటుంది. దర్శించిన వారికి ఆధ్యాత్మికతతో పాటు ఇక్కడి ప్రకృతి అందాలను తిలకించే వీలుంది.


**కాకతీయుల కాలంలో నిర్మాణం..**

ఈ ఆలయాన్ని కాకతీయుల కాలంలో నిర్మించారని ప్రచారంలో ఉంది. శివరాత్రి పర్వదినాన్ని ఇక్కడ అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు ఈ వేడుకకు వస్తారు. లింగోద్భవ సమయాన స్వామివారి కల్యాణాన్ని తిలకించి పులకితులవుతుంటారు. ఈ ఆలయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు గతేడాది వినతిపత్రం అందించారు. అభివృద్ధి చేస్తే భక్తులకు సౌకర్యంగా ఉండటంతో పాటు స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందని విన్నవించినా ఆ దిశగా ముందడుగు పడలేదు. గోదావరి నడుమ కొలువై ఉండటంతో 365 రోజులు భక్తులు వెళ్లే అవకాశం ఉండటం లేదు. గోదావరి నిండుగా ప్రవహించే సమయంలో ఆలయంలో పూజలు సైతం కొనసాగే వీలు లేదు. శివరాత్రి పర్వదినాన మాత్రమే ఈ ఆలయాన్ని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుంటారు. పర్యాటకంగా అభివృద్ధి చేస్తే నిత్యం స్వామివారి దర్శనానికి ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చే వీలుంది. భద్రాచలం రామాలయానికి వచ్చేవాళ్లు సైతం వీరభద్రుడి ఆలయాన్ని దర్శించుకునే అవకాశం ఉంటుంది.

**ఇవి చేస్తే మేలు..**మోతె పుష్కరఘాట్ నుంచి ఆలయానికి బోటింగ్ ఏర్పాటు చేస్తే స్థానికులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు దర్శించే వీలుంది. భద్రాచలంలోని స్నానఘట్టాల నుంచి మోతెగడ్డ వరకు బోటింగ్ సౌకర్యం కల్పిస్తే రామాలయాన్ని దర్శించుకునే భక్తులు మోతెగడ్డను సందర్శించే అవకాశం ఉంది.

ఈ ఏడాది ముక్కోటి పర్వదినం సందర్భంగా కలెక్టర్ ప్రత్యేక చొరవతో గోదావరిలో ఏరు మహోత్సవం ఏర్పాటు చేశారు. అదే తరహాలో మోతెగడ్డలోనూ ఏర్పాటు చేస్తే పర్యాటకులకు సౌకర్యంగా ఉంటుంది. గోదావరిలో బోటింగ్‌తో పాటు నదీ తీరాన గుడారాలు ఏర్పాటు చేసి అవసరమైన సౌకర్యాలు కల్పించి తగిన ప్రచారం కల్పిస్తే రాష్ట్రం నలుమూలల నుంచి ఇక్కడకు వచ్చే అవకాశం ఉంది.

## ప్రతి పనికీ.. నిబంధనలే అడ్డంకి!





ఖమ్మం : భద్రాద్రి జిల్లాలోని ఓ పాఠశాలలో 20 రకాల క్రీడాసామగ్రి, దుస్తులకు రూ.50వేలు మంజూరయ్యాయి. దుకాణ యజమాని ఖాతాలో నిధులు జమకాకపోవటంతో ఆయన ఆ వస్తువులు ఇవ్వటం లేదు. చెడిపోయిన పరికరాలతో జనవరి 26కు ఆటలు ఆడించేదెలా అని ఉపాధ్యాయులు మదనపడుతున్నారు.

పీఎంశ్రీ పాఠశాలల్లో విద్యార్థుల ప్రగతికి వెచ్చించాల్సిన నిధులకు.. నిబంధనలు ఒకింత అడ్డంకిగా మారుతున్నాయి. ప్రతి చిన్నపనికీ ముందే మూడురకాల బిల్లుల రూపకల్పన, ఆపై నిధుల విడుదల్లో జాప్యం కారణంగా గల్లాపెట్టెలోనే కాసులు మురుగుతున్నాయి. విద్యాసంవత్సరం చివరికొస్తుండగా.. ఇప్పటివరకు ఖమ్మం జిల్లాలో 32.85%, భద్రాద్రి జిల్లాలో 13.96% పైకం వెచ్చించటం గమనార్హం.

**జీఎస్టీ తప్పనిసరి..** పీఎంశ్రీ కింద ఉభయ జిల్లాల్లో 52 పాఠశాలలను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆయా పాఠశాలల్లో కెరియర్ గైడెన్స్, బాలికల సాధికారత, ఆర్థిక అక్షరాస్యత, ఆత్మరక్షణ విద్య, యోగాలో శిక్షణ, పర్యాటక, పరిశ్రమల సందర్శన, స్కూల్ గ్రాంట్ కింద కలిపి వరుసగా రూ.2.29కోట్లు, రూ.1.59కోట్లను కేటాయించింది. 2024-25 విద్యాసంవత్సరంలో ఏపనికైనా సంబంధిత ప్రధానోపాధ్యాయులు ముందే డబ్బులు చెల్లించి తరువాత బిల్లులు సమర్పించేవారు. ఈ విధానంలో వేరే జిల్లాలో నిధులు దుర్వినియోగమవటంతో 2025-26లో నిబంధనలను ప్రభుత్వం మార్చింది. ప్రతి పనికి హెచ్ఎం మూడు రకాల బిల్లులు రూపొందించాలి. ప్రతి బిల్లుకు జీఎస్టీ ఉండాలి. వీటితోపాటు దుకాణ యజమాని (వెండర్) ఖాతా వివరాలను ట్రెజరీలో ముందస్తుగా సమర్పించాలి. వీటిని పరిశీలించిన తరువాత వెండర్ ఖాతాలో నిధులను అధికారులు జమచేస్తారు. పల్లెలు, మండలకేంద్రాల్లో జీఎస్టీలతో కూడిన బిల్లులు దొరకటం కష్టంగా మారింది. ఒకవేళ దొరికినా ఒక్కో పనికి మూడు రకాల బిల్లులు ఇవ్వటానికి దుకాణాల యజమానులు ఇష్టపడటం లేదు. శిక్షణ ఇచ్చిన తరువాత కొద్దిరోజులకు డబ్బులు చెల్లిస్తామంటే పిల్లలకు కెరియర్ గైడెన్స్ బోధించేందుకు నిపుణులూ ఆసక్తి చూపటం లేదు.

**ఆగిన బిల్లులు** టూర్ బస్సులు, భోజనాలకు బిల్లుల సేకరణ, చెల్లింపులో జాప్యం కారణంగా ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. బతుకమ్మ వేడుకలకు రూ.10వేలు, పాఠశాల స్థాయి క్రీడలకు రూ.20వేలు లాంటి బిల్లులు రాగా.. క్రీడా పరికరాలు, టూర్ల బిల్లులు ఆగినట్లు సమాచారం. కరాటే, యోగా తరగతులు మొదలైనా నేటికీ శిక్షకులకు జీతాలు ఇవ్వలేదు. రెండు, మూడు నెలలకోసారి చెల్లించే పరిస్థితి దాపురించింది. 'ఇతర జిల్లాలతో పోల్చితే ఖమ్మం జిల్లాలోనే అధికంగా నిధులు ఖర్చు చేశాం' అని ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ తెలిపారు.

## పుష్కరాల సమయం.. నివేదికలు సిద్ధం



భద్రాచలం : భద్రాచలంలోని గోదావరితో పాటు దేశంలోని నదులు మానవ మనుగడకు ఆధారంగా అనాది కాలం నుంచి సహకరిస్తున్నాయి. జలమే జీవనాధారమై నాగరికతను చాటుతోంది. నీటి వనరుల్లో కాలుష్యం అంతగా లేదని అధికారిక సర్వేలు చెబుతున్నా కళ్లకు కనిపిస్తున్న కాలుష్యాన్ని విస్మరించలేం. ఏరు ఉత్సవంలో ఆధ్యాత్మిక వైభవంతో పాటు జల వనరుల సంరక్షణకు ప్రాధాన్యం ఉంది. పుష్కరాల ఉద్దేశం కూడా ఇదేనని అవగాహన కల్పించాలి. నదుల పరిరక్షణే శ్రీరామ రక్ష. దీన్ని గుర్తించి ఆయా ప్రాంతాల యువత చైతన్య శంఖం పూరించాలి.

**నదిని పూజించడం సంస్కృతిలో భాగం**గంగ, గోదావరి, నర్మద, సరస్వతి, యమున, కృష్ణ, కావేరి, సింధు, తుంగభద్ర నదులు రామాయణ కాలంలోనే ఉన్నాయి. రాముడు అయోధ్య నుంచి పర్ణశాలకు వనవాసం కోసం వచ్చినప్పుడు వీటి గురించి ప్రస్తావించారు. 40కి పైగా నదులు గురించి రామాయణంలో పొందుపర్చారు. ప్రతీ పన్నెండేళ్లకోసారి పుష్కరాల పేరిట నదులను పూజించడం సంస్కృతిలో భాగంగా మారింది. గంగానది, నర్మద, సరస్వతి, యమున, గోదావరి, కృష్ణా నది, కావేరి, భీమరథి, పుష్కర నది, తుంగభద్ర, సింధు, ప్రాణహిత నదుల్లో ఒక్కో ఏడాది ఒక్కో నదికి పుష్కరాలు వస్తాయి. గోదావరి నది అనేది గౌతముడి గోహత్యా పాతకాన్ని పోగొట్టేందుకు జన్మించిది. దక్షిణ గంగగా కీర్తికెక్కింది. ఈ నదీ తీరంలో సీతారాముల వారు పర్ణశాల నిర్మించుకున్నారు. రామాయణంలోని ముఖ్య ఘట్టాలకు గోదావరి తీరం వేదికైంది.

**ఉన్నత స్థాయి సమీక్షలు**వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలు చేస్తారు. ఈ ఏర్పాట్లపై ప్రభుత్వం ఉన్నత స్థాయి సమీక్షలు చేస్తోంది. భద్రాచలం నుంచి బాసర వరకు గోదావరి ఘాట్‌లకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాల గురించి దేవాదాయశాఖ అధికారులు దృష్టి సారించారు. ఇందుకు నీటిపారుదల శాఖ సహకారం తీసుకుంటున్నారు. ఇదే క్రమంలో గుర్తింపు పొందిన సంస్థల ద్వారా క్షేత్రస్థాయిలో సర్వేలు చేస్తున్నారు. రద్దీ తలెత్తినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమాలోచనలు సాగిస్తున్నారు. సంబంధించిన సర్వే నివేదికలను సిద్ధం చేసి ప్రభుత్వానికి అందించారు. భద్రాచలం గోదావరి ఘాట్ అభివృద్ధితో పాటు రామాలయంలో కల్పించాల్సిన సదుపాయాలపై స్పష్టత రావాల్సి ఉంది.

## లష్కర్ల నియామకం

ఖమ్మం : లష్కర్ల నియామకంతో జిల్లాలో నీటి పారుదల శాఖ జవసత్వాలను నింపుకుంది. దశాబ్దాల నుంచి జరగని లష్కర్ల నియామకాన్ని పొరుగు సేవల విధానంతో ప్రభుత్వం ఇటీవల చేపట్టింది. కొద్ది రోజుల క్రితమే సిబ్బంది విధుల్లో చేరారు. పర్యవేక్షణాధికారుల ఆధ్వర్యంలో పనుల్లో సైతం దిగడంతో పిచ్చి మొక్కలు, ముళ్ల చెట్లతో అస్తవ్యస్తంగా ఉన్న నీటి సరఫరా కాల్వల కట్టలు కొత్తరూపాన్ని సంతరించుకుంటున్నాయి. యాసంగిలో పంటల సాగుకు సక్రమ రీతిలో నీరందించే క్రమంలో లష్కర్ల పాత్ర కీలకం కానుంది.

**ఖమ్మం జిల్లాకు 172 మంది..**

జిల్లాకు 172 మందిని ప్రభుత్వం ఏజెన్సీల ద్వారా నియమించింది. పదో తరగతి విద్యార్హతతో రూ.15,600 వేతనంతో లష్కర్లు విధుల్లో చేరారు. జిల్లాకు నియమితులైన సిబ్బందిని ఖమ్మం, కల్లూరు సర్కిళ్ల పరిధిలో కేటాయించారు. ఖమ్మం సర్కిల్‌కు 73 మంది, కల్లూరు సర్కిల్‌కు 99 మందిని నియమించారు. ఖమ్మం సర్కిల్ పరిధిలోని



పాలేరు డివిజన్‌కు 40 మంది, ఖమ్మం డివిజన్‌కు 11 మంది, వైరా డివిజన్‌కు 22 మంది, కల్లూరు సర్కిల్ పరిధిలోని కల్లూరు డివిజన్‌కు 34 మంది, సత్తుపల్లికి 19 మంది, మధిరకు 46 మంది నియామకం జరిగింది.

**విధులు ఇవే..**

ప్రతి ఒక్క లష్కర్ కనీసం 9 కిలోమీటర్ల పరిధిలోని కాల్వల పరిరక్షణ చేపట్టాల్సి ఉంటుంది. కాల్వలు, కట్టలపై పిచ్చి మొక్కలను తొలగించడం, కట్ట పటిష్ఠత పరిశీలన, నీటి సరఫరాలో ఏమైనా అవాంతరాలు ఉంటే పర్యవేక్షణాధికారుల దృష్టికి తీసుకెళ్లడం లాంటివి చేస్తారు. కాల్వలో నిర్ణీత పరిమాణంలో నీటిని సరఫరా చేస్తూ.. ఆయకట్టుకు సమాంతరంగా నీరు చేరేలా పర్యవేక్షించడం, గేట్లు, షట్టర్ల నిర్వహణ, ఏమైనా మరమ్మతులు అవసరమైతే అధికారుల దృష్టికి తీసుకెళ్లడం తదితరాలను అధికారులకు నివేదిస్తారు. పొరుగుసేవల విధానంతో జిల్లాలో 172 మంది నియామకం జరిగింది. డివిజన్ల వారీగా కేటాయించాం. డీఈఈలు, ఏఈల పర్యవేక్షణలో లష్కర్లు విధుల్లో చేరి కేటాయించిన పనులు చేపడుతున్నారు.

మంగళంపూడి వెంకటేశ్వర్లు. ఎస్ఈ ఖమ్మం సర్కిల్

## ప్రయోగం.. ఆలోచనలకు రూపం

హుజూర్‌నగర్ : సృజనాత్మక ఆలోచనలకు శాస్త్రీయ రూపం కల్పించి వాటి ప్రయోగాత్మక నమూనాలు చేసి ఔరా అనిపించారు విద్యార్థులు. హుజూర్‌నగర్ విజయ విద్యామందిర్ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో తమ నమూనాలను ప్రదర్శించారు. శాస్త్ర, సాంకేతికతతో అనేక సమస్యలకు పరిష్కారాలు చూపించిన తీరు సందర్శకులను ఆలోచింపజేసింది. ఇన్‌స్పైర్‌కు ఎంపికైన నమూనాలను తయారు చేసిన వారిని పలకరించగా వాటి ఉపయోగాలను వివరించారు.

**అప్రమత్తం చేసేలా..**

ప్రమాదాలను తగ్గించడానికి, ఆరోగ్య హెచ్చరికలతో కూడిన స్మార్ట్ స్టీరింగ్ ఇది. శరీర, మానసిక దృఢత్వాన్ని నిరంతరం పర్యవేక్షిస్తుంది. నిద్రమత్తు, ధూమపానం, మద్యపానం, వాహనం ముందు అడ్డంకులను స్మార్ట్ స్టీరింగ్ కనిపెడుతుంది. ఇందులోని మైక్రో కంట్రోలర్‌తో అనుసంధానమైన స్మార్ట్ సెన్సార్‌లతో ఇది పనిచేస్తుంది. వాహనం నడిపే సమయంలో అసాధారణ ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ముందుగానే హెచ్చరించి అప్రమత్తంగా వ్యవహరించడానికి, ఇతర హెచ్చరికలను ఇది ముందే చెబుతుంది. దీని ద్వారా ప్రమాదాలను తగ్గించుకోవచ్చు.

కె.మహీధర్, సూర్యాపేట

**ఇంట్లో లేకున్నా మొక్కలకు నీరు..**

నీటిని పొదుపుగా వాడుతూ ఇళ్లలో మొక్కల పెంపకం, వ్యవసాయం ఎలా చేయాలో ఈ నమూనా తెలియజేస్తోంది. ఇందులో మొక్కకు నీరు ఎంత పెట్టాలనుకుంటున్నారో దానికి సెన్సార్ ఏర్పాటు చేసి మోటారు ఆన్ చేయాలి. మొక్కకు నీరు సరిపడా రాగానే ఆటోమేటిక్‌గా మోటారు ఆగిపోతుంది. పెరటి మొక్కలకు, పెద్ద తోటలకు దీన్ని ఉపయోగించుకోవచ్చు. దీనివల్ల మనం ఇంట్లో లేని సమయంలోనూ నీరు పెట్టవచ్చు. నీటి పొదుపుతో పాటు విద్యుత్తు కూడా ఆదా అవుతుంది. ఎస్కే రషీద్, కోదాడ

**ట్రాఫిక్‌ను బట్టి కదిలే డివైడర్**

ట్రాఫిక్ ఇబ్బందులతో అతి తక్కువ దూరం కూడా గంటల తరబడి వెళ్లాల్సి వస్తుంది. అలాంటి సమయాలలో కదిలే డివైడర్లను ఏర్పాటు చేసుకోవడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించి గమ్యాన్ని త్వరగా చేరుకోవచ్చు. కదిలే డివైడర్లు ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్ల సాయంతో రోడ్డు డివైడర్లకు అనుసంధానం చేసి ఎక్కడ ట్రాఫిక్ ఇబ్బందులు ఉంటాయో అక్కడ డివైడర్లు అనుకూలంగా కదిలే అవకాశం ఉంటుంది. చాలా సందర్భాలలో ఒకవైపు భారీ ట్రాఫిక్ ఉంటుంది. మరో వైపు ఉండదు. అలాంటి సమయాలలో డివైడర్లను నియంత్రించడం ద్వారా ట్రాఫిక్ సమస్యను తగ్గించుకోవచ్చు. ఎస్కె సమీర, సూర్యాపేట

## కూరగాయల కుతకుత..

ఎనుమాముల : వరంగల్ లక్ష్మీపురం మార్కెట్‌లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. కొద్దిరోజులుగా ధరలు అమాంతం పెరుగుతుండటంతో.. పేద, మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారం పడుతోంది. మరోవైపు చలి తీవ్రత కారణంగా.. కోళ్ల ఉత్పత్తి తగ్గడంతో.. చికెన్, గుడ్ల ధరలు సామాన్యుడికి అందనంటున్నాయి. గత అక్టోబరులో వచ్చిన మొంథా తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు వరంగల్ జిల్లా పరిసర ప్రాంతాల్లో కూరగాయల తోటలు తీవ్రంగా దెబ్బతినడమే ధరల పెరుగుదలకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు.

**రిటైల్ ధరలు మరింత ఘాటు**లక్ష్మీపురం కూరగాయల మార్కెట్‌లో ధరల నియంత్రణపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో.. రిటైల్ ధరలు మరింత ఎక్కువగా ఉంటున్నాయి. సాధారణంగా ప్రతిరోజు మార్కెట్‌కు వచ్చిన సరకు డిమాండ్‌ను బట్టి ధరలను నిర్ణయించి.. మార్కెట్ అధికారులు ధరల బోర్డులో సరకు ధరలను ప్రదర్శిస్తారు. మార్కెట్ పరిధిలో ఆ ధరలను మించి వ్యాపారులు విక్రయించేందుకు అవకాశం ఉండదు. అయితే మార్కెట్ చుట్టూ చిరు వ్యాపారులు విస్తరించడంతో.. మార్కెట్‌లో తక్కువ ధరకు సరకు కొని.. మార్కెట్ వెలుపల రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. అసలే కూరగాయల ధరలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో చిరు వ్యాపారుల తీరు వినియోగదారులకు భారంగా మారుతోంది. **వామ్మో.. టమాట..**జిల్లా పరిధిలోని వర్ధన్నపేట, ఖిలావరంగల్, ఐనవోలు మండలాల్లోని కొన్ని గ్రామాలు, సంగెం మండలం వంజరపల్లి తదితర గ్రామాల్లో వాతావరణ అనుకూలతల మేరకు డిసెంబరు నుంచి మార్చి వరకు మాత్రమే టమాట పండిస్తారు. అయితే ఈసారి డిసెంబరులో చలితీవ్రత కారణంగా.. టమాట దిగుబడి భారీగా తగ్గిందని రైతులు చెబుతున్నారు. దీంతో వ్యాపారులు ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా మదనపల్లి, కర్ణాటకలోని చింతామణి, భాగ్యపల్లి తదితర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.

# జల కల నెరవేరేదెన్నడో?



వేములవాడ :,ఎల్లంపల్లి ఎత్తిపోతల పథకంలో భాగంగా సాగు, తాగునీటి కోసం వేములవాడ గ్రామీణ మండలంలో చేపట్టిన మర్రిపల్లి జలాశయం పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఏళు గడుస్తున్నా జలాశయం పనులు పూర్తికాకపోవడంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన నెలకొంది. మర్రిపల్లి చెరువు పూర్తి సామర్థ్యం 4.2 ఎంసీఎఫ్టీలు. చెరువు సామర్థ్యాన్ని 70.2 ఎంసీఎఫ్టీలుగా పెంచి మర్రిపల్లి, నాగయ్యపల్లి, పోచెట్టిపల్లి, కోనాయపల్లి గ్రామాలకు కుడి కాలువ ద్వారా.. మర్రిపల్లి, మల్లారం తదితర గ్రామాలకు ఎడమ కాలువ ద్వారా మొత్తం 3,527 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలని నిర్ణయించారు. రైతుల నుంచి 234 ఎకరాల భూమి సేకరించారు. ప్రారంభంలో జలాశయ పనులు వేగంగా కొనసాగినప్పటికీ తరువాత వివిధ కారణాలతో నత్తనడకన నడిచి పూర్తిగా నిలిచిపోయాయి.

**ఉన్నతాధికారులు పర్యవేక్షించినా..**

గతేడాది నీటిపారుదల శాఖ ఇంజినీర్ ఇన్ చీఫ్ అనిల్‌కుమార్ జలాశయాన్ని పరిశీలించి మే నెలాఖరు వరకు పనులు పూర్తి చేయాలని ఆదేశించినప్పటికీ ఫలితం లేదు. ఫాజుల్‌నగర్‌లోని బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు చేరుకున్న ఎల్లంపల్లి జలాలను ప్రధాన కాలువ ద్వారా నర్సింగాపూర్, మర్రిపల్లి, జోగాపూర్, బండపల్లి, లచ్చపేట, నాగారం వద్ద నిర్మించిన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లను పూర్తి స్థాయిలో నింపిన అనంతరం ఉప కాలువల ద్వారా పంట భూములకు నీరు అందించాలని నిర్ణయించారు. ఫాజుల్‌నగర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ప్రధాన కాలువ ద్వారా ఈ ప్రాంతంలోని మినీ జలాశయాలు, చెరువులు, కుంటలను నింపుతున్నా.. మర్రిపల్లిలో పనులు పూర్తికాక నింపడం లేదు. ఇప్పటి వరకు 1.9 కిలోమీటర్ల పొడవున కట్టకు రాయితెట్ట పూర్తయింది. ఈ కట్టను తొమ్మిది మీటర్ల ఎత్తుతో నిర్మించాల్సి ఉంది. పనులను వేగంగా పూర్తి చేసి జల కలను నెరవేర్చాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పనుల్లో వేగం పెంచాలని గుత్తేదారుకు సూచించామని నీటి పారుదలశాఖ డీఈఈ విద్యాసాగర్ పేర్కొన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

**మత్స్యకారులకూ ఉపాధి- రాజు, రైతు, మర్రిపల్లి**

జలాశయ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఇది పూర్తయితే భూగర్భ జలాలు పెరిగి సాగు నీటి ఇబ్బందులు తొలగుతాయి. పెద్దసంఖ్యలో మత్స్యకారులకు ఉపాధి దొరుకుతుంది. **పాలకులూ.. పట్టించుకోరూ.. - పాటి వినీత్, మర్రిపల్లి** రైతులు ఏటా వర్షాలకు ఎదురుచూడాల్సిన పరిస్థితి. జలాశయం పూర్తయితే శాశ్వతంగా నీరు ఉంటుంది. రైతులు భూములు ఇచ్చినా ఏళ్లుగా పనులు ముందుకు సాగడం లేదు. పాలకులు పట్టించుకొని పనులు పూర్తి చేయించాలి.

## ఇంకెన్ని ప్రాణాలు పోవాలో!

మెట్‌పల్లి: జిల్లాలో 63వ నంబరు జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. పలు చోట్ల మలుపులు, ఏటవాలు ఆకృతికి తోడు అజాగ్రత్త, అతివేగంతో వాహనాలు అదుపు తప్పి ప్రాణాలు పోతున్నాయి. ఈ మార్గంలో నాలుగు వరుసలుగా నిర్మించాలని నిర్ణయించగా పనులు ప్రారంభం కాకపోగా ప్రమాదాలు పరిపాటిగా మారాయి.

**విభాగిని లేక.. విస్తరణకు నోచుకోక**

నిజామాబాద్-జగదల్‌పూర్ మార్గంలో దాదాపు 25 ఏళ్ల కిందట అప్పటి అవసరాలకు అనుగుణంగా జాతీయ రహదారిని నిర్మించారు. ప్రస్తుతం వాహనాల సంఖ్య పెరగడంతో ఈ మార్గం నిత్యం రద్దీగా ఉంటోంది. ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్‌ను కలిపే రోడ్డు కావడంతో సరకు రవాణా చేసే భారీ వాహనాలు అధిక సంఖ్యలో ప్రయాణిస్తాయి. రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండగా, జాతీయ రహదారి కావడంతో వేగం కొంత ఎక్కువగానే ఉంటోంది.

రహదారి మధ్యలో డివైడర్ లేక ఓవర్‌టేక్ చేసే సమయంలో వాహనాలు ఢీకొంటున్నాయి. చాలా చోట్ల మలుపులు, రోడ్డు వంపుగా ఉండటం,



కొన్ని చోట్ల ఏటవాలుగా ఉండటంతో వేగం పెరిగి అదుపు తప్పుతున్నాయి. గ్రామాలను అనుసంధానించే కూడళ్ల వద్ద వాహనాలు నేరుగా హైవేపైకి దూసుకురావడం ప్రమాదాలకు మరో కారణం.

**14 కిలోమీటర్లు.. 14 ప్రదేశాలు**

జాతీయ రహదారిపై మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో సుమారు 14 కిలోమీటర్ల పరిధిలో 14 వరకు ప్రమాదకర ప్రదేశాలున్నాయి. రాజేశ్వర్‌రావుపేట వరద కాలువ వంతెన, బండలింగాపూర్ క్రాస్ రోడ్డు, మేడిపల్లి, ఇబ్రహీంపట్నం క్రాస్ రోడ్డు, వెంకట్రావుపేట కల్వర్టు, బస్సుస్టేజ్, పెట్రోల్ బంక్ మలుపు, శక్తిబార్ నుంచి పోలీస్‌స్టేషన్, ఆరపేట శివాలయం మలుపు, చౌలమద్ది క్రాస్ రోడ్డు, చింతలపేట క్రాస్ రోడ్డు, మారుతినగర్, పెద్దాపూర్ క్యాంప్ క్రాస్ రోడ్డు, పెద్దగుండు శివారు ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

**మూడు నెలల్లో నలుగురు మృత్యువాత**

అక్టోబరులో మెట్‌పల్లి శివారు వెంకట్రావుపేట రోడ్డులో వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో ద్విచక్రవాహనదారు మృతి చెందాడు.

అదే నెల 26న వెంకట్రావుపేట రోడ్డులో ద్విచక్రవాహనం, కారు ఢీకొని యువకుడు మృత్యువాత పడ్డాడు.

ఈ నెల 23న వెంకట్రావుపేట వద్ద కారు, ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో పెను ప్రమాదం తప్పింది.

27న మెట్‌పల్లి-కోరుట్ల మధ్య పెద్దగుండు వద్ద లారీ, కారు ఢీకొన్న ఘటనలో దంపతులు దుర్మరణం చెందారు.

**హెచ్చరిక బోర్డులేవీ!** ప్రమాదాల నివారణకు ప్రమాదకర ప్రదేశాల్లో వేగ నియంత్రణకు రంబుల్ స్ట్రిప్స్, మలుపు, ఓవర్‌టేక్ చేయొద్దనే సూచికలు ఏర్పాటు చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. అలాగే ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు బిగించాల్సిన అవసరముంది.

## గ'మ్మత్తు'.. యువత చిత్తు!

ఎల్లారెడ్డిపేట: యువత మత్తు పదార్థాలకు బానిస అవుతూ.. గ'మ్మత్తు'లో భవిష్యత్తును చేజేతులా నాశనం చేసుకుంటోంది. పట్టుబడుతున్న వారిలో బాలలు మొదలుకొని 25 నుంచి 30 ఏళ్ల వయసున్న యువకులు ఎక్కువగా ఉండడం ఆందోళన కలిగిస్తోంది.

**చాపకింద నీరులా..** జిల్లాలో గంజాయి విక్రయాలు చాపకింద నీరులా సాగుతున్నాయి. బస్టాండ్లు, జనసమ్మర్ద ప్రాంతాలు, కొన్ని పాఠశాలలు, కళాశాలలు, కొట్ల వద్ద అడ్డాలు వెలుస్తున్నాయి. తక్కువ సమయంలో ఎక్కువ ధనార్జనే ధ్యేయంగా కొందరు అక్రమార్కులు గంజాయి విక్రయాలకు తెగబడుతున్నారు. వీరు ఆంధ్రప్రదేశ్, ఒడిశా, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. వాహనాలు, రైళ్లు, బస్సుల్లో రహస్య ప్రాంతాలకు తరలిస్తున్నారు. చిన్నమొత్తంలో తీసుకొచ్చి, పొట్లాల్లో ప్యాక్ చేస్తూ విక్రయాలకు తెరలేపుతున్నారు. వాట్సప్ ద్వారా సమాచారమిచ్చి దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఎల్లారెడ్డిపేటలోని పాఠశాలలో డిసెంబరు 24న విద్యార్థులు గంజాయి తాగుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఇద్దరు పారిపోగా ఒకరు చిక్కారు. హుక్కా పీల్చే పరికరం, పైపు లభ్యమయ్యాయి. విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి, కౌన్సెలింగ్ ఇచ్చారు. నవంబరు 17న ఎల్లారెడ్డిపేట మండలం దుమాల బ్రిడ్జి వద్ద గంజాయి అమ్మేందుకు వచ్చారనే సమాచారంతో ఎస్సై



రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు గస్తీ నిర్వహించారు. 150 గ్రాముల గంజాయి స్వాధీనపరచుకున్నారు. ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ ఆలయ కమాన్ వద్ద నవంబరు 10న పోలీసులకు ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారు. వారిని తనిఖీ చేయగా 105 గ్రాముల గంజాయి బయటపడింది. వెంటనే నిందితులను అరెస్ట్ చేశారు.

అక్టోబరు 5న ఎల్లారెడ్డిపేట ఎల్లమ్మ ఆలయం వద్ద పోలీసులు తనిఖీ చేశారు. ఇద్దరి వద్ద 160 గ్రాముల గంజాయిని స్వాధీనపరచుకొని, నిందితులను అరెస్ట్ చేశారు. పోలీసులకు చిక్కిన ఇద్దరిలో ఒకరు 25 సంవత్సరాలు, మరొకరు 27 సంవత్సరాల వయసు ఉన్నారు.

నిఘా తీవ్రతరం: సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎల్లారెడ్డిపేట

గంజాయి నిర్మూలనకు నిఘాను తీవ్రతరం చేశాం. వారానికి రెండు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. అనుమానితులను యూరిన్ టెస్ట్ కిట్‌ల ద్వారా పరీక్షిస్తున్నాం. గంజాయి తాగినట్లు తేలితే కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరచుతున్నాం. పాత నేరస్థులను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం. వారి కదలికలను గమనిస్తున్నాం.

## హద్దులు చెరిపేసి..దర్జాగా దున్నేసి..



కోరుట్ల: పచ్చటి చెట్లు నేలమట్టమవుతున్నాయి.. రాళ్ల గుట్టలు తరిగిపోతున్నాయి.. ప్రభుత్వ భూములే కదా! ఆక్రమిస్తే అడిగేదెవరన్న ధీమాతో యంత్రాలతో చెట్లు నరికి, గుట్టలు చదును చేస్తున్నారు. కథలాపూర్ మండలంలో అటవీ శాఖకు చెందిన వందల ఎకరాల భూములను దర్జాగా సాగు చేసుకుంటున్నారు. అంబారిపేట, పోతారం, చింతకుంట బీట్‌లు ఉండగా వీటి పరిధిలో మొత్తం 17 కంపార్ట్‌మెంట్లున్నాయి. కథలాపూర్ మండలంలో అంబారిపేట, తుర్తి, కలికోట, పోతారం, ఇప్పపల్లి, పోసానిపేట, చింతకుంట, భూషణరావుపేట గ్రామాల్లోని అటవీ శాఖ పరిధిలో మొత్తం 2,759.276 హెక్టార్ల అటవీ భూములున్నాయి. ఇందులో చింతకుంట, తుర్తి, పోతారం, ఇప్పపల్లి గ్రామాల శివార్లలో ఎక్కువగా ఆక్రమణకు గురైనట్లు గతంలో అధికారులు గుర్తించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారొచ్చి చెట్లను తొలగించి భూములను సాగు చేసుకుంటున్నారు. పలు చోట్ల గుట్టలను చదును చేసి మామిడి తోటల పెంపకం చేపట్టగా, చాలా చోట్ల వరి, ఇతర పంటలు సాగు చేస్తున్నారు. అటవీ భూముల చుట్టూ హద్దులున్నా వాటిని చెరిపేసి మరీ ఆక్రమించుకుంటున్నారు.

**11 నెలల్లో 12 కేసులు**

ఆక్రమణలకు అడ్డుకొనేందుకు వెళ్లిన అటవీ శాఖ సిబ్బందిపై గతంలో పలుమార్లు గ్రామస్థులంతా మూకుమ్మడిగా దాడులకు పాల్పడిన ఘటనలున్నాయి. అటవీ శాఖ భూముల పరిరక్షణ కోసం పోలీసుల బందోబస్తుతో వెళ్లాల్సి వచ్చింది.

గతేడాది ఫిబ్రవరి నుంచి డిసెంబరు వరకు మండలంలో అటవీ శాఖ భూములను చదును చేసిన, ఆక్రమణకు పాల్పడిన వారిని గుర్తించి 12 కేసులు నమోదు చేశారు.

ఇటీవల ఇప్పపల్లి శివారులోని అటవీ శాఖ భూమిని పోతారానికి చెందిన కొండయ్య చదును చేయగా గ్రామస్థులు అడ్డుకున్నారు. అనంతరం అతడిపై అటవీ శాఖ అధికారులు కేసు నమోదు చేయించారు. చదును చేసిన భూమిని గ్రామస్థులు ఆక్రమించుకోకుండా చుట్టూ కందకం తవ్వించారు.

**పరిరక్షణకు కఠిన చర్యలు**

అటవీ భూముల పరిరక్షణకు కఠిన చర్యలు తీసుకుంటున్నాం. చదును చేసిన వారి వెంటవెంటనే గుర్తిస్తూ కేసులు నమోదు చేయిస్తున్నాం. అటవీ శాఖ సిబ్బంది నిత్యం బీట్‌ల వారీగా పర్యటించి భూముల్లోకి ఎవరూ ప్రవేశించకుండా చర్యలు చేపడుతున్నాం. -ముస్తాక్‌అలీ, అటవీ శాఖ కథలాపూర్ సెక్షన్ అధికారి


## నామ'మాత్ర'మే.. రోగులకు శాపమే!

గోదావరిఖని: అంతా ఉచితమేనని వైద్యం కోసం గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులకు ఆర్థికభారం తప్పటం లేదు. అవసరమైన మందుల సరఫరాలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. ఖనిలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో అత్యవసరమైన సాధారణ మందులు సైతం అందుబాటులో లేకపోవటంతో రోగులు ప్రైవేటుగా కొనుక్కోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని రకాల మందులు ప్రభుత్వం సరఫరా చేయకపోగా.. జిల్లా కలెక్టర్ చొరవతో ఆస్పత్రి వర్గాలు స్థానికంగా కొనుగోలు చేసి రోగులకు సరఫరా చేసేవారు. ప్రస్తుతం నిధుల కొరత, సంబంధిత ఏజెన్సీకి బకాయిలు భారీగా పేరుకుపోవటంతో ప్రైవేటులో కొనుగోలు చేసేందుకు సైతం ఆసుపత్రి వర్గాలు దృష్టి సారించటం లేదు.

**ప్రైవేటు దుకాణాలకు..**

వాతావరణంలో వస్తున్న మార్పులు, పెరుగుతున్న చలితో జ్వరం, దగ్గు, జలుబుతో పాటు శ్వాసకోశ వ్యాధులతో దవాఖానాకు రోగుల తాకిడి పెరుగుతోంది. ఈ రోగాల నివారణలో కీలకమైన మందులు అందుబాటులో లేవు. ప్రధానంగా పిల్లల్లో దగ్గు, జలుబు నివారణకు అవసరమైన సిరప్‌లు లేవు. మాత్రలు అందుబాటులో ఉన్నప్పటికీ.. వాటికి అదనంగా ఇవ్వాల్సిన యాంటీ బయాటిక్స్‌తో పాటు ఇతర మందులు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు దుకాణాలను ఆశ్రయించాల్సి వస్తోంది.

దగ్గు, జలుబు నుంచి సత్వర ఉపశమనానికి వివిధ రకాల విటమిన్లకు సంబంధించిన సిరప్స్ ఆసుపత్రిలో లభించటం లేదు. సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లోనే ఇలాంటి మందులు ఉండకపోవటం గమనార్హం. దీంతో



ప్రైవేటులో సిరప్‌ల కొనుగోలుకు అత్యధికంగా డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోంది. మందుల కొరతపై వైద్యులకు అవగాహన లేదు. వారు రాసిన మందులు ఫార్మసీలో లేవంటూ సిబ్బంది రోగులను వెనక్కి పంపిస్తున్నారు. లేవని, ప్రైవేటులో కొనుక్కోవాలని చెప్పొద్దంటూ.. ఉన్నవాటితో రోగులకు సర్దుబాటు చేయాలని సిబ్బందికి అధికారులు సూచిస్తుండటం గమనార్హం.

అందుబాటులో అత్యవసర మందులు

అత్యవసర మందులు ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నాయి. కొన్ని రకాల సిరప్స్ లేవు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులన్ని ఆసుపత్రిలో ఉన్నాయి. జిల్లా కలెక్టర్ చొరవతో రోగులకు అవసరమైన మందులను ప్రైవేటులో కొనుగోలు చేశాం. కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- డాక్టర్ రాజు, రెసిడెంట్ మెడికల్ అధికారి

## ఆక్రమణలకు అడ్డుకట్ట!

ఆదిలాబాద్ :పట్టణానికి ఆనుకొని దాదాపు 114 ఎకరాల్లో విస్తరించిన ఖానాపూర్ చెరువుకు మూడువైపులా కట్ట నిర్మించి ఉండగా వెనుక వైపు లేదు. దీంతో కొన్నేళ్లుగా చెరువు స్థలం ఆక్రమణకు గురవుతూ వస్తోంది. భవిష్యత్తులో చెరువు ఆక్రమణకు గురికావొద్దంటే.. చుట్టూ కట్ట నిర్మించాలని నిర్ణయించారు. ఖానాపూర్ చెరువు పరిస్థితి అధ్వానంగా తయారైంది. పట్టణానికి ఆనుకుని 114 ఎకరాల్లో విస్తరించిన చెరువు.. పర్యాటకానికి అన్నివిధాలా అనుకూలించే పరిస్థితులు ఉన్నా సుందరీకరణకు నోచుకోవడం లేదు. చెరువు స్థలం ఆక్రమణకు గురై ఆహ్లాదాన్ని పంచకపోగా ఇటు మత్స్యకారుల ఉపాధికి తీరని నష్టం కలుగుతోంది. అమృత్ 2.0 పథకం కింద చెరువు పునరుద్ధరణకు రూ.3.14 కోట్లు మంజూరుకాగా, డీపీఆర్‌లో చెరువు చుట్టూ కట్ట నిర్మించాలని నిర్ణయించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**ఎలా ముందుకెళ్తారో?**

చెరువు స్థలం ఆక్రమణకు గురికావడంతో గతేడాది సెప్టెంబరులో అధికారులు సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే. చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం, బఫర్‌జోన్‌లో ఎన్ని నివాసాలు ఉన్నాయో లెక్క తేల్చేందుకు బల్దియా, రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు సంయుక్తంగా సర్వే చేశారు. చెరువు వాస్తవ ఎఫ్‌టీఎల్ పరిధిలోని కొన్ని ఇళ్లకు మార్కింగ్ చేశారు. కొన్నేళ్లుగా నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారు అభ్యంతరం వ్యక్తం చేయడం రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. దీంతో రెండు రోజులకే సర్వే నిలిపివేశారు. ప్రస్తుతం అమృత్ 2.0 పథకం కింద చెరువుకు వలయాకార కట్ట నిర్మించాల్సి ఉంది. దీంతో అధికారులు కట్టను ఎలా నిర్మిస్తారు..? ఆక్రమణల విషయంలో ఎలా ముందుకెళ్తారోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది.



**చిగురించిన ఆశలు**

గతంలో ప్రభుత్వం మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్దుతామని 2017లో మిషన్ కాకతీయ పథకం కింద రూ.4.83 కోట్ల నిధులను వెచ్చించింది. అధికారుల పర్యవేక్షణ లోపంతో పనులు నాసిరకంగా జరిగాయి. చాలాచోట్ల చెరువు కట్ట కోతకు గురైంది. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినా వెలగడం లేదు. చెరువంతా గుర్రపు డెక్క వ్యాపించింది. గతంలో ఇదే చెరువు కింద ఏటా 100-150 టన్నుల చేపల దిగుబడి వచ్చేదని, వందలాది మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి లభించేదని మత్స్యకారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం చెరువు అభివృద్ధి చేయాలని తలపించడంతో అటు ఆహ్లాదంతో పాటు మత్స్యకారుల్లో ఆశలు చిగురించాయి.

**కలెక్టర్ ఆదేశం మేరకు**

అరుణ్, డీఈ, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ

అమృత్ 2.0 పథకం కింద రూ.3.14 కోట్లు మంజూరయ్యాయి. ఖానాపూర్ చెరువు చుట్టూ కట్టను నిర్మించాల్సి ఉంది. గుత్తేదారుతో ఒప్పందం చేసుకోవాల్సి ఉంది. ఆక్రమణల విషయంలో కలెక్టర్ ఆదేశానుసారం ముందుకెళ్తాం.

## ఆగదు కాలం.. ఆపకు పయనం

దండేపల్లి : ఓ అడుగు ముందుకు పడిందంటే.. దాన్ని వెనక్కి తీసుకోవచ్చు. సమయం అలా కాదు. గడిచిన కాలం వెనక్కి రాదు. వచ్చే రెండు నెలల్లో ఇంటర్ తర్వాత పది, డిగ్రీ తదితర పరీక్షలు జరగనున్నాయి. ఉద్యోగాలకు సంబంధించిన పోటీ పరీక్షలకు సైతం ప్రకటనలు వెలువడనున్నాయి. ఈ నేపథ్యంలో విలువైన సమయాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలనే దానిపై 'న్యూస్‌టుడే' కథనం.

**డబ్బుకన్నా మిన్న** గడిచిన రోజు రద్దు చేసిన చెక్కు లాంటిది. చేతిలో ఉన్న డబ్బును ఎలా సద్వినియోగం చేస్తావో అలాగే సమయాన్ని వినియోగించుకోవాలి. ప్రధానంగా చదువు, నిద్రకు సమయాన్ని కేటాయించుకోవాలి. సమయానికి విలువ ఇవ్వాలి. అప్పుడే విజయతీ రాలకు చేరుస్తుంది.

**కబుర్లతో కాలక్షేపం..** కళాశాలకు వెళ్లే విద్యార్థులు పాఠ్యాంశాలంటే బోరు అంటూ తరగతి గదుల నుంచి బయటకు వచ్చేస్తున్నారు. బేకరీ, చరవాణులతో సమయం గడుపుతున్నారు. కబుర్లకు గుడ్‌బై చెబితేనే బంగారు జీవితం సొంతమవుతుంది.

**ఇవి పాటిస్తే ప్రయోజనం** 1.చరవాణి అవసరం మేరకే వాడండి. వినియోగానికి తగిన సమయం కేటాయించి పరిమిత సమయం వరకు వాడండి. 2.అదే పనిగా చాటింగ్ చేస్తే చదువుపై శ్రద్ధ తగ్గుతుందని గ్రహించండి. అంతర్జాలమంటే కేవలం వినోదం కోసం కాదు అమితమైన విజ్ఞానాన్ని కూడా పొందవచ్చని తెలుసుకోండి. ఏ రోజు పనులను అదే రోజు చేయండి. వాయిదా వేయొద్దు.

3.చదువుతో పాటు నిద్రకు తగిన సమయం కేటాయించండి. ఆరోగ్య



సూత్రాలు పాటించండి.

4.ఖాళీ సమయాల్లో పుస్తకాలు చదవాలి. మేధస్సు పెంచుకోవడానికి ఎక్కువ సమయం కేటాయించాలే తప్ప సరదాలకు వృథా చేయకూడదు. మంచి మిత్రులతో స్నేహం చేస్తే విజ్ఞానం వస్తుంది.

ఉమ్మడి జిల్లాలో పది, ఇంటర్, డిగ్రీ విద్యార్థుల వివరాలు

ఇంటర్ ప్రథమ సంవత్సరం 32,165

ద్వితీయ 29,870

పదో తరగతి 18,475

డిగ్రీ 48,895

లక్ష్యం తెలుసుకోవాలి ప్రతి విద్యార్థికి ఏదో ఒక లక్ష్యం తప్పనిసరి. లేదంటే జీవితం అంధకారమవుతుంది. చాలా మంది పది, ఇంటర్‌కు వచ్చే సరికి జీవిత లక్ష్యం ఏమిటి అని అడిగితే ఇంకా నిర్ణయించుకోలేదని చెబుతారు. మరికొందరు స్థాయికి మించి లక్ష్యం నిర్ణయించుకొని ఒత్తిడికి గురవుతుంటారు. అర్హత, ఆసక్తి అనుకూలత వంటి అంశాలను ఆధారంగా తీసుకొని లక్ష్యం ఏర్పరుచుకోవాలి. దీనిని సాధించాలంటే ప్రణాళిక అవసరం. అంటే కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

అస్మిత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, దండేపల్లి

**ఎవరికైనా 24 గంటలే..** ఎవరికైనా రోజుకు ఇరవై నాలుగు గంటలు సమయమే ఉంటుంది. సమయానికి పేద, ధనిక లాంటివి ఉండదు. తరగతి గదుల్లో కొందరు విజేతలుగా ఉంటే మరికొందరు పరాజితులవుతున్నారు. చదువుపై దృష్టి పెట్టడం, ప్రణాళికాబద్ధంగా చదువుకోవటంలో ఉన్న వ్యత్యాసమే దానికి కారణం. బలిజపెల్లి కిషన్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

చురకలు




# 12 జోన్లు.. 60 సర్కిళ్లు

హైదరాబాద్ : డివిజన్ల పునర్విభజన పూర్తవడంతో.. తదుపరి కార్యాచరణపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ దృష్టి పెట్టారు. అందుకు సంబంధించిన ప్రణాళికను కేంద్ర కార్యాలయం ఇప్పటికే రూపొందించింది. దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. సర్కారు ఆమోదం తెలపగానే.. ప్రస్తుత డివిజన్లు, సర్కిళ్లు, జోన్ల హద్దులను మార్చుతూ.. ఉత్తర్వు వెలువడుతుంది. ఈ ప్రక్రియ మొత్తం వారంలో పూర్తవనున్నట్లు ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు.

**పరిధి పెరగడంతో..**

ఇటీవలి వరకు జీహెచ్ఎంసీ 650చ.కి.మీ పరిధిలో ఉండేది. ఆరు జోన్లు, 30 సర్కిళ్ల ద్వారా పరిపాలన సాగింది. 27 శివారు పట్టణ స్థానిక సంస్థల విలీనంతో గ్రేటర్ హైదరాబాద్ విస్తీర్ణం 2,053 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. గ్రేటర్‌లో కలిసిన మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో పరిపాలన సమస్యలు తలెత్తకూడదన్న ఉద్దేశంతో.. కమిషనర్ ఆయా స్థానిక సంస్థలను సర్కిళ్లుగా పేర్కొంటూ.. దగ్గరలోని జోనల్ కార్యాలయాలకు అనుసంధానం చేశారు. ఒక్క ఖైరతాబాద్ జోన్‌కు మినహా.. మిగిలిన ఐదు జోన్లలో కొత్త ప్రాంతాలు కలిశాయి. జోనల్ కార్యాలయాల నుంచి శివారు ప్రాంతాల బాగోగులు చూసుకోవడం జోనల్ కమిషనర్లకు కష్టంగా మారింది. ఉదాహరణకు.. ఎల్బీనగర్‌లోని జోనల్ కార్యాలయం నుంచి పెద్దఅంబర్‌పేట్ సర్కిల్‌లోని పారిశుద్ధ్యం, వీధిలైట్లు, రహదారుల నిర్వహణ పనులను పరిశీలించడం




కష్టమైనది. ఇదే అభిప్రాయాన్ని దాదాపు అందరు జడ్జీలు కమిషనర్ కార్యాలయం దృష్టికి తీసుకెళ్లడంతో.. జోన్లను ఆరు నుంచి 12కు, సర్కిళ్లను 60కి పెంచాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. అంటే.. ఒక్కో జోన్ పరిధిలో ఐదు సర్కిళ్లు ఉండనున్నాయి.

**జనవరిలో జనగణన మొదలైతే..**

జన గణన మొదలైతే.. తర్వాత ఏడాది నుంచి రెండేళ్ల వరకు నగరంలో డివిజన్ల పునర్విభజన చేపట్టడం సాధ్యపడదు. జనవరిలో జన గణన మొదలవుతున్నందున.. రాష్ట్ర ప్రభుత్వం హడావుడిగా జీహెచ్ఎంసీలో శివారు స్థానిక సంస్థలను విలీనం చేసి డివిజన్ల పునర్విభజన చేపట్టింది. దానికి కొనసాగింపుగా.. జోన్లు, సర్కిళ్ల పునర్ వ్యవస్థీకరణ త్వరలో జరగబోతుంది. ఈ పునర్ వ్యవస్థీకరణ.. భవిష్యత్తులో జీహెచ్ఎంసీని మూడు మహానగరపాలక సంస్థలుగా విభజించాలన్న సర్కారు ఆలోచనలకు అనుకూలంగా ఉండనుంది.

**మూసీ హద్దుగా..**

మూసీ నది హద్దుగా దక్షిణం వైపున ఉండే ప్రాంతాలన్నింటినీ కలిపి ఓ కార్పొరేషన్ ఏర్పాటు చేసే అవకాశం ఉందని, ఉత్తరం వైపు భాగాన్ని సికింద్రాబాద్, సైబరాబాద్ కార్పొరేషన్లుగా ఏర్పాటు చేయాలని సర్కారు ప్రాథమికంగా నిర్ణయించింది. పాతబస్తీతో ఏర్పాటయ్యే మహానగరపాలక సంస్థకు జీహెచ్ఎంసీ పేరు అలాగే కొనసాగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

# టెండరు దశ దాటలే..

నిజామాబాద్: నిజామాబాద్ నగరపాలికతో పాటు జిల్లాలోని బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ పురపాలికల్లో మౌలిక వసతులను కల్పించేందుకు ప్రభుత్వం 4 నెలల క్రితం నిధులు కేటాయించింది. ఆ పనులు ఎక్కడా ప్రారంభం కాలేదు. అధికారులు టెండర్లు పిలిచారు. అయినా గుత్తేదారులు ముందుకు రావడం లేదు. కొన్నిచోట్ల టెండర్లు ముగిసినా పనులు చేపట్టడంలో తాత్సారం జరుగుతోంది. కాలనీల్లో సీసీ రోడ్లు లేక రాకపోకలు సాగించడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మట్టిదారులపై మురుగు చేరుతోంది. విస్తరణకు నోచని పట్టణ కూడళ్లు ట్రాఫిక్ సమస్యకు కేరాఫ్‌గా నిలుస్తున్నాయి.

ఆర్మూర్ పురపాలికకు రూ. 18.70 కోట్లు మంజూరయ్యాయి. పెర్కిట్ కూడలి, మామిడిపల్లి, పార్కుల్లో అభివృద్ధి పనులు.. మామిడిపల్లి నుంచి హెచ్‌పీ పెట్రోల్‌బంక్ వరకు మురుగుకాల్వ, పలు కాలనీల్లో సీసీ, బీటీ రోడ్లు నిర్మించాల్సి ఉంది. హైమాస్ట్ దీపాలకు నిధులు వెచ్చించాలి. ఈ పనులేవీ ప్రారంభం కాలేదు.

భీమ్‌గల్ పట్టణంలో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి రూ. 15 లక్షలు కేటాయించారు. ఈ పనులూ పట్టాలెక్కలేదు.

బోధన్ పురపాలికలో ప్రధాన రోడ్డు మరమ్మతులు, వరద కాలువల



నిర్మాణం, శివారు కాలనీల్లో మొరం రోడ్లు, పార్కుల అభివృద్ధి తదితర పనులకు రూ. 20.17 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులనూ గ్రహణం వీడటం లేదు.

నిజామాబాద్ నగరపాలికలో పులాంగ్ చౌరస్తాతో పాటు, ఎన్టీఆర్ చౌక్, బైపాస్ వద్దనున్న కూడలిని విస్తరించాల్సి ఉంది. వీటితో పాటు పలు ప్రధాన రహదారుల అభివృద్ధికి రూ. 20 కోట్లు కేటాయించగా.. టెండర్ దశకే పురోగతి పరిమితమైంది. శివారు కాలనీల్లో మురుగు కాలువల పనులు నత్తనడకన సాగుతున్నాయి. కూడళ్ల విస్తరణ పూర్తిచేస్తే ట్రాఫిక్ సమస్య తీరుతుందని నగరవాసులు పేర్కొన్నారు.

**'ప్రభుత్వ నిధులతో**

అభివృద్ధి పనులను త్వరలో ప్రారంభిస్తాం. టెండర్లు పూర్తికాగానే నగరంలో కావాల్సిన చోట్ల మౌలిక వసతులు కల్పిస్తాం' అని నిజామాబాద్ నగర కమిషనర్ దిలీప్‌కుమార్‌తో అన్నారు.

# నేలపై..దోమలకు నెలవై



తుంగతుర్తి : ఊళ్ల మధ్యలో ఏళ్ల నాటి నేల బావులు ప్రమాదకరంగా మారాయి. దరులు కూలి, మురుగు కూపాలై, దోమలు, విషపురుగులకు నెలవై ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. జిల్లాలోని పలు గ్రామాల్లో ఇవి మృత్యుకుహరాలుగా మారుతున్నాయి.

**నాడు గొంతు తడిపి:** పూర్వ కాలంలో తాగునీటి కోసం తవ్వారు. నాడు ప్రజల గొంతులు తడిపాయి. ప్రస్తుతం ఇంటింటికీ నల్లా వచ్చింది. కాలక్రమేణ ఈ బావులు కొన్నేళ్లుగా నిరుపయోగంగా మారాయి.

నేడు ప్రాణాంతకంగా మారి: ఏళ్లుగా బావుల నీటిని ఉపయోగించక శిథిలమయ్యాయి. నీరు పాకురు పట్టి పరిసరాల్లో దుర్గంధం వ్యాపిస్తోంది. ఆ ప్రాంతాల్లో వీధి దీపాల్లేక రాత్రి వేళ తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మేతకు వెళ్లిన మూగజీవులు అందులో పడి మృతి చెందుతున్నాయి. ఇక రాత్రుల్లో మందుబాబులు తూలుతూ అదుపుతప్పి పడిన సందర్భాలున్నాయి. వృథాబావులు చెత్త డంపింగ్ యార్డులుగా మారుతున్నాయి. చెట్ల పొదలతో నిండి విషసర్పాలకు నిలయమవుతున్నాయి. మరోవైపు దోమలు వ్యాప్తి చెంది పరిసర ప్రాంత వాసులు వ్యాధుల బారిన పడుతున్నారు.

ఇలా చేస్తే మేలు: నూతనంగా ఎన్నికైన గ్రామపంచాయతీ సర్పంచులు, వార్డు సభ్యులు ఊరి మధ్యలో వృథా బావులను గుర్తించి ఉన్నతాధికారులతో మాట్లాడి వాటిని పూడ్చివేసి ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఆరేళ్లుగా అర్జీలు: తమ ఇంటి సమీపంలో ప్రమాదకరంగా మారిన పాత బావిని పూడ్చివేయాలని ఆరేళ్లుగా అధికారులు, ప్రజాప్రతినిధులకు అర్జీలు పెట్టినా పట్టించుకోలేదని వెలుగుపల్లికి చెందిన తూం రవీందర్ వాపోయారు.

అధికారి ఏమంటున్నారంటే?: గతంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాం. పెద్ద బావుల పూడ్చివేతకు రూ. లక్షల వ్యయం అవుతుంది. నిధులు మంజూరైన వెంటనే పూడ్చివేయిస్తామని తుంగతుర్తి ఎంపీడీవో శేషుకుమార్ చెప్పారు.

# 'రాళ్ల' మాటున.. కాసుల వేట



నల్గొండ: అధికారంలో ఉన్నప్పుడే 'నాలుగు రాళ్లు' వెనకేసుకోవాలన్న దురాశతో.. ప్రజాప్రతినిధులే స్వయంగా రంగంలోకి దిగి యమ'కంకరు'లుగా మారుతున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లావ్యాప్తంగా గుట్టలను కొల్లగొట్టి క్రషర్ యంత్రాలను వినియోగించి రాత్రికి రాత్రే కంకర తయారు చేసి భారీ వాహనాల్లో అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. ఓ చోట అనుమతులు తీసుకుని మరోచోట దందా చేస్తూ ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నారు. ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేపట్టి ప్రభావిత గ్రామాల ప్రజలకు నిద్ర కరవు చేస్తున్నారు. జిలెటిన్ స్టిక్స్, నిషేధిత పేలుడు పదార్థాలు ఉపయోగించి గుట్టలను పిండి చేసి పర్యావరణానికి, పంటలకు కీడు చేస్తున్న 'రాళ్ల'దొంగలను రాజకీయ జెండాలు అడ్డుకుంటున్నాయి. గ్రామాల్లో కిలోమీటర్ల కొద్ది రహదారులు నిర్మిస్తామని టన్నుల కొద్దీ కంకరను ఎలాంటి లెక్కాపద్దులు లేకుండానే బహిరంగ లూటీ చేస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**ఎక్కడెక్కడంటే..!**

యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల్లో ముఖ్య రాజకీయ నేతకు సంబంధించిన గుట్టలను తొలచి కంకర తయారు చేస్తున్నారు. ఈ క్రషర్ సంస్థలకు ఎలాంటి అనుమతులు లేవు. రాజాపేట మండలంలో ఓ బినామీ వ్యాపారి పేరిట స్థానిక ముఖ్య ప్రజాప్రతినిధి డబ్బులు వెనకేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి.

నల్గొండ జిల్లాలో నాగార్జునసాగర్‌కు చెందిన సీనియర్ ప్రజాప్రతినిధికి చెందిన గుత్తేదారు సంస్థ కనగల్, తిప్పర్తి, నాంపల్లి మండలాల్లో కి.మీ. మేర తారు రహదారులు నిర్మిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా కంకర తవ్వకాలు జరుగుతున్న క్వారీల వద్ద గుత్తేదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

సూర్యాపేట జిల్లా కేంద్రంతో పాటు తుంగతుర్తి, గరిడేపల్లి, కోదాడ, హుజూర్‌నగర్ ప్రాంతాల్లోనూ జోరుగా స్థానిక ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే కంకర రాళ్ల అక్రమ తరలింపు యథేచ్ఛగా సాగుతుందనే ఫిర్యాదులు వ్యక్తమవుతున్నాయి.

రహదారుల నిర్మాణానికి కంకర తవ్వకాల అనుమతులు తీసుకున్నా.. రవాణా విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. కంకర లారీపై పట్టా కప్పాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు. వెనుక వచ్చే వాహనదారులపై దుమ్ము, ధూళి పడి శ్వాసకోశ వ్యాధులకు గురికావాల్సి వస్తుందని వాహనచోదకులు చెబుతున్నారు.

జిల్లా గనులు, భూగర్భవనరుల శాఖ అధికారులు కూడా క్షేత్రస్థాయిలో గుత్తేదారులు ఏం చేస్తున్నారు, ఎంత మొత్తంలో కంకర నిల్వలు తీసుకెళుతున్నారనే విషయాలను వదిలేస్తున్నారు. దీనిపై జిల్లా గనులశాఖాధికారి జాకబ్ శ్యామూల్‌ను వివరణ కోరగా.. అక్రమ కంకర రవాణాపై ఫిర్యాదు చేస్తే క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# చర్చ జరగాలి.. కదలిక రావాలి..!

కొత్తగూడెం : కేంద్ర పర్యావరణశాఖ లేవనెత్తిన అభ్యంతరాల కారణంగా రెండున్నరేళ్లుగా నిలిచిపోయిన సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణ అంశం మరోసారి తెరపైకి రానుంది. (ఈనెల 29) నుంచి శాసనసభ సమావేశాలు నిర్వహించి కృష్ణా, గోదావరి జలాలతో పాటు వాటిపై చేపట్టిన ప్రాజెక్టులు, నీటి కేటాయింపులు, వెచ్చించిన ఖర్చులు తదితరాలపై సమగ్రంగా చర్చించాలని సీఎం రేవంత్‌రెడ్డి యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈనేపథ్యంలో గత ప్రభుత్వ హయాంలో అశ్వాపురం మండలంలో గోదావరి నదిపై చేపట్టిన సీతమ్మసాగర్ నిర్మాణ అంశాన్ని చర్చించాలని ఖమ్మం, భద్రాద్రి జిల్లాల వాసులు ఆశిస్తున్నారు. సీతమ్మసాగర్‌తో పాటు సీతారామ ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేయాలని కోరుతున్నారు.

**రూ. 19,954 కోట్లు.. 36.57 టీఎంసీలు**

భద్రాద్రి, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లోని 6.74లక్షల ఎకరాలకు సాగునీరు, 282.80 మెగావాట్ల జలవిద్యుదుత్పత్తే లక్ష్యంగా బహుళార్థ సాధక ప్రాజెక్టుగా సీతమ్మసాగర్ ప్రాజెక్టును గత ప్రభుత్వం చేపట్టింది. రూ. 19,954కోట్ల అంచనా వ్యయంతో 36.57 టీఎంసీల నిల్వ సామర్థ్యం, 67 టీఎంసీలు ఎత్తిపోసేందుకు అశ్వాపురం-దుమ్ముగూడెం మధ్య గోదావరిపై బ్యారేజీ నిర్మాణానికి పూనుకుంది. ప్రాజెక్టు పనులు 2023 మే 29నాటికి 56.80% పూర్తవగా.. రూ. 11,361కోట్లు (56.94శాతం) ఖర్చయ్యాయి. జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్జీటీ) ఉత్తర్వుల నేపథ్యంలో రెండున్నరేళ్లుగా పనులు నిలిచిపోయాయి.

**సీతమ్మసాగర్ పూర్తయితేనే..**

సీతమ్మసాగర్ బ్యారేజీని అధారంగా చేసుకుని మూడు జిల్లాలకు సాగునీరందించేందుకు సీతారామ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా మూడు పంప్‌హౌస్‌లు, 104కి.మీ. ప్రధాన కాల్వ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఖమ్మం జిల్లాలోని సాగర్ చివరి ఆయకట్టుకు గోదావరి జలాలు తరలించేందుకు రాజీవ్ లింక్ కెనాల్‌ను నిర్మించారు. భద్రాద్రి జిల్లాలో డిస్ట్రిబ్యూటరీల నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. సీతారామ ప్రాజెక్టు లక్ష్యం నెరవేరాలంట్టే గోదావరిలో నీరు నిల్వ ఉండాలి. అంతకంటే ముందు సీతమ్మసాగర్ పనులు పూర్తిచేసి 36.57 టీఎంసీల నీటిని నిల్వచేస్తేనే.. సీతారామ ప్రధాన కాల్వ ద్వారా 9వేల క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసేందుకు వీలుంటుంది.

**ఈఐఏ విచారణ పూర్తయితేనే..** ముందస్తు పర్యావరణ అనుమతులు లేకుండా చేపట్టిన ప్రాజెక్టులపై గతంలో సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును రీకాల్ చేస్తూ త్రిసభ్య ధర్మాసనం ఇటీవల తీర్పు వెలువరించింది. అపరాధ రుసుము చెల్లించి, పర్యావరణ అనుమతులు తీసుకుని ప్రాజెక్టులు నిర్మించవచ్చునని సూచించింది. ఈతీర్పు ఆధారంగా తెలంగాణ ప్రభుత్వం సీతమ్మసాగర్ నిర్మాణ పనులు చేపట్టేందుకు పర్యావరణ ప్రభావం అంచనా(ఈఐఏ)కు వివరాలు సమర్పించింది. దీనిపై ఈఐఏ విచారణ జరిపి పర్యావరణ అనుమతులు(ఈసీ) ఇవ్వాల్సి ఉంటుంది. అనుమతులు రాగానే ఎన్జీటీ విధించిన రూ. 54కోట్లు చెల్లించి పనులు ప్రారంభించుకోవచ్చు. 'మార్చి నాటికి ఈఐఏ విచారణ ముగిసి పర్యావరణ అనుమతులు వచ్చే అవకాశాలున్నాయి. ఆ తరువాత సీతమ్మసాగర్ పనులు పునఃప్రారంభమవుతాయి' అని భద్రాద్రి కొత్తగూడెం నీటిపారుదలశాఖ ఈఈ శ్రీనివాసరెడ్డి కు తెలిపారు.

# అడ్డంకులను అధిగమిస్తూ.. రోడ్లను విస్తరిస్తూ..!

ఖమ్మం : దినదినాభివృద్ధి చెందుతున్న ఖమ్మం నగరంలో ప్రధాన రహదారులు ప్రస్తుత వాహనాల రద్దీకి అనుగుణంగా లేవు. మురుగుకాల్వలను ఆక్రమించి మెట్లు, దుకాణాల షెడ్లు నిర్మిస్తుండటంతో రోడ్లూ కుచించుకుపోయాయి. వీటిని బృహత్ ప్రణాళిక(మాస్టర్ ప్లాన్)కు అనుగుణంగా విస్తరిస్తే ట్రాఫిక్ సమస్యను తగ్గించవచ్చని నగరపాలక సంస్థ భావిస్తోంది.

**అవగాహన కల్పిస్తూ.. భరోసా ఇస్తూ**

జిల్లాకేంద్రంలో బైపాస్, వైరా రోడ్లు మాత్రమే పూర్తిస్థాయిలో విస్తరణకు నోచుకున్నాయి. మిగిలినవి చాలాచోట్ల 30-40 అడుగుల్లోపే ఉన్నాయి. బృహత్ ప్రణాళిక ప్రకారం ప్రధాన రహదారులను కనీసం 60 అడుగులకు విస్తరించాలని కేఎంసీ ప్రణాళిక విభాగం అధికారులు నిర్ణయించారు. తొలిదశలో చెరువుబజార్, రిక్కాబజార్, రైల్వేస్టేషన్ రోడ్లలో మార్కింగ్ చేసి ఇళ్ల యజమానులకు నోటీసులిచ్చారు. సొంతంగా ఆక్రమణలను తొలగించుకోవాలని సూచించారు. మరికొన్నిచోట్ల యజమానుల అంగీకారంతో అడ్డుగా ఉన్న ప్రహరీలు, ఇళ్ల స్లాబ్‌లను



నిర్దేశిత దూరం వరకు తొలగించి రహదారిని విస్తరించారు. విస్తరణ పనులతో నష్టపోతున్నామని పలువురు వినతిపత్రాలు అందజేశారు. పూర్తిగా ఇళ్లు కోల్పోయే వారికి పరిహారంగా పునరావాస కల్పన లేదా ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్(టీడీఆర్) ఇవ్వటంపై అధికారులు అవగాహన కల్పిస్తూ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. ఇప్పటికే చెరువుబజార్, పీఎస్ఆర్ రోడ్డులో సుమారు 20మందికి టీడీఆర్ ఇచ్చినట్లు సమాచారం.

రైల్వేస్టేషన్ రోడ్డులో ఒకవైపు విస్తరణ పనులు పూర్తవగా.. మరోవైపు ఆక్రమణలను తొలగిస్తున్నారు. ముగ్గురు యజమానుల ఇళ్ల తొలగింపు పనులు మొదలుకాలేదు. ఒకరు సొంతంగా తొలగించుకుంటామని హామీ ఇవ్వగా, ఇద్దరికి సంబంధించి న్యాయస్థానంలో కేసు పెండింగ్ ఉన్నట్లు తెలిసింది.

పీఎస్ఆర్ రోడ్డు విస్తరణలో జాప్యం విమర్శలకు తావిచ్చింది. తొలగింపు పనులు చేపట్టకుండా ఇద్దరు వ్యక్తులు ప్రయత్నించటంతో అధికారులు ఆయా ఇళ్లపత్రాలు పరిశీలించి నోటీసులు జారీ చేశారు. జిల్లా రవాణాశాఖ కార్యాలయం రహదారికి రెండోవైపు స్వల్పంగా కూల్చివేతలు ప్రారంభించారు. ఇక్కడ తొలగించిన ప్రహరీని పునర్నిర్మించనున్నారు. వ్యవసాయ మార్కెట్ నుంచి శ్రీనివాసనగర్ వరకు..

మిరప మార్కెట్‌ను ఆధునికీకరిస్తుండటంతో భవిష్యత్తులో కొనుగోళ్లు పెరిగితే వాహనాల తాకిడి అధికంగా ఉండనుంది. వ్యవసాయ మార్కెట్, సుందరయ్యనగర్ నుంచి ప్రకాశ్‌నగర్ వరకు రోడ్డును ప్రణాళిక విభాగం అధికారులు అభివృద్ధిపరచనున్నారు. వ్యవసాయ మార్కెట్‌కు అనుసంధానంగా ప్రకాశ్‌నగర్ నుంచి శ్రీనివాసనగర్ వరకు రోడ్డును అభివృద్ధిపరచటానికి రెండువైపులా మార్కింగ్ చేశారు. రాళ్లను తొలగించి బాట వేశారు. అధికారులు చదును చేసిన రహదారిపై కొంతమంది రాళ్లు పాతి కంచె వేయటం అనుమానాలకు తావిస్తోంది. 'రహదారిపై వేసిన కంచెను తొలగిస్తాం. ఇళ్ల యజమానులను ఒప్పించి రహదారుల విస్తరణకు చర్యలు తీసుకుంటున్నాం' అని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య కు తెలిపారు.


# డ్రైవింగ్ పరీక్ష నామమాత్రమే

కామారెడ్డి : రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్యను తగ్గించడానికి జిల్లా పోలీసుశాఖ తీవ్ర కసరత్తు చేస్తోంది. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేస్తూ రహదారి నిబంధనలు ఉల్లంఘిస్తున్న చోదకులకు జరిమానాలు విధిస్తోంది. చోదకులకు డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు చేసే కామారెడ్డి రవాణా శాఖ కార్యాలయంలో నిబంధనలు పట్టించుకోకపోవడం విస్తుగొలుపుతోంది.

**సిబ్బందే రాశారు**

డ్రైవింగ్ లైసెన్స్ రావాలంటే తొలుత లెర్నింగ్ లైసెన్స్ పరీక్ష రాయాలి. ఈ పరీక్ష కోసం మంగళవారం కామారెడ్డి ఆర్టీఏ కార్యాలయానికి దరఖాస్తుదారులు వచ్చారు. కాగా ఈ పరీక్షను కార్యాలయ సిబ్బందే స్వయంగా రాస్తున్న ఉదంతం పరిశీలనలో బయటపడింది. దరఖాస్తుదారుల్ని పక్కనే కూర్చోబెట్టుకొని వారికి బదులుగా అధికారులే రాయడం విస్తుగొలుపుతోంది. మరికొందరు దరఖాస్తుదారులు లేకున్నా సిబ్బందే రాయడం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది. ఇదేంటని సదరు సిబ్బందిని ప్రశ్నించగా.. దరఖాస్తుదారుడు మరుగుదొడ్డికి వెళ్లాడని.. అందుకే రాస్తున్నానని చెప్పడం గమనార్హం. దీనిపై ఇన్‌ఛార్జి డీటీవో శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. ఆయన సమాధానం చెప్పడానికి నిరాకరించారు.

**ఏజెంట్‌ల ద్వారానే..**



లైసెన్స్‌ల కోసం వచ్చిన 9 మంది యువకులతో మాట్లాడగా.. అందులో ఏడుగురు ఏజెంట్‌ల ద్వారా వచ్చినవాళ్లే. వారిలో కొందరికి లెర్నింగ్ పరీక్ష ఉంటుందనీ తెలియకపోవడం గమనార్హం. డిజిటల్ సంతకం చేసి, రవాణా శాఖ సిబ్బంది వెంట కూర్చుంటే మొత్తం వారే చూసుకున్నారని తెలిపారు. ఏజెంట్‌కు రూ. 4,200 ఇస్తే ద్విచక్రవాహనం, కారుకు లైసెన్స్‌లు ఇప్పిస్తున్నారని అన్నారు. డ్రైవింగ్ పరీక్షా అంతంత మాత్రంగానే ఉంది. కారు రివర్స్ తోలకుండానే లైసెన్స్‌లు ఇస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే.. డ్రైవింగ్ ట్రాక్ సరిగా లేదని చెబుతున్నారు.

**మీ సేవలో అవకాశమున్నా..** డ్రైవింగ్ లైసెన్స్ కోసం దరఖాస్తుదారులు మీ సేవలో దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉంది. ఆన్‌లైన్‌లోనూ చేయొచ్చు. కానీ చాలా మంది ఏజెంట్లనే ఆశ్రయిస్తున్నారు. ఆర్టీఏ కార్యకలాపాలన్నీ ఆన్‌లైన్ ద్వారా పారదర్శకంగా జరుగుతున్నాయని అధికారులు చెబుతున్నా.. ఏజెంట్ల వ్యాపారం జోరుగా సాగుతోంది. చాలా పనులకు ఏజెంట్ల ద్వారా వెళ్తే తప్ప పనులు జరగడం లేదని కార్యాలయానికి వచ్చిన వారు వాపోతున్నారు.

## అత్యవసర వేళ ఆపసోపాలు..!

విశాఖపట్నం : గమ్యనగరిగా పేరుగాంచిన విశాఖకు ఇటీవల పర్యాటకుల తాకిడి పెరిగింది. ఆర్కేబీచ్, కైలాసగిరి, వుడా పార్కు, రుషికొండ వంటి ప్రాంతాలు ప్రస్తుతం సందర్శకులతో కిటకిటలాడుతున్నాయి. అయితే అందుకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించడంలో వీఎంఆర్డీఏ యంత్రాంగం విఫలమవుతోందనే విమర్శలు వస్తున్నాయి. ఆదివారం నగరంలోని పలు ప్రాంతాలను 'ఈనాడు' పరిశీలించగా పర్యాటకులు పడుతున్న ఇబ్బందులు వెలుగులోకి వచ్చాయి. ముఖ్యంగా మరుగుదొడ్లు అందుబాటులో లేక, ఎక్కడికి వెళ్లాలో తెలియక మహిళలు అవస్థలు పడటం కనిపించింది.

**రుషికొండలో కేవలం రెండు మరుగుదొడ్లు:** బ్లూఫ్లాగ్ గుర్తింపు పొందిన రుషికొండ బీచ్‌ను నిత్యం 10వేల మందికిపైగా సందర్శిస్తుంటారు. ఇలాంటి ప్రాంతంలో కేవలం రెండు మరుగుదొడ్లు మాత్రమే ఉండటం గమనార్హం. దీంతో పర్యాటకులు ఆరుబయటకు వెళ్లాల్సి వస్తోంది. జీవీఎంసీ నిధులు రూ.55 లక్షలతో 22 మరుగుదొడ్ల నిర్మాణానికి జులైలో శంకుస్థాపన చేశారు. ఆయా పనులు నత్తనడకన సాగుతున్నాయి. సాగర్‌నగర్ బీచ్‌లో గతంలో ఉన్న కంటైనర్ మరుగుదొడ్లను తొలగించేశారు. బీచ్ రోడ్డులో వుడా పార్కు నుంచి కోస్టల్‌బ్యాటరీ వరకు నాలుగు చోట్ల జీవీఎంసీ ఆధ్వర్యంలో నడిచే ప్రజామరుగుదొడ్లు ఉన్నాయి. కోస్టల్‌బ్యాటరీ నుంచి ఆర్కే బీచ్ వరకు ప్రస్తుతం ఒకటి ఉండగా మరో రెండు ఏర్పాటు చేయాల్సి ఉంది. వుడా పార్కు నుంచి కోస్టల్‌బ్యాటరీ మధ్య ప్రస్తుతం నాలుగు ఉండగా, వాటిని రెట్టింపు చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



**ఇతర ప్రాంతాల్లో ఇలా..:** వీఎంఆర్డీఏ ఆధ్వర్యంలో కురుసురా జలంతర్గామి, టీయూ-142, సీహారియర్ యుద్ధ విమానం, యూహెచ్-3హెచ్ హెలికాప్టర్ మ్యూజియం ఉన్నాయి. వీటి నుంచి ఏటా రూ.5 కోట్ల వరకు ఆదాయం వస్తోంది. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేకంగా మరుగుదొడ్లు లేకపోవడం గమనార్హం.

ఆర్కేబీచ్ కాళీమాత ఆలయం సమీపంలోని మరుగుదొడ్లు నిత్యం రద్దీగా ఉంటున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని అదనంగా రెండు యూనిట్లు ఏర్పాటు చేయాలి.

దీనిపై వీఎంఆర్డీఏ కార్యదర్శి మురళీకృష్ణను సంప్రదించగా పర్యాటక ప్రాంతాలను పరిశీలించి అవసరమైన చోట అదనపు మరుగుదొడ్లు ఏర్పాటు చేయిస్తామని చెప్పారు.


ప్రజా మరుగుదొడ్లు ఉన్న ప్రాంతాలు..కోస్టల్‌బ్యాటరీ: 2 తెన్నేటి పార్క్: 1 ఆర్కే బీచ్: 2 పాండురంగా పురం: 1 వైఎంసీఏ: 1 రుషికొండ కూడలి: 1 జోడుగుళ్ల పాలెం: 1

## అడ్డురోడ్డుకు మహర్దశ!

అనకాపల్లి : నక్కపల్లి కేంద్రంగా ఏర్పాటు చేయాల్సిన కొత్త రెవెన్యూ డివిజన్‌ను ప్రభుత్వం మార్చింది. ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు కూడలిలో దీనిని ఏర్పాటు చేయడానికి నిర్ణయించింది. మంత్రులు, అధికారులతో సీఎం చంద్రబాబునాయుడు అమరావతిలో ఇటీవల నిర్వహించిన మంత్రివర్గ ఉపసంఘం సమీక్షలో రెవెన్యూ డివిజన్ మార్పుపై నిర్ణయం తీసుకున్నారు. దీంతో నక్కపల్లికి బదులు అడ్డురోడ్డు కేంద్రంగా డివిజన్ ఏర్పాటు కానుంది.

పారిశ్రామికాభివృద్ధి పరంగా శరవేగంగా అడుగులు వేస్తున్న నక్కపల్లిలో రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు మంత్రి అనిత చొరవ చూపారు. ఇందుకు మంత్రివర్గ ఉపసంఘంలోనూ ఆమోదం లభించింది. ప్రాథమిక నోటిఫికేషన్ తర్వాత.. రాష్ట్రవ్యాప్తంగా నూతన జిల్లాలు, డివిజన్ల ఏర్పాటుపై అభ్యంతరాలను స్వీకరించింది. ఈ క్రమంలో నక్కపల్లి డివిజన్‌ను తప్పించి.. ఎలమంచిలి కేంద్రంగా నూతన రెవెన్యూ డివిజన్‌ను ఏర్పాటు చేయాలంటూ ప్రతిపక్ష నేతలు, కార్యకర్తలు నిరసనలు తెలిపారు. స్థానిక కూటమి నేతలు సైతం ఎలమంచిలి కేంద్రంగా డివిజన్ ఏర్పాటు చేయాలంటూ ప్రతిపాదించడంతో దీంతో ఇక్కడి ప్రజల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని నక్కపల్లికి బదులుగా దీనికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న అడ్డురోడ్డు జంక్షన్‌ను డివిజన్ కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు సీఎం సుముఖత వ్యక్తం చేశారు. తద్వారా ఆయా ప్రాంతాల వారికి మరింత అందుబాటులో ఉంటుందని ఆలోచన.

**మునగపాక అనకాపల్లిలోనే:** జిల్లా కేంద్రానికి అతి దగ్గరగా ఉన్న మునగపాక మండలాన్ని అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లోనే ఉంచాలని



స్థానిక నేతలు, ప్రజలు విన్నవించారు. ఇటీవల జిల్లా డీఆర్సీ సమావేశంలోనూ అనకాపల్లిలోనే మునగపాక మండలాన్ని కొనసాగించాలని తీర్మానించారు. మరోవైపు చీడికాడ మండలాన్ని నర్సీపట్నం నుంచి అనకాపల్లి డివిజన్‌లో కలిపేలా మారుస్తున్నారు. దీంతో అనకాపల్లిలో 10, నర్సీపట్నం, అడ్డురోడ్డు రెవెన్యూ డివిజన్లలో ఏడేసి మండలాల చొప్పున కొనసాగనున్నాయి. పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్.రాయవరం, కోటవురట్ల, ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాలతో అడ్డురోడ్డు కేంద్రంగా కొత్త డివిజన్ ఏర్పాటు కానుంది. ఈ నెలాఖరున ప్రభుత్వ తుది నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉంది.

**అభివృద్ధిలో వేగంగా ..** తుని, పాయకరావుపేట తర్వాత అడ్డురోడ్డు వాణిజ్యపరంగా వేగంగా అభివృద్ధి చెందుతోంది. పేరుకే తిమ్మాపురం పంచాయతీలో ఉన్నా.. అందరికీ అడ్డురోడ్డు పేరే సుపరిచితం. ఇక్కడ అనేక విద్యా సంస్థలు, ఆసుపత్రులు, వస్త్ర, ఇతర వాణిజ్య సముదాయాలు, అపార్ట్‌మెంట్లు, స్థిరాస్తి వ్యాపారం.. ఇలా అన్నివిధాలా అభివృద్ధి చెందుతోంది. దీనికి తోడు పర్యాటక ప్రాంతమైన రేవుపోలవరం తీరం కూడా ఇదే మండలంలో ఉంది. మరోవైపు ఆది నుంచి నక్కపల్లి పేరును తెరపైకి తెచ్చి చివరిలో అడ్డురోడ్డు డివిజన్ ఏర్పాటు చేయడంపై స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

# వద్దన్నా.. 'బరి'తెగింపే!



అనకాపల్లి : ఒకప్పుడు గోదావరి జిల్లాలకు పరిమితమైన కోడిపందేలు ఇప్పుడు జిల్లాలోనూ ఏర్పాటు చేస్తున్నారు. గతేడాది జిల్లాలో అక్కడక్కడ నిర్వహించగా.. ఈసారి పెద్దసంఖ్యలో బరులు ఏర్పాటు చేస్తున్నారు. సంప్రదాయం ముసుగులో కోడి పందేలు నిర్వహించడం నేరమని, నిబంధలకు విరుద్ధంగా ఎక్కడైనా నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతోపాలు పందేలు నిర్వహిస్తే కేసులు పెడతామని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. ఇటీవల బుచ్చెయ్యపేట మండలం బంగారయ్యపేటలో సన్నాహక కోడిపందేలపై పోలీసులు దాడి చేసి పందెంరాయుళ్లను, కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. జూద శిబిరంపై దాడి నలుగురిని అరెస్టు చేసి రూ. 72 వేలు స్వాధీనం చేసుకున్నారు. అయినా.. పందెంరాయుళ్లు నేతల అండదండలతో జిల్లాలో బరులు సిద్ధం చేస్తున్నారు. దీంతోపాటు గుండాట, పిక్కాటకు ప్రత్యేక స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. పాస్‌లు, స్టాళ్లకు వేలం సైతం నిర్వహించారు. పందెం శిబిరాల ఆవరణలో గొలుసు దుకాణాల నిర్వహణకు రోజుకు రూ. 7 వేల నుంచి రూ. 10 వేల వరకు ధర నిర్ణయించినట్లు సమాచారం.

**ఎక్కడెక్కడంటే..**

పాయకరావుపేట మండలంలోని శ్రీరాంపురం, వెంకట నగరం, సత్యవరం, పాల్మన్‌పేట, కుమారపురం, నామవరం, పి.ఎల్.పురంలో బరులు సిద్ధం చేస్తున్నారు. నక్కపల్లి మండలం వేంపాడులో భారీ స్థాయిలో ఫ్లడ్‌లైట్లు, స్టేజీలు, ఎల్ఈడీ దీపాలు, షామియానాతో ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు, రాయవరం, లింగరాజుపాలెం, కోటవురట్ల, వెంకటాపురంలో పోటీలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అచ్యుతాపురం మండలం చోడపల్లి, రాంబిల్లి మండలం వెంకటాపురంలో అన్ని హంగులతో బరులను తీర్చిదిద్దుతున్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు సహించం... సంక్రాంతి ముసుగులో కోడిపందేలు, జూదం నిర్వహించరాదు. ఇప్పటికే అన్ని పోలీస్ స్టేషన్ల ద్వారా హెచ్చరికలు పంపాం. మారుమూల ప్రాంతాలు, పొలాలపై నిరంతరం డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా పెడతాం. తనిఖీలకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశాం. పట్టుబడితే కఠిన చర్యలు తప్పవు.

– తుహిన్‌సిన్హా, ఎస్పీ, అనకాపల్లి

# సేంద్రియ పంట.. తింటే వదలరంట



సింహాచలం : సింహాచలం కొండకు జల పర్వతంగా పేరు. ఈ కొండపై పండే ఏ పంటైనా అద్భుతంగా ఉంటుందని భక్తులు చెబుతుంటారు. సింహాచలం సంపెంగలకు చారిత్రక నేపథ్యం సైతం ఉంది. ఈ క్రమంలో గతంలో సుమారు వంద ఎకరాల్లో కృష్ణాపురంలోని సింహాచలం దేవస్థానానికి చెందిన స్థలాన్ని అభివృద్ధి చేసి నృసింహవనంగా పేరు పెట్టారు. అతిపెద్ద గోశాలను ఏర్పాటు చేసి 250 పైగా మేలుజాతి గోవులను సంరక్షిస్తున్నారు. కొవిడ్ అనంతరం ముడసర్లోవ సమీపంలోని సుమారు 25 ఎకరాల దేవస్థానం స్థలాన్ని అభివృద్ధి చేశారు. ఇక్కడ పశువులకు గ్రాసం, సేంద్రియ వ్యవసాయం ద్వారా కూరగాయలు పండిస్తున్నారు.

కొండవాలును సారవంతం చేసి..: సింహాచలం కొండవాలు ప్రాంతాల్లోని భూమి పోడు వ్యవసాయానికి మాత్రమే పనికొస్తుంది. ఎక్కువగా రాళ్లు, బండలు ఉండే ఈ ప్రాంతాన్ని అధికారులు సారవంతంగా మార్చారు. ఇక్కడ పంటలకు వీలుగా మూడు చోట్ల బోర్లు వేసి నీటి కొరత లేకుండా చేశారు.

సుమారు 20 ఎకరాల్లో గోశాలలోని పశువులకు అవసరమయ్యే పచ్చగడ్డిని పెంచుతున్నారు. దీనికి వాటర్ గన్ విధానం ద్వారా నీటిని అందిస్తూ పోదుపు పాటిస్తున్నారు. మరో అయిదు ఎకరాల్లో పదమూడు రకాల కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. దీని కోసం బిందు సేద్యం విధానాన్ని అమలు చేస్తున్నారు. గోశాలలోని పశువుల వ్యర్థాలతో ఎరువులు తయారు సేంద్రియ విధానంలో పంటలు పండిస్తున్నారు.

**9 నెలల్లో.. 32 వేల కిలోలు..:** కొత్తగా అభివృద్ధి చేసిన నృసింహవనంలో గత ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు తొమ్మిది నెలల్లో 32,479 కిలోల కూరగాయలను పండించారు. దీంతో పాటు 3,700 అరటి గెలలను సరఫరా చేశారు. ఇక్కడ పండించిన కూరగాయలు, ఆకుకూరలను అప్పన్న స్వామి అన్నప్రసాద తయారీలో వినియోగిస్తున్నారు. భక్తులకు సేంద్రియ కూరగాయలతో వండి వడ్డిస్తున్నారు. దేవస్థానానికి చెందిన విద్యార్థుల వసతి గృహాలకు కూడా వీటినే సరఫరా చేస్తున్నారు. ఈ వనంలో డాక్టర్ పీవీజీ రాజు (రాజా సాహెబ్) వ్యవసాయ క్షేత్రం పేరిట సింహాచలానికి ప్రత్యేకమైన సంపెంగ, పనస తోటల పెంపకానికి శ్రీకారం చుట్టారు. ఇటీవల పాత నృసింహవనంతో పాటు ఇక్కడ కూడా ఆయా మొక్కలను నాటించారు. గూగుల్ డేటా సెంటర్‌కు ప్రతిపాదించిన భూమిని ఆనుకుని ఉన్న ఈ వనం ఎంతగానో ఆకట్టుకుంటోంది.


# తిప్పలకు 'ఎర్ర'వేశారు

నంద్యాల : గతేడాది భారీ వర్షాలు కురిశాయి. చెరువులన్నీ నిండాయి. వాగులు, నదుల్లో పెద్దఎత్తున నీరు చేరడంతో మట్టి తవ్వకాలకు ఆటంకం ఏర్పడింది. ప్రస్తుతం ప్రవాహం ఆగిపోవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. మట్టి, ఇసుకను తవ్వి సొమ్ము చేసుకున్నారు. గత ఆరు నెలలుగా నెమ్మదించిన తవ్వకాలు మళ్లీ ఊపందుకున్నాయి. ప్రత్యేకించి ఇటుక బట్టీలు, లేఅవుట్లు, స్థలాల చదునుకు ఉపయోగపడే ఎర్రమట్టికి గిరాకీ ఎక్కువగా ఉండడంతో వాటిపై కన్నేశారు. యథేచ్ఛగా తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు చోద్యం చూస్తున్నారు. రాళ్లు, గులకలు, మట్టితో కలిసి ఉండే మొరం కోసం నంద్యాల, ఆళ్లగడ్డ ప్రాంతాల్లోని స్థిరాస్తి వ్యాపారులు అక్రమార్కులను సంప్రదిస్తున్నారు. నంద్యాల పట్టణంలోని కుందూ ఒడ్డు, గాజులపల్లి, గోపవరం తదితర ప్రాంతాల్లోని చెరువులను తవ్వేస్తున్నారు. టిప్పరు ఎర్రమట్టి రూ.10 వేలు, ట్రాక్టరు లోడు రూ.4 వేల వరకు విక్రయిస్తున్నారు. యంత్రాలతో తవ్విన మొరుసును నేరుగా వెంచర్ల వద్దకు తరలిస్తున్నారు. విచ్చలవిడిగా తవ్వకాలు జరుగుతున్నా రెవెన్యూ, గనులు, పోలీసు శాఖ అధికారులు చోద్యం చూస్తుండటం గమనార్హం.

**అనుమతులు లేకనే..**

రుద్రవరం మండలం టి.లింగందిన్నె, తువ్వపల్లి, ఆలమూరు ఎర్రమట్టి తిప్పల్లో తవ్వకాలు సాగుతున్నాయి. వీటికి ఎలాంటి అనుమతులు లేవు. తవ్విన మట్టిని ఇటుక బట్టీలతోపాటు స్థిరాస్తి వెంచర్లకు తరలిస్తున్నారు. మరికొంత మట్టిని గుంతలు పూడ్చేందుకు వినియోగిస్తున్నారు.

మహానంది మండలం అంకిరెడ్డిపల్లె చెరువులో పెద్దఎత్తున మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. ఫలితంగా చెరువు రూపు కోల్పోయింది. శిఖం భూమి.. పెద్దపెద్ద గుంతలతో లోయలను తలపిస్తోంది. చెరువు ఆనుకుని నంద్యాల-ఒంగోలు రహదారి పక్కన భారీగా తవ్వకాలు చేపట్టడంతో కట్టకు ముప్పు పొంచి ఉంది.



మహానంది, రుద్రవరం మండలాల్లో లభ్యమయ్యే ఎర్రమట్టికి మంచి ఆదరణ ఉంది. కుండల తయారీతోపాటు పంట పొలాలు, ఉద్యానవన పంటలకు ఉపయోగిస్తారు. ఫలితంగా ఈ మట్టిపై అక్రమార్కుల కన్ను పడింది. శిరివెళ్ల మండలం మహదేవపురం గ్రామంలో పంట పొలాలకు ఉపయోగపడే రహదారిని సైతం యంత్రాలతో ఇష్టానుసారంగా తవ్వేయడం గమనార్హం.

**జనం అడ్డుకుంటున్నా..**

శిరివెళ్ల మండలం మహదేవపురం బంజరు భూములు, చెరువుల్లో ఎర్రమట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. పోలేరమ్మ, సర్వ నరసింహస్వామి ఆలయానికి వెళ్లే ప్రాంతాల్లోనూ తవ్వేస్తున్నారు. టిప్పర్లు, ట్రాక్టర్లలో మట్టిని నింపి నంద్యాల పట్టణ శివారులోని అయ్యలూరుమెట్ట, పెద్ద కొట్టాల, పొన్నాపురం ప్రాంతాల్లోని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. వాహనాలు అతివేగంగా వెళుతుండటం.. పరిమితికి మించి మట్టిని తరలిస్తుండటంతో ఆయా ప్రాంత ప్రజలు పలుమార్లు అడ్డుకున్నారు.

నంద్యాల-గిద్దలూరు ప్రధాన రహదారిలోని గాజులపల్లె మెట్టపై ఎర్రమట్టిని తరలిస్తున్న టిప్పర్లను ప్రజలు అర్ధరాత్రి వేళ అడ్డుకోవడం చూస్తుంటే పరిస్థితి తీవ్రతను చెప్పకనే చెబుతోంది.

## కార్మికులకు కార్డు.. భద్రతకు రివార్డు!

తిరుపతి : అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందడగు వేస్తున్నాయి. ఈ - శ్రమ్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. కార్మికుల గుర్తింపునకు పోర్టల్‌లో నమోదుకు అవకాశం కల్పిస్తోంది. ఈ కార్డుతో అనేక ప్రయోజనాలు ఉన్నా.. చాలామంది నమోదు చేసుకోలేదు.

**అర్హులు ఎవరు:**

18- 59 ఏళ్లలోపు వారు అర్హులు. ఈ- శ్రమ్ కార్డులతో అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత లభిస్తుంది.

ఇప్పటివరకు కొన్ని పథకాలు కుటుంబంలో ఒక్కరికే వర్తించేవి. ఫలితంగా కుటుంబంలో ఒకరిద్దరు కార్మికులుంటే నష్టపోయే పరిస్థితి. ఈ - శ్రమ్‌తో ప్రతి అసంఘటిత కార్మికుడికి సామాజిక భద్రతతోపాటు వివిధ పథకాలు అందుతాయి.

దరఖాస్తు ఇలా..: ఈ - శ్రమ్ గుర్తింపు కార్డు కోసం చరవాణిలో సొంతంగా దరఖాస్తు చేసుకోవచ్చు. తిరుపతి, చిత్తూరు కార్మిక శాఖ కార్యాలయాలలో ప్రత్యేకంగా సెంటర్లు ఏర్పాటు చేశారు. సీఎస్ఈ




కేంద్రాల్లోనూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఫొటో గుర్తింపు కార్డుతోపాటు వివరాలు నింపి కార్డులు పొందవచ్చు. ఒకసారి తీసుకుంటే ఐదేళ్లు అమలులో ఉంటుంది. జిల్లా కార్మిక శాఖ అధికారులు అవగాహన సదస్సులు.. ప్రత్యేక శిబిరాల ద్వారా నమోదు ప్రక్రియ చేపట్టారు.

మాన్‌ధనం: పీఎం - శ్రమ యోగి మాన్ ధన్ (ఎస్‌వైఎం) పథకానికి 18 - 40 ఏళ్ల వయస్సున్న కార్మికులు అర్హులు. కార్మికులు వయస్సు ఆధారంగా కొంత నగదు చెల్లిస్తే అందుకు సరిపడా డబ్బును ప్రభుత్వం చెల్లిస్తాయి. 61 ఏళ్లు దాటిన తర్వాత కార్మికులకు పింఛను వర్తిస్తుంది. కనిష్ఠంగా రూ.55.. గరిష్ఠంగా రూ.200 చెల్లించాల్సి ఉంటుంది.

**ఆర్థిక ప్రయోజనం:**

ఈ - శ్రమ్‌తో ప్రతి అసంఘటిత రంగ కార్మికుడికి ఏడాదిపాటు సురక్షా బీమా యోజన ద్వారా రూ.2 లక్షల ప్రమాద మరణ, అంగ వైకల్య బీమా ఉచితంగా వర్తిస్తుంది.

వలస కార్మికులు ఎక్కడ ఉన్నారో గుర్తించి వారికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటారు.

కార్మికుడు ప్రమాదవశాత్తు చనిపోతే చంద్రన్న బీమా సాయం కింద రూ.ఐదు లక్షల సాయం చేస్తారు.

కార్మికురాలు, కార్మికుడి కుమార్తె వివాహానికి రూ.20 వేలను మూడేళ్ల తర్వాత ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో అందిస్తారు.

ఉమ్మడి జిల్లాలో కార్మికులు: 9 లక్షల మంది ఇందులో భవన నిర్మాణ కార్మికులు: 1,45,341 మందిఈ శ్రమ్‌లో నమోదైన కార్మికులు

చిత్తూరు: 4,66,831

తిరుపతి: 78,912

మదనపల్లె: 1,08,117

## తెలుగు అకా'డమ్మీ'

తిరుపతి : రాష్ట్ర విభజన నేపథ్యంలో వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి రాష్ట్రస్థాయి ప్రభుత్వ సంస్థ కేటాయించాలని నిర్ణయించారు. తిరుపతి కేంద్రంగా ఏపీ తెలుగు, సంస్కృత అకాడమీని తిరుపతికి 2020 జూన్ 16న నిర్ణయించి ఉత్తర్వులు జారీ చేశారు. తెలుగు, సంస్కృత భాషల అభివృద్ధి బాధ్యతల్ని తెలుగు అకాడమీకి అప్పగిస్తూ తిరుపతిలో తెలుగు, సంస్కృత అకాడమీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అంతర్గత సమస్యలతో అకాడమీ ఏర్పాటులో జాప్యం చోటు చేసుకోగా.. 2022 జూన్ 1 ఎట్టకేలకు తిరుపతిలోని తుమ్మలగుంట మార్గంలో తితిదే గోశాలకు చెందిన భవనంలో ప్రారంభమైంది. వైకాపా ప్రభుత్వ పాలనలో అకాడమీని విజయవాడ నుంచి తరలింపు ప్రక్రియ కూడా ప్రారంభం కాలేదు. దీంతో తిరుపతిలో అకాడమీ కాగితాలకే పరిమితమైంది.

**ఉద్యోగులు విజయవాడలో..** అకాడమీని అధికారికంగా తిరుపతిలో ఏర్పాటు చేసినప్పటికీ అనధికారికంగా ఇప్పటికీ విజయవాడ నుంచే కార్యకలాపాలు జరుగుతున్నాయి.

**స్థలాన్వేషణతో సరి**

విభజిత ఆంధ్రప్రదేశ్ తొలి ఛైర్‌పర్సన్‌గా లక్ష్మీపార్వతిని గత ప్రభుత్వం నియమించగా ఆమె అకాడమీ భవన నిర్మాణ స్థలాన్వేషణకే పరిమితమయ్యారు.

**వారు తిరుపతి వస్తే ఒట్టు**

తెలుగు అకాడమీ కార్యాలయ నిర్వహణ కోసం కేటాయించిన రీసెర్చ్, సేల్స్, పరిపాలనాధికారులతో సహా 14 మంది ఉద్యోగులు తిరుపతిలోని కార్యాలయంలో ఇప్పటి వరకు అడుగుపెట్టిన దాఖలాలు లేవు.

**అక్కడి నుంచి అటే..**

విజయవాడలో పుస్తకాలను ముద్రించి వాటిని అక్కడి నుంచే రాష్ట్రంలోని అనంతపురం, విజయవాడ, తిరుపతి, విశాఖపట్నం, గుంటూరు ప్రాంతీయ కేంద్రాలకు చేరవేసి విక్రయాలు సాగిస్తున్నారు. తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్‌గా నియమితులైన ఆర్.డి.విల్సన్ సైతం తిరుపతిలోని అకాడమీ ప్రధాన కార్యాలయాన్ని కన్నెత్తి చూడలేదు.

**ఇంటర్ పాఠ్యపుస్తకాలకే పరిమితం**

ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ ఇంటర్, డిగ్రీ, పీజీ, డీఎడ్, బీఎడ్, ఆధునిక తెలుగుబోధన, ఎంసెట్ పుస్తకాలతో పాటు వివిధ అనువాదాలు, మోనోగ్రాఫులు, జనరంజక గ్రంథాలు, వ్యాసావళి, పోటీ పరీక్షల పుస్తకాలతో పాటు నిఘంటువులు, పరిపాలన న్యాయ పదకోశం వంటి 158కి పైగా ప్రచురణలు ముద్రించేది. ప్రస్తుతం కేవలం ఇంటర్, డీఎడ్, బీఎడ్, పాఠ్యపుస్తకాలు, పరిమిత సంఖ్యలో టెట్, డీఎస్సీ స్టడీ మెటీరియల్ మాత్రమే ముద్రించి సరఫరా చేస్తోంది.

ప్రస్తుతం తిరుపతి ప్రాంతీయ కేంద్రం తరహాలో పనిచేసే అసిస్టెంట్ మేనేజర్, పొరుగుసేవల విధానంలో పనిచేసే కంప్యూటర్ ఆపరేటర్, ముగ్గురు సహాయకులే తిరుపతి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు.

**భాషాభిమానుల ఆకాంక్షలివీ..**

ఉమ్మడి రాష్ట్రంలో ఏటా రూ.250 కోట్లకు పైగా లావాదేవీలు జరిగే తెలుగు అకాడమీ, ప్రస్తుతం రూ.15 కోట్లకు మించలేదని అంటున్నారు. త్వరలో పాఠశాలల పాఠ్యపుస్తకాలు, డిగ్రీ, పోటీ పరీక్షల పుస్తకాలు, సివిల్స్‌కు సిద్ధం అవుతున్న వారికి అకాడమీ పుస్తకాలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తున్న నేపథ్యంలో తెలుగు, సంస్కృత అకాడమీ వ్యవహారంపై స్పష్టతను భాషాభిమానులు ఆకాంక్షిస్తున్నారు.

## సర్కారు భూమిపై కబ్జాదారుల కన్ను

కదిరి : కదిరి పట్టణ పరిధిలో భూముల ధరలు అమాంతం పెరగడంతో కబ్జాదారుల కళ్లు ప్రభుత్వ భూములపై పడ్డాయి. కదిరి రెవెన్యూగ్రామం బేరిపల్లికాని సమీపంలోని సర్వేనంబరు 268లో దాదాపు 15సెంట్ల స్థలాన్ని అక్రమార్కులు రాత్రికి రాత్రే చదును చేశారు. బాహ్యవలయ రహదారికి ఆనుకుని ఉన్న ఈస్థలం మీదుగా దేవరచెరువు నుంచి పంట పొలాలకు నీరందించే కాలువను గట్టను ధ్వంసం చేసి భూమిని చదును చేసేశారు. జాతీయ రహదారి 42కు సమీపంలో ఉండటంతో ఈ ప్రాంతంలో సెంటు భూమి ధర 10 లక్షల వరకు పలుకుతోంది. పదిహేనుసెంట్ల భూమి కోటిన్నర రూపాయల పైమాటే. పట్టణానికి సమీపంలోనే ప్రభుత్వ భూమిని కబ్జాచేసేందుకు యత్నిస్తున్నా రెవెన్యూ అధికారులు దృష్టికి రాకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఆక్రమణదారుల పట్ల అధికారులు కఠినచర్యలు తీసుకోని కారణంగానే పెట్రేగిపోతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. బేరిపల్లి వద్ద పొలాలకు



వెళ్లేదారి నుంచి ఉన్న నీటికాలువ వరకు ఉన్న స్థలంపై కన్నేసిన కబ్జాదారులు రాత్రివేళల్లో పొక్లెయిన్ సాయంతో చదును చేసేశారు.

**తగిన చర్యలు తీసుకుంటాం: మురళీకృష్ణ, తహసీల్దార్, కదిరి**

ప్రభుత్వభూమిని చదును చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం. అక్రమార్కులను గుర్తించాలని గ్రామ రెవెన్యూ అధికారికి సూచించా. భూమి అన్యాక్రాంతం కాకుండా హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి.. తగిన చర్యలు తీసుకుంటాం.

## ఇరుకు గదుల్లో.. పసిమొగ్గలు మగ్గిపోవాలా?

పాలకొల్లు మండలం వాలమర్రులో 159వ నంబరు అంగన్‌వాడీ కేంద్రం ఇది. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో ఈ నిర్మాణం చేపట్టగా తరువాత వచ్చిన వైకాపా సర్కారు పనులను పూర్తి చేయడంలో వివక్ష చూపింది. దీంతో అసంపూర్తి భవనంలోనే కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. మార్టేరు, అత్తిలి, పాలకొల్లు గ్రామీణ, పోడూరు, బాలల సమగ్ర వికాసానికి బాటలు వేయాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు వైకాపా పాలనలో ప్రాభవం కోల్పోయాయి. గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన అంగన్‌వాడీ భవన నిర్మాణాలను విస్మరించడంతో పాటు కొత్తగా ప్రారంభించిన పనులకు సైతం నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాలో అధిక శాతం కేంద్రాలు అద్దె గదుల్లో అరకొర వసతులతో కొనసాగుతున్నాయి.

రూ.13.5 లక్షల అంచనా వ్యయంతో మూడేళ్ల క్రితం చేపట్టిన పెనుమంట్ర-3 అంగన్‌వాడీ భవన నిర్మాణం ఇలా అసంపూర్తిగా మిగిలింది. 2023 జూన్‌లో ఈ నిర్మాణాన్ని పరిశీలించిన అప్పటి కలెక్టర్ ప్రశాంతి స్థానిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినా పరిస్థితిలో మార్పు రాలేదు. ఈ భవనం చుట్టూ పిచ్చిమొక్కలు, పొదలు పెరిగిపోవడంతో చిట్టడవిని తలపిస్తోంది.

**ఇదీ పరిస్థితి..**

పశ్చిమగోదావరి జిల్లాలోని ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 1,626 కేంద్రాలు ఉండగా వీటిలో 600 వరకు అద్దె గదుల్లో నడుస్తున్నాయి. వీటికి పట్టణ పరిధిలో నెలకు రూ.6 వేలు, గ్రామాల్లో అయితే రూ. 2 వేల చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. గతంలో తెదేపా, వైకాపా ప్రభుత్వాల హయాంలో చేపట్టిన 82 కేంద్రాల నిర్మాణాలు వివిధ దశల్లో ఆగిపోయాయి. పెనుగొండ మండలం ములపర్రులో 166వ నంబరు కేంద్రం అద్దె భవనంలో నడుస్తోంది. ఇక్కడ గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు చేసి భవన నిర్మాణం చేపట్టారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైకాపా నిధులను నిలిపేసింది. పెనుగొండలోని 135వ నంబరు కేంద్రానిదీ ఇదే పరిస్థితి. ఈ మండలంలో 71 కేంద్రాలకు గాను 25 అద్దె గదుల్లో కొనసాగుతున్నాయి. అత్తిలి, ఇరగవరం మండల్లాలోని ఈడూరు, కంతేరు, ఏలేటిపాడు గ్రామాల్లో భవన నిర్మాణాలను నిధులు మంజూరు కాకపోవడంతో గుత్తేదారులు మధ్యలోనే వదిలేశారు.

పోడూరు మండలం జిన్నూరు శివారు భూపయ్యచెరువులో నిర్మించిన భవనానికి గుమ్మాలు, పైపులైన్ల ఏర్పాటు, విద్యుదీకరణ పనులు చేయించాల్సి ఉంది. ఈ మండలంలో మూడు భవనాలు అసంపూర్తిగా మిగిలాయి. భవన నిర్మాణాల పరిస్థితిపై ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి తెలిపారు.

## మూడున్నర కోట్లు ముగగబెట్టారు

ఏలూరు: 17వ లోక్‌సభలో ఏలూరు నుంచి ప్రాతినిధ్యం వహించిన వైకాపా ఎంపీ కోటగిరి శ్రీధర్ ఐదేళ్ల పదవీకాలం పూర్తి చేసుకుని, లోక్‌సభ రద్దయ్యే నాటికి కేటాయించిన ఎంపీ లాడ్స్ నిధులను పూర్తిగా వెచ్చించలేకపోయారు. నిధులు ఖర్చు చేసే విషయంలో ఆయన ఎంత నిర్లక్ష్యంగా ఉన్నారో మిగిలిపోయిన నిధులే అందుకు నిదర్శనం. ఖర్చుకాకుండా రూ.3.76 కోట్లు మిగిలిపోయాయి. ఈ నిధులను ప్రస్తుత 18వ లోక్‌సభ సభ్యుడు పుట్టా మహేశ్‌కుమార్ వినియోగించొచ్చు. గ్రామాల్లో సామాజిక భవనాలు, పట్టణ, గ్రామీణంలో రహదారుల నిర్మాణాలు, క్రీడావసతుల కల్పనకు, మున్సిపల్ పట్టణాల్లో తాగునీటి సౌకర్యం కల్పనకు, ఆసుపత్రుల అభివృద్ధికి, పొలాల బాటలకు, కొల్లేరు గ్రామాల అనుసంధాన రహదారుల నిర్మాణాలకు ఖర్చుపెట్టుకోవచ్చు. జిల్లాలో రహదారులు చాలా అధ్వానంగా ఉన్నాయి. అయినా నిధులు ఖర్చు చేయలేదంటే ఎంపీకి చిత్తశుద్ధి కొరవడమే కారణమని చెప్పాలి. ఆయా పనులకు ఎంపీ ఆమోదం తెలపగానే జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి(సీపీవో)కి ప్రతిపాదనలు పంపితే మంజూరు పత్రాలు జారీ చేస్తారు. అధికారులు టెండర్లు పిలిచి వాటిని పూర్తి చేయాలి. అయితే 52 పనులకు కనీసం టెండర్లు పిలవలేదు. వాటి విలువ రూ.3.76 కోట్లు. గతంలో ఎంపీ శ్రీధర్ ప్రతిపాదించిన ఈ పనులు రద్దయిపోయాయి. ప్రస్తుత ఎంపీ ప్రతిపాదిస్తేనే టెండర్లు పిలిచి ప్రారంభిస్తారు.

**5 ఏళ్లలో రూ.22.66 కోట్ల పనులు..**

కోటగిరి శ్రీధర్‌కు ఎంపీలాడ్స్ కింద మొత్తం 251 పనులకు రూ.22.66 కోట్లు కేటాయించగా ఈ ఏడాది నవంబరు నాటికి 193 పనులు మాత్రమే పూర్తయ్యాయి. వాటి విలువ రూ.17.60 కోట్లు. ఈ బిల్లులు మంజూరు చేశారు. మరికొన్ని పనులు పురోగతిలో ఉన్నాయి. అవి పలు దశల్లో ఉన్నాయి. చింతలపూడి నియోజకవర్గంలో అత్యధిక పనులకు కేటాయింపులు జరిపారు. ఏలూరు నగరంతో సహా పలు చోట్ల నిర్మించిన సామాజిక భవనాల వ్యయం పెరిగి పనులు పూర్తికాక అసంపూర్తిగా నిలిచిపోయాయి.

ఎంపీ లాడ్స్ నిధులు రూ.22.66 కోట్లు
పనుల సంఖ్య: 251
పూర్తయినవి 193
వెచ్చించిన వ్యయం రూ.17.60 కోట్లు
ప్రస్తుతం పురోగతిలో ఉన్న పనులు 6
వెచ్చించాల్సిన వ్యయం రూ.1.29 కోట్లు

# మట్టి మాఫియా.. నిఘా ఏదయా?



మడకశిర : పలువురు యంత్రాలతో మట్టిని తవ్వి తరలిస్తూ రోజుల కొద్ది మట్టి దోపిడీ చేస్తున్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదు. మూడు రోజులుగా రొళ్ల కొండ ప్రాంతం నసేపల్లి గొల్లహట్టి వద్ద 8 ట్రాక్టర్ల ద్వారా పొక్లెయిన్‌తో మట్టిని తరలిస్తున్నారు. కొండ ప్రాంతాలు, చెరువులను ఆసరాగా చేసుకుని ఇటుక బట్టీలు, ఇళ్ల నిర్మాణానికి తరలిస్తున్నారు.

**గుంతలు తవ్విందిక్కడ**

రొళ్లకొండ, రత్నగిరి కొండ, దాసప్పపాళ్యంకొండ, అగ్రహారంకొండ, హెచ్.టీ.హళ్లికొండలు, కాకి చెరువు, హులికుంట చెరువు, రొళ్ల చెరువు, హునిసేకుంట చెరువు, సీఎంఘట్ట చెరువుల్లో..

**ఆవేదన పట్టదేం?**

కొండప్రాంతాలు, చెరువులను ఆసరాగా చేసుకుని ఎలాంటి అనుమతులు తీసుకోకుండా మట్టిని తరలించడం ఏంటి? మట్టిని తరలించే సమయంలో పొలాలమీదుగా దారి చేసుకుంటూ ఇబ్బంది కలిగిస్తున్నారు.

స్థానికులు

**అనుమతి ఉండాల్సిందే**

ఈ విషయంపై తహసీల్దార్ షేక్షావలిని వివరణ కోరగా కొండ ప్రాంతాలు, చెరువుల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ పొలాలకు మట్టి కావాల్సిన వారు సంబంధిత అధికారులతో అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు.

# కాసులిస్తే.. క్రమబద్ధీకరణ!




హిందూపురం : కొత్త దందా : అనుమతి లేని లేఅవుట్లను, భవనాలను క్రమబద్ధీకరించుకోవడానికి ఎల్ఆర్ఎస్, బీపీఎస్ స్కీములను తమకు అనుకూలంగా మలుచుకొని అవినీతికి పాల్పడుతున్నారు. హిందూపురం పట్టణంలోని కొందరు ప్లానింగ్ కార్యదర్శులు వసూల్ రాజాలుగా మారి పట్టణంలో ఎక్కడ నిర్మాణం జరుగుతున్నా వాలి తమ విభాగం అధికారులతో కలిసి బేరాలు సాగిస్తూ అవినీతికి పాల్పడుతున్నారు.

**నిబంధనల ప్రకారమైతే**

అనుమతిలేని వాటిని గుర్తించి, వారు క్రమబద్ధీకరణ చేసుకొనేలా చూడాల్సిన బాధ్యత టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బందిదే. పట్టణాల్లో భవన నిర్మాణాలకు, క్రమబద్ధీకరణ అనుమతి కోసం మున్సిపాలిటీ గుర్తించి, అనుమతి ఇచ్చిన లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ (ఎల్.టి.పి.)లు అయిన ప్రైవేటు సివిల్ ఇంజినీర్ల లాగిన్‌ల నుంచి ప్రజలు దరఖాస్తు చేసుకోవాలి. వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్లాన్ గీసి, అనుమతికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి.

**దందా వెలుగులోకి**

ఇటీవల ఓ కార్యదర్శి లేఅవుట్ క్రమబద్ధీకరణకు దాని యజమాని నుంచి రూ.3 లక్షలు తీసుకొన్నాడు. రూ.2 లక్షలు ఫీజు కట్టి, మరో రూ.లక్ష జేబులో వేసుకున్నాడు. ఎన్ని రోజులు గడిచినా దరఖాస్తు పరిష్కారం కాలేదంటూ యజమాని కార్యాలయానికి రావడంతో ఈ దందా బయటకొచ్చింది. పట్టణంలో పలు ప్రాంతాల్లో బహుళ అంతస్తుల నిర్మాణాలు జరుగుతున్నాయి. నిబంధనలను పాటించనివారి నుంచి లక్షలు డిమాండ్ చేస్తున్నారు. బెంగళూరు రోడ్డులో భవనాన్ని నిర్మిస్తున్న ఓ వ్యాపారిని రూ.5 లక్షలు అడిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. పరిగి రోడ్డులో దుకాణాల పేరుతో షెడ్లు వెలిశాయి. వాటికి తాత్కాలిక నిర్మాణాల కింద రూ.10 వేలు నుంచి రూ.50 వేలు ఫీజు మున్సిపాలిటీకి కట్టిస్తూ.. లక్షలాది రూపాయలను అధికారులు, సిబ్బంది దండుకుంటున్నారని విమర్శలు వస్తున్నాయి.

**వసూళ్లు ఇలా..** హిందూపురంలో కొందరు ఎల్.టి.పి.లు అనుమతులు రావని, అనేక నిబంధనలను భూతద్దంలో చూపి, మున్సిపల్ అధికారుల పేరు చెప్పి పెద్ద మొత్తంలో వసూలు చేశారని విమర్శలున్నాయి. మరి కొందరు ఎల్.టి.పి.లు భవన నిర్మాణ కాంట్రాక్ట్‌ను తమకు ఇస్తే, అనుమతులు సులభంగా వస్తాయని, లేదంటే కష్టమని చెప్పి, నిర్మాణ పనులను తీసుకొని, భారీగా ఆదాయం పొందేవారు. ఇది గుర్తించిన కొందరు అధికారులు, ప్లానింగ్ కార్యదర్శులు, ఇంజినీరింగ్ పూర్తి చేసుకొని, బెంగళూరు లాంటి నగరాల్లో ఉద్యోగాలు చేస్తున్న, తమ మాట వినేవారిని గుర్తించి, ఎల్.టి.పి.లుగా మార్చారు. క్రమబద్ధీకరించుకో వడానికి వచ్చే యజమానులతో అధికారులు, కార్యదర్శులు మాట్లాడు కొని, తమ బినామీ ఎల్.టి.పి.ల లాగిన్, పాస్‌వర్డులను ఉపయోగించి, దరఖాస్తులు చేయడం, తమ లాగిన్‌ల నుంచి వారికి అనుమతులు వెంటనే మంజూరు చేయిస్తున్నారు. ఇందుకు భారీగా దండుకొంటున్నారు.

# బతుకు దైన్యం.. సాగు గగనం!



అనంతపురం : రబీలో పంటల సాగు విస్తీర్ణం ఐదేళ్లలో పరిశీలిస్తే ఏటా తగ్గుతూనే ఉంది. ప్రధాన పంటగా ఉన్న పప్పుసెనగ విస్తీర్ణం సైతం బాగా పడిపోతూ ఉంది. కారణాలు : జిల్లాలో రబీ సీజన్ నల్లరేగడి నేలల్లో ప్రధాన పంట పప్పుసెనగ. వర్షాధార పంట కూడా. మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడం, ధరలు తగ్గడం, విపరీతంగా తెగుళ్లు ఆశించడం, పెట్టుబడి ఖర్చులు పెరగడం వంటివి రైతులను కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి. పప్పుసెనగ పంటకు ప్రత్యామ్నాయంగా తెల్ల, పచ్చజొన్నతోపాటు గత ఖరీఫ్‌లో కంది వంటి పంటలను అధికంగా సాగయ్యాయని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఎర్రనేలల్లో బోర్ల కింద మాత్రమే పంటలు సాగు చేస్తారు. ఇక్కడ కూడా రానురాను వ్యవసాయంలో నష్టాలు పెరుగుతుండటంతో రైతులు సాగును వదిలేస్తున్నాయి. జిల్లాలో.. రబీలో పప్పుసెనగ సాధారణ సాగు లక్ష్యం 75 వేల హెక్టార్లు. ఏటా పప్పుసెనగ సాగు తగ్గుతూనే ఉంది. దాని స్థానంలో ఇతర పంటలు సాగులోకి వచ్చాయని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

**నల్లనేలల్లో ప్రత్యామ్నాయ పంటలు**రవి – జేడీఏ (అనంతపురం)

ఈ ఏడాది రబీలో రేగడి భూముల్లో పప్పుసెనగ పంట సాగుకు బదులుగా పత్తి, జొన్న, ఖరీఫ్‌లో కంది పంటలు సాగు చేశారు. గత అక్టోబరు, నవంబరులో పత్తి, జొన్న, కుసుమ వంటి పంటలు సాగయ్యాయి. బోర్ల కింద ఎర్రనేలల్లో మొక్కజొన్న సాగు పెరిగింది. ఖరీఫ్‌లో నల్లనేలల్లో కంది సాగులోకి రావడంతో పప్పుసెనగ సాగు కొంత మేరకు తగ్గింది వాస్తవమే.

# ఆటలకు మంచిరోజులు

కుప్పం : కుప్పం పట్టణానికి ఏళ్ల కిందట మంజూరైన క్రీడా మైదానం వైకాపా పాలనలో కొండలు, గుట్టలకే పరిమితమైంది. మైదానం అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో గ్యాలరీలోని షెడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కుప్పం అభివృద్ధిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టిసారించారు. పురపాలిక పరిధిలోని వడ్డేపల్లె వద్ద అధికారులు 'ఎన్టీఆర్ క్రీడా మైదానం' అభివృద్ధికి రూ.76 కోట్లతో ప్రభుత్వానికి అధికారులు ప్రణాళికలు పంపారు. ఇందులో భాగంగా రూ.22 కోట్లు మొదట ప్రత్యేక గ్రాంటు కింద మంజూరు చేయడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

**శరవేగంగా పనులు** ప్రస్తుతం ఓపెన్ స్టేడియంతో పాటు ఇండోర్ క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేస్తున్నారు. మంజూరైన రూ.22 కోట్లతో ప్రహరీ, 20 ఎకరాల భూమిని చదును పనులు చేస్తున్నారు. ఖేలో ఇండియా పథకంలో భాగంగా మల్టీ పర్పస్ ఇండోర్ బ్లాకు నిర్మాణానికి రూ.14 కోట్లు మంజూరు చేశారు. మరికొన్ని పనులకు ప్రతిపాదనలు పెట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ ఏడాది మార్చి నాటికి మైదానంలోని బండరాళ్లను పూర్తిగా తొలగించి చదును చేస్తామని, తర్వాత స్పోర్ట్స్ కాంప్లెక్స్, క్రీడాకారుల వసతి గృహ నిర్మాణం చేపడతామని పుర కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు.

# పగలు సేకరణ.. రాత్రుళ్లు రవాణా!

అనకాపల్లి : జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ప్రజాప్రతినిధులు, పోలీసులు తప్పితే.. అక్రమ రవాణాను అరికట్టాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. పేదలకు అందాల్సిన చౌక బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ప్రతి నెలా రేషన్ బియ్యం లబ్ధిదారుల ఇళ్లకు చేరక ముందే అక్రమార్కుల పరమవుతోంది. జిల్లా వ్యాప్తంగా ఈ దందాను కట్టడి చేయాల్సిన సంబంధిత అధికారులే దళారులకు సహకరిస్తున్నారన్న విమర్శలున్నాయి.

ప్రతి మండలంలోనూ రేషన్ బియ్యం కొనుగోలు చేసేందుకు ముఠాలున్నాయి. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. వీరి హవానే సాగుతోంది. చోడవరం, ఎలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల్లో వీరికి ఎదురే లేదు. ఆయా మండలాల్లో రేషన్ బియ్యాన్ని దళారులే కొనుగోలు చేయాలన్న ఆదేశాలున్నాయి. పగలు దండటం, సమీపంలోని రైస్ మిల్లుల్లో నిల్వ చేయడం చేస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో లోడ్ చేసి కాకినాడ పోర్టుకు తరలిస్తున్నారు. అధికారులు తమ టార్గెట్‌కు అనుగుణంగా.. దాడులు చేసి దళారుల సూచనల మేరకు నామమాత్రంగా కేసులు నమోదు చేస్తూ చేతులు దులిపేసుకుంటున్నారు. జిల్లాలో కార్డుదారుల నుంచి రేషన్ డీలర్లు కేజీ బియ్యం రూ.18 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. వీరు బియ్యం వ్యాపారులకు రూ.20 చొప్పున అమ్ముతున్నారు. వ్యాపారులు పాలిష్ పట్టి కేజీకి రూ.30 ధర నిర్ణయించి కాకినాడకు తరలిస్తున్నారు.

జిల్లాలో పౌరసరఫరాల శాఖ డీటీలు ఆరుగురు ఉన్నారు. వీరెవరూ ఎక్కడా ఒక్క బియ్యం కేసు పట్టుకున్న దాఖలాల్లేవు. స్థానికులు పట్టుకుని అప్పగించే సందర్భాల్లో మాత్రమే కేసులు నమోదు చేస్తున్నారు. ఎలమంచిలి పౌర సరఫరాల శాఖ డీటీకి గ్రామాల నుంచి ఎవరైనా



ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా.. ఆ ప్రాంత వ్యాపారులకు సమాచారం చేరవేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఎలమంచిలిలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ శనివారం 2,625 కేజీల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఎమ్మెల్యే ఫోన్ చేసి చెప్పాక రెవెన్యూ అధికారులు అక్కడకు చేరుకున్నారు.

**ప్రత్యేక నిఘా పెట్టాం...** ప్రతి నెలా రేషన్ అందించే సమయాల్లో.. బియ్యం పక్కదారి పట్టకుండా దాడులు చేస్తున్నాం. డీటీలు, తహసీల్దార్లు తనిఖీలు చేయాలని ఆదేశాలిచ్చాం. ప్రభుత్వం ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తోంది. రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై ప్రత్యేక నిఘా పెట్టాం. కేవీఎన్ మూర్తి, డీఎస్‌వో, అనకాపల్లి


# భవిత మార్చేలా... నైపుణ్యం నేర్పేలా...

విశాఖపట్నం: చదువు పూర్తయిన తర్వాత మంచి ఉద్యోగం సాధించాలంటే నైపుణ్యం అవసరం. ఉద్యోగంలో చేరిన తర్వాత ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నా నైపుణ్యాలే కీలకం. దీన్ని గుర్తించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు వృత్తి విద్య నైపుణ్యాలు నేర్పిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు స్వయం ఉపాధికి బాటలు వేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం, సమగ్ర శిక్షా (ఎస్ఎస్) భాగస్వామ్యంతో జిల్లాలోని పాఠశాలలకు ప్రయోగ, శిక్షణ సామగ్రి అందజేశారు. కోర్సులు నేర్పించడానికి ప్రత్యేకంగా నిపుణులను నియమించారు. ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకున్న విద్యార్థులకు నైపుణ్యాలు నేర్పిస్తున్నారు.

**ఇంటర్న్‌షిప్, పరిశ్రమల సందర్శన**

జిల్లాలో 31 పీఎంశ్రీ, కేజీబీవీ, ఆదర్శ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో విద్యార్థులకు వృత్తి విద్య నైపుణ్యాలు నేర్పిస్తున్నారు. పీఎం శ్రీ పాఠశాలల్లో మూడేసి, మిగిలిన పాఠశాలలో ఒక్కో కోర్సు బోధిస్తున్నారు. 6 నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు ప్రీ ఒకేషనల్ కింద కౌశల్ బుద్ధ్ పేరిట నిర్వహిస్తున్నారు. వారికి పుస్తకాల్లో వృత్తి నైపుణ్యాలను నేర్పిస్తారు. వీరికి ఎక్స్‌పోజర్ విజిట్‌లో భాగంగా వృత్తి నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఫలితంగా వారికి ఏదో ఒక అంశంపై ఆసక్తి మొదలవుతుంది.

9 నుంచి 12వ తరగతి విద్యార్థులకు శిక్షణతోపాటు ఇంటర్న్‌షిప్,



పరిశ్రమల సందర్శన ఉంటుంది. వీరికి ప్రాక్టికల్ పరీక్షలు కూడా నిర్వహిస్తారు. ప్రతి పాఠశాలలో టైమ్ టేబుల్‌లో వారానికి నాలుగు పీరియడ్స్ కేటాయిస్తున్నారు. సంక్రాంతి, దసరా, ఇతర సెలవుల సమయంలో విద్యార్థులతో ఇంటర్న్‌షిప్ చేయిస్తున్నారు.

పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తయిన తర్వాత వారికి ప్రాక్టికల్స్ ఉంటాయి.

చదువుకుంటూనే ఉపాధి విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా నైపుణ్యాలు నేర్చుకోవడానికి ఒకేషనల్ విద్య ఉపకరిస్తుంది. ఇంటర్ పూర్తయిన తర్వాత విద్యార్థులు ఖాళీ సమయాల్లో నేర్చుకున్న నైపుణ్యాలతో ఉపాధి పొందగలరు. అవసరమైతే చదువుకుంటూనే పని చేసుకోవడానికి వీలుంటుంది. కొన్ని కోర్సులో చేరిన విద్యార్థినులు సెలవుల్లో ఆ నైపుణ్యాలతో కొంత మొత్తం సంపాదిస్తున్నారు.

డా.జె.చంద్రశేఖర్‌రావు, ఏపీసీ, సమగ్రశిక్ష

జిల్లాలో కోర్సులు ఆటోమోటివ్
వ్యవసాయం అపెరల్ (దుస్తులు కుట్టడం)
బ్యూటీ అండ్ వెల్‌నెస్
ఎలక్ట్రానిక్స్
ఫుడ్ ప్రాసెసింగ్
హెల్త్‌కేర్‌జి ఐటీ-ఐటీఈఎస్
రిటైల్‌జి బ్యాకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్

# గ్రామీణ రోడ్ల అభివృద్ధికి రూ. 5,459 కోట్లు

దేవరాపల్లి: రాష్ట్రంలో పంచాయతీరాజ్ రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం రూ. 5459 కోట్లు కేటాయించిందని పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ బి.బాలూనాయక్ పేర్కొన్నారు. ఈ నిధులతో ఇప్పటికే కొన్ని రోడ్ల పనులు జరుగుతుండగా, మరికొన్ని టెండర్ల దశలో ఉన్నట్లు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో అడవితల్లి బాట పథకం (డోలీ హేబిటేషన్ ప్లాన్) ద్వారా చేపట్టిన రోడ్లనిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. అక్కడి నుంచి ఆయన దేవరాపల్లిలోని రైవాడ అతిథి గృహానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రహదారుల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. పీఎం జన్‌మన్ (అడవితల్లి బాట) ద్వారా 239 ఆవాస ప్రాంతాలకు రూ. 555 కోట్ల వ్యయంతో 206 రోడ్లు అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇందులో 30 రోడ్లు బీటీ వేస్తామన్నారు. 160 పనులు మార్చి ఆఖరిలోగా పూర్తి చేస్తాం.



మిగతావి ఆగస్టులోగా పూర్తి చేసేందుకు కృషి చేస్తాం.
పల్లెపండగ–2.0 కింద ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన ద్వారా రూ. 1,122 కోట్ల వ్యయంతో 976 కి.మీ. మేర రోడ్లు అభివృద్ధి చేస్తున్నాం.నాబార్డు నిధులతో 1,203 కిలోమీటర్ల మేర 402 రహదారుల పూర్తికి రూ. 557 కోట్లు వెచ్చిస్తున్నాం. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంటు బ్యాంకు (ఏఐఐబి) ద్వారా రూ. 1,100 కోట్ల వ్యయంతో 963 కి.మీ రోడ్లు (561 పనులు) నిర్మిస్తున్నాం. ఏపీ రూరల్ రోడ్స్ స్ట్రెంగ్తెనింగ్ ప్రాజెక్టు కింద 4007 కి.మీ. రోడ్డు (1299) పనులు చేపట్టడానికి రూ.2,123 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులకు సంబంధించి టెండర్లు పిలవాల్సి ఉందని, ఈ ప్రక్రియ పూర్తయిన తరవాత పనులు చేపడతామని బాలూనాయక్ స్పష్టం చేశారు. పంచాయతీరాజ్ ఎస్ఈ కె.శ్రీనివాసరావు తదితరులున్నారు.

# అంత చేసి.. ఇంతేనా తేల్చింది!

పుట్టపర్తి : చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై నవంబరు 5, 6 తేదీల్లో ఏసీబీ అధికారులు దాడులు చేశారు. సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్‌బాబుతోపాటు మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న ప్రైవేటు వ్యక్తి తలారి సోమశేఖర్‌పై అనుమానాలు రావడంతో రాత్రంతా విచారణ చేశారు. కొన్ని దస్త్రాలు సైతం పట్టుకెళ్లారు. సోమశేఖర్ ఫోన్‌పే ద్వారా పెద్దఎత్తున లావాదేవీలు జరిగాయని గుర్తించినట్లు ప్రచారం జరిగింది. గంటలపాటు విచారణ చేసినా.. నాడు పట్టుబడిన మొత్తం రూ.4 వేలే. ఆ తర్వాత ఏసీబీ అధికారులు సబ్ రిజిస్ట్రార్, ప్రైవేట్ వ్యక్తి వ్యవహారంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి సూచన మేరకు కేసు నమోదు చేశారు.

**రెండోసారీ.. అంతే**

ఈ ఇద్దరు వ్యక్తుల ఇళ్లలో సోదాలు చేసేందుకు అనుమతి కోసం కోర్టుకెళ్లి సెర్చ్ వారెంట్లు తీసుకొచ్చారు. ఈ మేరకు మంగళవారం



చిలమత్తూరులో సోమశేఖర్, అనంతపురంలో ప్రసాద్‌బాబు ఇళ్లల్లో ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సోదాలు నిర్వహించినా.. రూ.47 వేలు మాత్రమే దొరికింది. అలాంటప్పుడు ఇంతమంది అధికారులు, సిబ్బంది రెండు దఫాల్లో మూడ్రోజులపాటు సోదాలు చేసినా.. ఏదీ తేల్చలేకపోవడంపై విమర్శలొస్తున్నాయి. మొదటిసారి తనిఖీలు చేసిన తర్వాత రెండోసారి చేయడానికి మధ్య 45 రోజుల సమయం ఉంది. ఇంత సమయం దొరికితే ఎవరైనా.. సర్దుకోకుండా ఉంటారా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. మరి సర్దుకోవడానికి ఇంత సమయం లభిస్తే వారు ఊరికే ఉంటారా? అన్న ప్రశ్న తలెత్తుతోంది. అంత చేసి.. ఇంతేనా తేల్చింది అని ప్రజలు పెదవి విరుస్తున్నారు.
ఈ విషయంపై ఏసీబీ డీఎస్పీ ప్రసాద్‌రెడ్డిని వివరణ కోరగా.. నవంబరులో సర్‌ప్రైజ్ దాడులు చేశామని, నాడు అనుమానం రావడంతో ప్రస్తుతం ఇళ్లల్లో సోదాలు చేసినట్లు తెలిపారు. చట్టపరంగా అనుమతులు తీసుకున్న తర్వాతే సోదాలు నిర్వహించాల్సి రావడంతోనే గడువు వచ్చిందని వివరించారు.

# అసైన్డ్ భూమికి రిజిస్ట్రేషన్

చెన్నేకొత్తపల్లి : సమస్య : స్థిరాస్తి వ్యాపారులు, రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులంతా కలిసి అసైన్డ్ భూమిని రిజిస్ట్రేషన్ చేసి పట్టాగా మార్చారు.
నిదర్శనం: సమాజంలో పలుకుబడి ఉండి, క్షేత్రస్థాయి అధికారులకు అమ్యామ్యాలిస్తే... ఎంత పెద్ద పనైనా ఇట్టే అయిపోతుందనడానికి ఇది ఉదాహరణ ఎక్కడ జరిగింది?: చెన్నేకొత్తపల్లిలో 44వ జాతీయ రహదారి పక్కన సర్వే నంబరు 107–3లో మొత్తం 14.76 ఎకరాల అసైన్డ్ భూమి ఉంది. ఇందులోని ఏడెకరాల భూమిలో 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు నివాస పట్టాలు ఇచ్చింది. వైకాపా ప్రభుత్వ హయాంలో ఇదే సర్వే నంబరులోని ముగ్గురు దళితులకు చెందిన 5.80 ఎకరాల భూమిని అధికార పార్టీ (వైకాపా) నేతలు కొనుగోలు చేశారు. తదుపరి దీనిని రెట్టింపు ధరకు స్థిరాస్తి వ్యాపారులకు అమ్మకం చేయగా.. తదుపరి వారు ఎన్ఓసీ తెచ్చుకుని నివాస స్థలాలుగా మార్చి క్రయవిక్రయాలు చేశారు. మరో వ్యక్తికి చెందిన 1.10 ఎకరాల భూమిని షబ్బీర్ కొనుగోలు చేశాడు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సర్వే నంబరును సబ్ డివిజన్ చేసి రెవెన్యూ దస్త్రాల్లో 107–3(ఏ)గా నమోదు చేసి యథేచ్ఛగా రిజిస్ట్రేషన్లు చేశారు. సబ్ డివిజన్ సమయంలో సమీపంలోని రైతులకు సమాచారం ఇవ్వలేదని చుట్టుపక్కల అన్నదాతలు ఆరోపిస్తున్నారు. ఇలా రిజిస్ట్రేషన్ అయిన భూమిని ఇప్పుడు ఒక్కో సెంటు ధర రూ.4 నుంచి 5 లక్షలకు విక్రయిస్తుండటం గమనార్హం.
చర్యలు తీసుకుంటాం సురేష్‌కుమార్, తహసీల్దార్, చెన్నేకొత్తపల్లి
107–3 సర్వే నంబరు రెవెన్యూ దస్త్రాలు పరిశీలించి.. ఆ స్థలం ఏవిధంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారో విచారిస్తాం. సర్వే, రెవెన్యూ దస్త్రాల్లో వివరాల నమోదులో అవకతవకలు జరిగినట్లు తేలితే అధికారులకు తాఖీదులు జారీ చేసి చర్యలకు ఉపక్రమిస్తాం.

# వెల్దుర్తిలో ఉప్పుటేరులు



వెల్దుర్తి: వెల్దుర్తి మండల కేంద్రంలో 'ఉప్పు'టేరులు ప్రవహిస్తున్నాయి.. ఇక్కడి రైల్వే స్టేషన్‌కు నిత్యం భారీగా ఉప్పు ఎగుమతి అవుతోంది.. వ్యాగన్ల నుంచి దించే క్రమంలో కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదు.. దీంతో ఉప్పు భూమిలో కలిసిపోయి జలం గరళంగా మారుతోంది. దశాబ్దాలపాటు తాగునీటి అవసరాలు తీర్చిన బోర్లు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం.. అధికారులు పట్టించుకోకపోవడంతో జనం ఇబ్బందులు పడుతున్నారు.

**గుక్కెడు నీటికి ఇబ్బందులు**

వెల్దుర్తిలోని రైల్వేస్టేషన్ కాలనీ, జాతీయ రహదారి మార్గంలో 500 కుటుంబాలకుపైగా జీవనం సాగిస్తున్నాయి. రెండు వేలకుపైగా జనాభా ఉంది. ఉప్పు కారణంగా వెల్దుర్తి రైల్వేస్టేషన్ సమీపంలో రెండు కిలోమీటర్ల పరిధిలో భూగర్భ జలాలు పూర్తిగా కలుషితమయ్యాయి. " కాలనీలోని చేతిపంపు నీటిని గతంలో స్నానాలకు ఉపయోగించేవాళ్లం. ప్రస్తుతం నీరు ఉప్పగా వస్తుండటంతో వాడుకునే పరిస్థితి లేకుండాపోయిందని" మాధవస్వామి వాపోయారు.ప్రతి నెలా 15 వేల టన్నులు
గుజరాత్ నుంచి బోగీల ద్వారా వెల్దుర్తి రైల్వేస్టేషన్‌కు ఉప్పు తీసుకొస్తున్నారు. ఒక్కో ట్రిప్పులో 50 నుంచి 60 వ్యాగన్లలో దాదాపు 3 వేల టన్నుల ఉప్పు స్టేషన్‌కు చేరుతుంది. ఇలా నెలలో 5 సార్లు సరకు వస్తుంటుంది. ప్రతి నెలా 15 వేల టన్నుల ఉప్పును దిగుమతి అవుతుంది. దీనిని రైల్వేస్టేషన్‌లోని రెండో నంబరు ప్లాట్‌ఫామ్‌పై దించుతున్నారు. అనంతరం కర్నూలులోని ఓ పరిశ్రమకు లారీల్లో రవాణా చేస్తున్నారు.

**కనీస జాగ్రత్తలు కరవు**

ప్రతి నెలా 1,000 లారీల ఉప్పును వాహనాల్లో తరలిస్తుంటారు. సరకు దిగుమతి చేసుకునే సమయంలో ముందుగా మందంగా ఉన్న టార్పాలిన్లను ప్లాట్‌ఫామ్‌పై వేయాలి. ప్లాస్టిక్ పట్టలు వేస్తుండటంతో అవి చిరిగిపోతున్నాయి.
సరకు వ్యాగన్ల నుంచి దించుకునే సమయంలో నేలపై పడటం.. సకాలంలో లారీల్లో తరలించకపోవడం.. వర్షాలు పడిన సమయంలో లవణం కరిగి భూమిలో ఇంకుతుండటంతో జలం గరళంగా మారుతోంది.
ప్లాట్‌ఫామ్‌పై ఉప్పును కిందకు తోసేస్తున్నారు. కింద పడిన లవణాన్ని భూమిలో కరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. లారీల్లో లోడింగ్ చేసే సమయంలో పనిచేసే కార్మికులకు శిరస్త్రాణం, మాస్కులు ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు.

**తాగలేకపోతున్నాం : లక్ష్మీదేవి, వెల్దుర్తి**

రైల్వేస్టేషన్ కాలనీలో నివాసం ఉంటున్నాం.. 15 ఏళ్ల కిందట సొంతంగా బోరు వేయించారు. ఇంటి అవసరాలకు నీటిని వినియోగించుకునేవారు. గత రెండేళ్లుగా వెల్దుర్తి రైల్వేస్టేషన్‌లో ఉప్పు రవాణా జరుగుతోంది. ఇంటి బోరు నుంచి నీరు ఉప్పుగా వస్తోంది. నీరు సైతం రంగు మారింది.

# విచారణ తుస్.. చర్యలు తూచ్!



అనకాపల్లి : అధికారం అండతో గత ప్రభుత్వంలో విస్సన్నపేటలో వైకాపా నేతలు సాగించిన స్థిరాస్తి దందాపై విజిలెన్స్ విచారణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర గడిచినా.. అక్రమార్కులపై చర్యలు లేవు. అప్పట్లో మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఆయన అనుచరుల కనుసన్నల్లో వేసిన లేఅవుట్ వ్యవహారాలు, అక్రమాలను వెలికి తీయాల్సిన అధికారులు మిన్నకుండిపోతున్నారు. గత ప్రభుత్వంలో నేతలు ఆదేశిస్తే చాలు.. పొక్లెయిన్లు తీసుకుకెళ్లి మరీ నిర్మాణాలు నేలమట్టం చేసేవారు. అలాంటిది నేటికీ ఆ భూముల వ్యవహారం ఒక కొలిక్కి రాకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. ప్రస్తుతం ఈ భూముల్లో ఉన్న రిసార్టులో వైకాపా నేతలు వారాంతాల్లో పార్టీలు చేసుకుంటున్నారు. ఈ విషయం పోలీసులకు, అధికారులకు తెలిసినా కనీసం కన్నెత్తి చూడటం లేదని స్థానికులు, కూటమి నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
నాటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అతని ప్రధాన అనుచరుడు బొడ్డేడ ప్రసాద్ కనుసన్నల్లో కశింకోట మండలం బయ్యవరం రెవెన్యూ పరిధిలోని విస్సన్నపేటలో భారీ లేఅవుట్ వేశారు. మొత్తం 609 ఎకరాల్లో భారీగా వేశారు. దీనికోసం పది అడుగులున్న గోర్జిని వంద అడుగుల రహదారిగా విస్తరించారు. పక్కనే ఉన్న కొండను తొలిచేశారు. కొండగెడ్డలను కప్పేశారు. అసైన్డ్ భూములను సైతం ఆక్రమించుకున్నారు. దీనిపై అప్పట్లో ఫిర్యాదులు వెల్లువెత్తడంతో ఓ ఆర్‌డీఓతో విచారణ చేయించారు. సుమారు పదెకరాలకు పైగా ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించారు. ఆయనా అప్పట్లో చర్యలు తీసుకోలేదు.
గత ప్రభుత్వంలో ఈ వ్యవహారంపై జనసేన నేత దూలం గోపీనాథ్ లోకాయుక్తను ఆశ్రయించారు. పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో విస్సన్నపేట భూములను జనసేన అధినేత సందర్శించి వైకాపా నేతల దోపిడీని దుయ్యబట్టారు.
కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో అక్రమాలు వెలికి తీస్తామని అప్పట్లో గట్టిగా నేతలు చెప్పారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటారని అంతా భావించారు. కానీ.. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా చర్యలకు మాత్రం పూనుకోలేదు. అప్పట్లో హడావుడి చేసిన కూటమి పెద్దలు కూడా ప్రస్తుతం మౌనం దాలుస్తున్నారు.
కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తరవాత గత ప్రభుత్వ కాలంలోని భూ వ్యవహారాలపై విజిలెన్స్ విచారణ చేయిస్తోంది. అందులో భాగంగా విస్సన్నపేట లేఅవుట్‌పైనా విచారణ చేస్తున్నారు. మూడు, నాలుగుసార్లు భూములను సైతం అధికారులు పరిశీలించారు. స్థానిక గ్రామస్థుల నుంచి వివరాలు సేకరించారు. ఏడాదిన్నర గడుస్తున్నా భూ ఆక్రమణదారులకు ఇప్పటికీ ఒక్క నోటీసు కూడా ఇవ్వకపోవడం అనుమానాలకు తావిస్తోంది. విస్సన్నపేట భూములకు సంబంధించి విజిలెన్స్ విచారణ జరుగుతోంది. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించిన పరిశీలిస్తున్నారు. తుదినివేదిక ఆధారంగా చర్యలు చేపడతామని ఆర్‌డీఓ ఆయిషా తెలిపారు.

# రాజకీయ వేదికగా బాలల ప్రాంగణం..!

విశాఖపట్నం: సిరిపురంలోని వీఎంఆర్‌డీఏ బాలల ప్రాంగణం రాజకీయాలకు వేదికగా మారుతోంది. ఇష్టానుసారంగా కార్యక్రమాలకు అనుమతులు ఇవ్వడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. బాలల సాంస్కృతిక, విద్యా కార్యక్రమాల నిర్వహణ కోసం ఈ ప్రాంగణాన్ని ప్రత్యేకంగా నిర్మించారు. అయితే గత వైకాపా ప్రభుత్వంలో దీన్ని రాజకీయ కార్యక్రమాలకు ఉపయోగించారు. ఎన్ని విమర్శలొచ్చినా పట్టించుకోలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ ఆ విధానంలో మార్పు రాలేదు. ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లిస్తే ఎవరు బుక్ చేశారు, ఎందుకోసమని పట్టించుకునే వారు కనిపించడం లేదు. తాజాగా సోమవారం వైకాపాలో చేరికల కార్యక్రమానికి ఇక్కడ ఏర్పాట్లు చేయడం, అనంతరం అధికారులు విషయం తెలుసుకుని అనుమతులు రద్దు చేయడం..దీనిపై వైకాపా నాయకులు ధర్నా చేయడం..వంటి కార్యక్రమాలు జరిగాయి.
**అధికారులు ఏం చేస్తున్నారు?:** వైకాపా నాయకులు వ్యూహాత్మకంగా ఆనంద్ అనే వ్యక్తి చేత కొన్ని రోజుల కిందట వీఎంఆర్‌డీఏ బాలల ప్రాంగణాన్ని బుక్ చేయించారు. ఇందుకోసం ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించారు. వివరాల నమోదులో గెట్ టు గెదర్ అని నమోదు చేశారు. అనంతరం ఏర్పాట్లపై రెండు, మూడు రోజులు వీఎంఆర్‌డీఏ సిబ్బందిని సంప్రదించారు. ఆ సమయంలోనైనా ఏ కార్యక్రమం నిర్వహిస్తున్నారో గుర్తించడంలో అధికారులు విఫలమయ్యారు. సోమవారం ఉదయం వైకాపా నాయకుల హడావుడి చూసి కంగారుపడి అనుమతులు రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ముందే గుర్తించి ఉంటే వైకాపా నాయకుల వ్యూహాలకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉండేది.
**అమలుకాని హామీ:** గతంలో ఇక్కడ సినిమాలు, నాటికలు, పిల్లల కార్యక్రమాలు ప్రదర్శించేవారు. కొంతకాలంగా అవేమీ నిర్వహించడం లేదు. పిల్లల కోసం ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని ఛైర్మన్ ప్రణవ్‌గోపాల్ హామీ ఇచ్చినా అమలు కాలేదు. దీనిపై కమిషనర్ తేజ్‌భరత్ వివరణ కోరగా వీఎంఆర్‌డీఏ నిబంధన–10 ప్రకారం బాలల ప్రాంగణంలో రాజకీయ పోస్టర్లు, బ్యానర్లు ఏర్పాటు చేయకూడదన్నారు. త్వరలో పిల్లల కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు.

**గత ప్రభుత్వంలో ఇష్టానుసారం**

గత వైకాపా ప్రభుత్వం బాలల ప్రాంగణాన్ని వైకాపా కార్యక్రమాలకు వేదికగా మార్చేసింది. నేతల సన్మానాలు, ఇతర వేడుకలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధమైనప్పటికీ పట్టించుకోలేదు. అప్పట్లో నిర్వహించిన పలు కార్యక్రమాలకు డబ్బులు సైతం చెల్లించలేదనే ఆరోపణలు ఉన్నాయి. బాలల కోసం ఏర్పాటు చేసిన ఈ ప్రాంగణం ఇతర కార్యక్రమాలకు వేదికగా మారడంపై నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# వరికోత.. అన్నదాత వ్యథ

ముదిగుబ్బ : అన్నదాత ఎంతో కష్టపడి పండించిన వరి పంటను కోత కోసేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ధరలు ఆకాశాన్నం టడంతో మిగిలేదేమీలేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఖరీఫ్‌లో వరి 9,802 హెక్టార్లలో సాగైంది. ప్రస్తుతం కోతలు సాగుతున్నాయి. ఐదేళ్ల క్రితం ఎకరం పొలంలో వరి సాగు చేయాలంటే రూ.30 వేల నుంచి రూ.40 వేలు పెట్టుబడి ఖర్చు అయ్యేది. కాలక్రమేణా వ్యయం పెరగడంతో రూ.50 వేల నుంచి రూ.60 వేలు పెట్టుబడి పెట్టాల్సివస్తోంది రైతులు వాపోతున్నారు. దిగుబడి మాత్రం ఎకరానికి 25 నుంచి 30 బస్తాలు (50 కిలోల చొప్పున) మాత్రమే వస్తున్నాయి. సాగు ఖర్చులు, నూర్పిడి యంత్రాల ధరలు పెరగడంతో అన్నదాతపై ఆర్థికభారం పడుతోంది.

**వారి చెప్పిందే ధర..**

గ్రామస్థాయిలో ఏజెంట్లంతా సిండికేట్‌గా మారి... వారు చెప్పిందే ధర ఇవ్వాల్సి వస్తోంది. తమిళనాడు, కర్ణాటకకు చెందిన వరికోత నూర్పిడి యంత్రాలు కోతలకు వస్తున్నాయి. పదుల సంఖ్యలో అందుబాటులో ఉన్నాయి. పొరుగు రాష్ట్రాలకు చెందిన వారు కావడంతో స్థానికంగా గ్రామాల్లో ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని ధరలను నిర్ణయిస్తున్నారు. తొలి గంటకు రూ.2వేల నుంచి ప్రారంభించి.. రూ.3,700 వరకు వసూలు చేస్తున్నారు. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.



నెమ్మదిగా నడిపేలా... ఎకరంలో వరిపంట కోతకోయాలంటే గతంలో గంట నుంచి గంట25 నిమిషాల్లోపు పూర్తి అయ్యేది. అధునాతన యంత్రాలు అందుబాటులోకి వచ్చినా గంటన్నర నుంచి గంట45 నిమిషాల వరకు తీసుకుంటున్నారు. అందులోనూ చైన్ మిషన్లు వెడల్పు తక్కువగా ఉండటంతో అధిక సమయం పడుతోంది. కొందరు యంత్రాలను నెమ్మదిగా నడుపుతూ ఆలస్యం చేస్తుండటంతో కోత పూర్తయ్యేసరికి రైతుకు ఖర్చులు అధికమవుతున్నాయి. ఏజెంట్లకు మాత్రం గంటకు రూ.200 చొప్పున వసూలు చేసుకుంటున్నారు. ఒకేసారి కోతలు, నూర్పిడి చేస్తుండటంతో అత్యధిక శాతం మంది యంత్రాలవైపే మొగ్గుచూపుతున్నారు. రైతుల అవసరాన్ని ప్రైవేట్ వ్యక్తులు ఆసరాగా చేసుకుని ధరలు ఇష్టారాజ్యంగా పెంచుతున్నారు.

**నియంత్రణకు కృషి చేస్తాం – క్రిష్ణయ్య, ఇన్‌ఛార్జి జేడీఏ**

వరికోత నూర్పిడి యంత్రాల యజమానులు, ఏజెంట్లతో సమావేశం నిర్వహించి ఇష్టారాజ్యంగా ధరలు పెంచకుండా నియంత్రించేలా కృషి చేస్తాం. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

# పౌష్టికాహార సరఫరాలో మాయాజాలం

అనంతపురం : అంగన్‌వాడీ కేంద్రాలకు ఇచ్చే బియ్యం, కందిపప్పు, వంట నూనె.. తదితర పౌష్టికాహారం సరఫరాలో మాయాజాలం నెలకొంది. కేంద్రాల సిబ్బంది నిర్దేశిత ఇండెంట్ ప్రకారం సరకులు ఇవ్వడం లేదు. ఇదే విషయాన్ని సూపర్‌వైజర్లు, సీడీపీఓలు సైతం జిల్లా అధికారులకు నివేదించినా ఫలితం శూన్యం. ఇది నేరుగా లబ్ధిదారులపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. చాలా చోట్లా సిబ్బందితో లబ్ధిదారులు గొడవకు దిగుతున్నారు. ఇటీవల కలెక్టర్ ఆనంద్ నిర్వహించిన సమీక్షలోనూ కొందరు సీడీపీఓలు ప్రస్తావించారు. పౌర సరఫరాల అధికారులతో మాట్లాడి ఈ తరహా సమస్య పునరావృతం కాకుండా చూస్తామని కలెక్టర్ అన్నారు. అయినా లెక్కల్లో తేడాలు తలెత్తుతున్నాయి.

**లబ్ధిదారులు ఎందరు.. ఏమి ఇస్తారు?**

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు 2302 ఉంటే.. వాటి పరిధిలో లబ్ధిదారులు 1,70,029 మంది ఉండగా.. గర్భిణులు 14,138, బాలింతలు 13,438, 0–6ఏళ్లలోపు పిల్లలు 1,42,453 ఉన్నారు. గర్భిణి/బాలింతలకు ప్రతి నెలా 3కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అరకిలో వంట నూనె ఇళ్లకే ఇవ్వాలి. పౌర సరఫరాల సంస్థ ద్వారా స్థానిక చౌకదుకాణ డీలర్ల ద్వారా కేంద్రాలకు పంపిణీ చేస్తారు. గుడ్లు, పాలు, కిట్లు.. వంటివి గుత్తేదారుల ద్వారా ఇస్తారు. డీలర్ల ద్వారా ఇచ్చే బియ్యం, కందిపప్పు, నూనె సరఫరాలో వ్యత్యాసాలు వస్తున్నాయి.

**సమీక్ష ఏదీ?**

అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే పౌష్టికాహారానికి సంబంధించి ప్రతి మూడునెలలకోసారి జేసీ అధ్యక్షతన ఐసీడీఎస్ పీడీ, సీడీపీఓ, పౌర సరఫరాల డీఎం, డీఎస్ఓ, గుత్తేదారులతో సమీక్ష జరగాలి. ఇండెంటు, సరఫరా, పంపిణీ.. తదితర అంశాలు ప్రస్తావనకు రావాలి. ఏ నెలోనైనా ఆలస్యంగా సరఫరా జరిగిందా. ఇండెంటు తక్కువ ఇచ్చారా.. అనేదానిపై చర్చ జరగాలి. అసలు సమీక్షలే జరగడం లేదు.

**విచారణ చేయిస్తున్నాం – శివనారాయణ శర్మ, జేసీ**

పౌష్టికాహారానికి సంబంధించి తరచూ ఆరా తీస్తున్నాం. చరవాణి, వీసీల ద్వారా సమీక్షిస్తున్నాం. ఇటీవల పౌర సరఫరాలపై విచారణ చేశాం. కొన్ని కేంద్రాలకు సరిగ్గా ఇవ్వడం లేదు. నిల్వల్లో తేడాలపైనా విచారిస్తున్నాం. బాధ్యులపై తప్పక చర్యలు ఉంటాయి.
మచ్చుకు కొన్ని ఇలా..!
జిల్లాలో మొత్తం 2,302 కేంద్రాలు ఉంటే.. సెప్టెంబరులో 2,220, అక్టోబరులో 2,229, నవంబరులో 2,272 కేంద్రాలకే 3కిలోల బియ్యం ప్యాకెట్లు ఇచ్చారు. కందిపప్పు, నూనె విషయంలోనూ తేడా ఉంటోంది.
సెప్టెంబరులో 26,572 క్వింటాళ్ల బియ్యం కావాలని ఇండెంటు పెడితే 26,08 క్వింటాళ్లు పంపిణీ చేసినట్లు సిబ్బంది స్వీకరణ ఆమోదం ఇచ్చారు. 484 క్వింటాళ్ల లెక్క తేలలేదు. లీటరు ప్యాకెట్ల నూనెలో 11,164 లీటర్లకు 10,843 లీటర్లే కేంద్రాలకు చేరింది.
అక్టోబరులో 23,275 క్వింటాళ్లకు 21,950 క్వింటాళ్లు తీసుకున్నట్లు నమోదైంది. 1325 క్వింటాళ్లు తేలాల్సి ఉంది. కందిపప్పు కూడా 692 కిలోల తేడా ఉంది.
నవంబరులోనూ అదే తీరు. 3కిలోల బియ్యంలో 25,200 క్వింటాళ్లకు 24,579 క్వింటాళ్లే ఇచ్చారు.

## ఊరికో రేవు.. ఉచితం కరవు

పెళ్లకూరు : రెవెన్యూ, పోలీసుశాఖల వైఫల్యంతో స్వర్ణముఖిలో విచ్చలవిడిగా ఇసుక అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. కొందరు నాయకుల అండతో మాఫియాదారులు రెచ్చిపోతున్నారు. అడ్డుకుంటున్న స్థానికులపై దౌర్జన్యానికి దిగుతున్నారు. స్థానిక అవసరాలకు మాత్రమే నదీతీరంలోని రేవుల్లో ఉచితంగా ఇసుక తీసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. భారీ భవంతులు, ప్రాజెక్టులు, ఇతర వాణిజ్య అవసరాలకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికార ఇసుక యార్డుల నుంచి తీసుకోవాల్సి ఉంటుంది. కలవకూరు, గూడలి ప్రాంతాల్లో అధికారికంగా తీసిన ఇసుక ఓవైపు పొరుగు రాష్ట్రాలకు అక్రమంగా పంపిస్తుండగా అనధికారికంగా మరికొందరు తరలిస్తున్నారు.

**నెలనెలా మామూళ్లు**



ఉచిత ఇసుకను ఆసరాగా చేసుకొని కొందరు నాయకులు గ్రామాల పరిధిలో ఎవరికివారు అనధికార రీచ్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. అధికారులు నెలనెలా మామూళ్లు తీసుకొని తవ్వకాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారు. ఇందులో కొందరు పోలీసుల ప్రమేయం ఉందన్నది వాస్తవం. నది పొర్లుకట్టలు ధ్వంసం చేసి బాటలు ఏర్పాటు చేసుకుంటున్నారు. నదీ తీరంలోని ఫిల్టర్ పాయింట్లు ధ్వంసం చేస్తున్నారు.అక్రమ తవ్వకాల గురించి పెళ్లకూరు తహసీల్దారు హరికృష్ణతో ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.


**తవ్వకాలు ఇక్కడే**

చిగురుపాడు, భీమవరం, అయ్యప్పరెడ్డిపాళెం, మూర్తిరెడ్డిపాళెం, మర్లపల్లి, అన్నమేడు, తుమ్మూరు, ఎల్.ఏ.సాగరం పాత బీడీకాలనీ తిమ్మాజీకండ్రిగ కాజివే ప్రాంతాలు పెన్నేపల్లి, దిగువచావాలి, పెళ్లకూరు రాజిగారితోట, యడపూడి పెరుమాళ్లపల్లి, కలవకూరు చింతపూడి, పుల్లూరు, రావులచావు.

## విద్యాశక్తి.. గురువుల్లో అనాసక్తి!

లకొల్లు : ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో రాణించేలా శిక్షణ ఇచ్చేందుకు కూటమి ప్రభుత్వం 'విద్యాశక్తి' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. రూ.లక్షలు వెచ్చిస్తేగానీ లభించని శిక్షణను ఆన్‌లైన్ ద్వారా 6 నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు అందించేలా మద్రాస్ ఐఐటీతో ఒప్పందం చేసుకుంది. నిపుణులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా లేదా రికార్డు చేసి పాఠ్యాంశాలతో బోధన సాగించేలా ఏర్పాట్లు చేసింది. ఈ కార్యక్రమం అమలులో జిల్లా పూర్తిగా వెనుకబడింది. పలు ఉపాధ్యాయ సంఘాలు ఈ కార్యక్రమాన్ని బహిష్కరించడమే దీనికి కారణంగా కనిపిస్తోంది.

**అదనపు భారమని..** విద్యాశక్తి కార్యక్రమం అమలును కొందరు ఉపాధ్యాయులు అదనపు భారంగా భావిస్తున్నారు. తెరపై నిపుణుల బోధన సమయంలో పర్యవేక్షణ విధులతో పాటు దానికి సంబంధించిన ఫీడ్‌బ్యాక్‌ను యాప్‌లో పొందుపరచడం, ఫొటోలు తీయడం, విద్యార్థుల



స్పందనను ఆన్‌లైన్ చేయడం వంటి పనులు చేయాల్సి వస్తోందని యూటీఎఫ్ జిల్లా కోశాధికారి క్రాంతికుమార్ చెబుతున్నారు.

**ఇలా చేస్తే మేలు..** ఆన్‌లైన్‌లో బోధనను నోచుకోని విద్యార్థుల కోసం విద్యాశక్తి పాఠ్యాంశాలకు సంబంధించిన లింకులను ఏరోజుకారోజు తరగతుల వారీగా వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేయడం మేలని యలమంచిలి ఎంఈవో కేవీఆర్ కృష్ణరాజు పేర్కొన్నారు. వీటిని అనుసరించి ఖాళీ సమయాల్లో విద్యార్థులు తరగతులు వినాలని సూచించారు. కనీసం దీనినైనా ఉపాధ్యాయులు పర్యవేక్షిస్తే కొంత వరకు ఫలితాలు బాగుండే అవకాశం ఉంది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించాల్సి ఉంది.

**137 పాఠశాలల్లో..** ప్రతి మండలంలో మూడు లేదా నాలుగు చొప్పున జిల్లా వ్యాప్తంగా 137 ఉన్నత పాఠశాలలను ఈ కార్యక్రమానికి ఎంపిక చేశారు. రోజూ సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య, లేదా ఉదయం వేళ తరగతులకు ముందు డిజిటల్ తెరపై నిపుణులు బోధించే పాఠాలను విద్యార్థులు వినాల్సి ఉంటుంది. ప్రతి తరగతికి నిత్యం రెండు సబ్జెక్టులు ఎంపిక చేసి వాటిలో అంశాలను బోధిస్తారు.

## ఈ రోడ్లు బాగు పడతాయ్!

కొయ్యలగూడెం : ఉమ్మడి జిల్లాలో ర.భ.శాఖ పరిధిలోని మరిన్ని రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. జిల్లా ప్రధాన రహదారులు, రాష్ట్ర రహదారు(స్టేట్ హైవే)ల విభాగాల్లో ఏలూరు జిల్లాలో రూ.15.59 కోట్ల అంచనాతో కీలకమైన ఆరు పనులకు, పశ్చిమగోదావరిలో రూ.36.50 కోట్ల విలువైన తొమ్మిది పనులకు అనుమతి మంజూరైంది. వీటిలో వైకాపా ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు పనుల్లో సాంకేతిక ఇబ్బందుల కారణంగా రద్దయిన పనులున్నాయి. కూటమి ప్రభుత్వం ఆ సమస్యను పరిష్కరించి నిధులు మంజూరు చేయడంతో గ్రామీణ రహదారులకు మోక్షం లభించింది. పనులు టెండర్ల దశలో ఉన్నాయని ర.భ. శాఖాధికారులు తెలిపారు.


**ఏలూరు జిల్లా ప్రధాన రహదారుల విభాగంలో..**

జిలుగుమిల్లి మండలం బర్రింకలపాడు- పూచికపాడు రహదారికి 11.20 కి.మీల పనులకు రూ.3.60కోట్లు, కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెం- రేగులకుంట రహదారిలో కిచ్చప్పగూడెం సమీపంలోని పులి వాగు(భీముడు అడుగు) నుంచి దిప్పకాయలపాడు, మంగపతిదేవిపేట, పోలవరం మండలం రేపల్లెవాడ నుంచి పోలవరం తాలూకా కార్యాలయం వరకు 12.870కి.మీల వరకు రూ.3.30కోట్లు మంజూరయ్యాయి.

**రాష్ట్ర రహదారులలో..**

దెందులూరు- పంగిడిగూడెం(ఎస్‌హెచ్ 224)రహదారిలో 5.28 కి.మీల మేర పనులకు రూ.2 కోట్లు, నడుపూరు-వడవల్లి-కోరుకొల్లు(ఎస్‌హెచ్ 310) రహదారిలో 2.40కి.మీల పొడవున పనులకు రూ.1.55కోట్లు, ఏలూరు-మేడిశెట్టివారిపాలెం(ఎస్‌హెచ్ 020) రహదారికి రూ.1.34 కోట్లు మంజూరయ్యాయి.

# ఆవిష్కరణలు.. అందిపుచ్చుకునేలా!



విశాఖపట్నం: వైద్య సాంకేతికతలో వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహిస్తున్న ఏపీ మెడ్‌టెక్ జోన్ (ఏఎంటీజెడ్) ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. దీంతో దేశ, విదేశాల్లోని ప్రముఖ సంస్థలు ఇక్కడకు వచ్చేందుకు ఆసక్తి కనబరుస్తున్నాయి. ఇటీవల కొన్ని సంస్థలు మెడ్‌టెక్ జోన్‌తో అవగాహన ఒప్పందాలు (ఎంవోయూలు) చేసుకున్నాయి. దీంతో ఇక్కడ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, వైద్య సాంకేతికత రంగంలో పరిశోధనలు వేగవంతం కానున్నాయి.

**ఒకే వేదికపై వివిధ రంగాలు**

ప్రపంచంలో అగ్రస్థానంలో ఉన్న వంద విశ్వవిద్యాలయాల్లో ఒకటైన యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ ఆస్ట్రేలియా (యూడబ్ల్యూఏ) మెడ్‌టెక్ జోన్‌లో కేంద్రం ఏర్పాటు చేయనుంది. ఈ కేంద్రం విద్యా కార్యక్రమాల మార్పిడి, పరిశ్రమల సహకారం, ఆవిష్కరణలకు వేదికగా పనిచేయనుంది. తద్వారా విశాఖ గ్లోబల్ హెల్త్ టెక్నాలజీ సహకార కేంద్రంగా స్థిరపడనుంది. మెడ్‌టెక్, సముద్ర విజ్ఞానం, రక్షణ, సుస్థిరాభివృద్ధి, వ్యవసాయం, డేటా సైన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి రంగాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చి.. ప్రపంచవ్యాప్త సవాళ్లకు పరిష్కారం చూపాలని లక్ష్యంగా పెట్టుకుంది. వివిధ రంగాల్లో భవిష్యత్తు ఉద్యోగావకాశాలను అందుకునేలా విద్యార్థులు, వృత్తి నిపుణులను సిద్ధం చేసేందుకు ఇక్కడ ప్రత్యేక కార్యక్రమాలు అందించనున్నారు. సంయుక్త పరిశోధన, దేశంలోని అగ్రస్థాయి మెడ్‌టెక్ సంస్థల్లో ఇంటర్న్‌షిప్ ద్వారా విద్యార్థులు, పరిశోధకులకు కొత్త అవకాశాలు రానున్నాయి.

**పరిశోధనల మెరుగుకు**

దిల్లీకి చెందిన ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ మేనేజ్‌మెంట్ రీసెర్చ్ (ఐఐహెచ్‌ఎంఆర్) ప్రజారోగ్యం, అనుబంధ రంగాల్లో నిర్వహణ, నాయకత్వ సామర్థ్యాలను పెంపొందించడానికి కృషి చేస్తోంది. భారత్‌లో కీలకమైన మెడ్‌టెక్ పర్యావరణ వ్యవస్థ (ఎకో సిస్టమ్)ను బలోపేతం చేసేందుకు ఆ సంస్థ మెడ్‌టెక్ జోన్‌లో ఉపగ్రహ కేంద్రాన్ని ఏర్పాటు చేయనుంది.

తద్వారా మెడ్‌టెక్ రంగంలో విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశోధనలు మరింత మెరుగుపడేందుకు వీలుంటుంది. పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్య కోర్సులు, ఎగ్జిక్యూటివ్ విద్యా కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు విద్యా సంస్థలు, పరిశ్రమల మధ్య సహకారం బలోపేతమవుతుంది. **సంయుక్తంగా మాస్టర్ ప్రోగ్రాంలు..** ఆమ్‌స్టర్‌డామ్‌లోని వ్రిజె యూనివర్సిటీ (వీయూ) ఏఎంటీజెడ్‌లో ఎకోసిస్టమ్, ఆవిష్కరణ సామర్థ్యాలను వినియోగించుకోనుంది. ఇక్కడ నూతన సాంకేతికతను అభివృద్ధి చేయనుంది. అందుబాటు ధరలో రోగ నిర్ధారణ, వైద్య పరికరాల తయారీకి సంబంధించిన ఆలోచనలను ఆచరణరూపంలోకి తీసుకొచ్చే కార్యక్రమాలను వేగవంతం చేయనుంది. మెడ్‌టెక్ విశ్వవిద్యాలయంలో వీయూకు చెందిన మేనేజ్‌మెంట్, పాలసీ అనాలసిస్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఇన్ హెల్త్ అండ్ లైఫ్ సైన్సెస్ తదితర మాస్టర్ ప్రోగ్రాంలను సంయుక్తంగా అందిస్తాయి. విద్యార్థులు ఆయా కోర్సులు నేర్చుకోవడంతోపాటు ఇంటర్న్‌షిప్‌లు పొందొచ్చు.

# అందరికీ శుద్ధజలం.. అందని ద్రాక్ష



కుప్పం : దేవుడు కరుణించినా.. సామెతలా తయారైంది ఎన్టీఆర్ సుజల ప్రాజెక్టు పరిస్థితి. గత ప్రభుత్వం పథకంపై నిర్లక్ష్యం వహించడంతో శుద్ధజల కేంద్రాలు చాలాచోట్ల మూతపడ్డాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటి నిర్వహణ, యంత్రాల మరమ్మతుకు నిధులు మంజూరు చేసింది. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కొరవటంతో పనులు నెమ్మదించాయి. అందరికీ శుద్ధజలం అందని ద్రాక్షలా మారింది. కుప్పంలో సీఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక చొరవతో పైలట్ ప్రాజెక్టుగా పదేళ్ల కిందట ఎన్టీఆర్ సుజల ప్రాజెక్టును ప్రారంభించారు. అప్పట్లో రూ.22 కోట్లతో 16 మదర్ ప్లాంట్ల నిర్మాణం చేపట్టి వాటి ద్వారా నియోజకవర్గంలోని 202 పంపిణీ కేంద్రాల ద్వారా ప్రజలకు రూ.2కే 20 లీటర్ల శుద్ధజలం అందించేవారు. వైకాపా అధికారంలోకి వచ్చాక పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. పథకానికి పేరు మార్చి పార్టీ రంగులు పూశారు. రూ.2కే అందే నీటిని రూ.5కు పెంచారు. యంత్రాలు మరమ్మతుకు గురైనా పట్టించుకోకపోవడంతో క్రమంగా పంపిణీ కేంద్రాలన్నీ మూతపడ్డాయి.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సుజల ప్రాజెక్టుకు పూర్వవైభవం తీసుకురావడానికి రూ.10.32 కోట్లు మంజూరు చేసింది. **ఏజెన్సీకి రెన్యూవల్..**

పథకం నిర్వహణను ఏసర్ కంపెనీకి ప్రభుత్వం అప్పగించింది. రూ.2కే 20 లీటర్ల నీటిని ఇవ్వడంతో నష్టపోయామని చెప్పడంతో మరో సంవత్సరం పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం ఇచ్చింది. పెండింగ్‌లో ఉన్న రూ.5.5 కోట్లను మంజూరు చేసింది. ప్రస్తుతం 16 మదర్ ప్లాంట్లలో 11 ప్లాంట్లకు మరమ్మతులు చేసి, 202 శుద్ధజల పంపిణీ కేంద్రాల్లో 71 బాగుచేసి సరఫరా చేస్తున్నారు.

**5జీకి ప్రతిపాదనలు..** నియోజకవర్గంలోని శుద్ధజల పంపిణీ కేంద్రాల్లో ఉపయోగిస్తున్న సాఫ్ట్‌వేర్‌ను 2జీ నుంచి 5జీకి మార్చేందుకు, ప్లాంటు పెయింటింగ్, మరమ్మతులు, లోగో ఏర్పాటుకు మరో రూ.2 కోట్లకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. జనవరిలోపు పూర్తిస్థాయిలో బాగుచేసి ప్రజలకు శుద్ధజలం అందేలా చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్, డీఈ పురుషోత్తం పేర్కొన్నారు.

# వసతిగృహాల్లో ఆరోగ్యం ఎక్కడ?



చిత్తూరు : ఏడాదిన్నర కిందట చిత్తూరులోని ఓ సంక్షేమ వసతిగృహంలో 8వ తరగతి బాలిక తీవ్ర అనారోగ్యానికి గురైంది. వార్డెన్లు ప్రాథమిక చికిత్సతో సరిపెట్టారు. తీవ్ర అస్వస్థతకు గురికావడంతో తల్లిదండ్రులు ప్రైవేటుగా వైద్యం చేయించినా బాలిక మృతి చెందింది. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వారి రక్త నమూనాలు సేకరించాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రతి విద్యార్థికి డిజిటల్ కార్డు రూపొందించాలని పేర్కొన్నా రక్త నమూనాల సేకరణ పూర్తిస్థాయిలో జరగడం లేదు.

వైకాపా హయాంలో సంక్షేమ వసతిగృహాలు అధ్వానంగా మారాయి. ఆర్వో ప్లాంట్లు, మరుగుదొడ్లు, వైద్య శిబిరాల నిర్వహణ లేదు. కూటమి ప్రభుత్వం రాగానే వసతిగృహాలను బాగు చేసే పని ప్రారంభించింది. నిధులు మంజూరు చేయడంతో పాటు కలెక్టర్ల ద్వారా సీఎస్‌ఆర్ నిధులతో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతిగృహాల్లో మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణం, గదుల పెచ్చులు ఊడకుండా బాగు చేయడం, తలుపులు, కిటికీలకు మెస్‌లు ఏర్పాటు చేశారు. ఇటీవల జిల్లాలోని ఏడు వసతిగృహాల్లో రూ.2 లక్షలతో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. మిగిలిన వాటిలో ఏర్పాటు చేయాల్సి ఉంది.

**తీవ్రతను బట్టి పరీక్షలు**

వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మాత్రం సాధారణ జబ్బులైన జ్వరం, దగ్గు, జలుబు, దంత, చర్మం వంటి వ్యాధులకు ప్రాథమిక చికిత్స అందిస్తున్నామని, తీవ్రతను బట్టి రక్త నమూనాలు సేకరించి తగిన వైద్య సేవలు అందిస్తున్నట్లు చెబుతున్నారు. డిజిటల్ హెల్త్ కార్డుల ప్రక్రియను ప్రారంభించామని స్పష్టం చేశారు.

**నిత్యం పర్యవేక్షిస్తున్నాం..: విక్రమ్‌కుమార్‌రెడ్డి, సాంఘిక సంక్షేమాధికారి**

వసతిగృహాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నాం. వార్డెన్లతో సమీక్షించి పరిస్థితులు తెలుసుకుంటున్నాం. నేరుగా తనిఖీలు చేస్తున్నాం. జిల్లాలో ఏడు వసతిగృహాల్లో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. మిగిలిన వాటిలోనూ ఏర్పాటు చేయిస్తాం.

## ఇంటర్ పరీక్ష తీరు మారింది

కర్నూలు : ఇంటర్మీడియట్ సిలబస్‌తో పాటు పరీక్ష విధానంలో ఎన్సీఈఆర్‌టీ కొత్త నిబంధనల మేరకు సవరణలు చేశారు. దీంతో ఇంటర్‌లో విద్యార్థులు ఏ గ్రూప్ చదివినా.. నీట్, జేఈఈ రాసే అవకాశం ఉంటుంది. దీనిపై ఇప్పటికే కళాశాలల ప్రిన్సిపాళ్లు, పాఠ్యాంశ నిపుణులతో సమావేశాలు నిర్వహించారు. ఫిబ్రవరి 23వ తేదీ నుంచి మార్చి 23వ తేదీ వరకు ఇంటర్ పబ్లిక్ పరీక్షలు నిర్వహించే విధంగా రాష్ట్ర ఇంటర్ బోర్డు పరీక్షల షెడ్యూల్‌ను విడుదల చేసింది.దీనికి అనుగుణంగానే విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు.

**గణితంలో వంద మార్కులు**

గణిత పేపర్ 1990లో 150 మార్కులకు ఉండేది. తర్వాత దీన్ని గణితం-1ఎ, 1బిగా మార్చారు. ఒక్కో పేపర్‌కు 75 మార్కుల చొప్పున రెండు పేపర్ల విధానాన్ని ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చారు. తాజాగా గణితంలో ఒకే పపర్ విధానం



అమలు చేస్తున్నారు. దీన్ని వంద మార్కులకు కుదించడం గమనార్హం.

**జవాబుల పత్రంలో పెరిగిన పేజీలు**

గతంలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు జవాబులు రాసేందుకు 24 పేజీల బుక్‌లెట్‌ను ఇచ్చే వారు. ఈ ఏడాది నుంచి ఈ బుక్‌లెట్‌లో పేజీల సంఖ్యను 32కు పెంచారు. ప్రశ్నల సంఖ్య పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

భౌతిక, రసాయనశాస్త్రాలకు కలిపి 85 మార్కుల ప్రశ్నపత్రం ఇస్తారు. ఇందులో 1, 2, 4, 8 మార్కుల ప్రశ్నలు ఉంటాయి. మిగిలిన 15 మార్కులు ప్రాక్టికల్స్‌కు ఉంటాయి. 85కు 29 మార్కులు వస్తే ఉత్తీర్ణత సాధించినట్లే.

**సవరణ ఇలా..**

గతంలో ఎంపీసీలో గణిత 1ఎ, 1బి, 2ఎ, 2బి ప్రశ్నపత్రాలు ఉండేవి. వీటిలో ఒక్కో ప్రశ్నపత్రానికి 75 మార్కులు ఉండేవి. ఇలా మొదటి ఏడాది 150, రెండో ఏడాది 150 మార్కులు చొప్పున ఉండేవి. ప్రస్తుతం మొదటి ఏడాదికి వంద, రెండో ఏడాదికి 100 మార్కులకే ప్రశ్నపత్రాలు రూపొందించారు.

బైపీసీలో బోటనీకి 60, జువాలజీకి 60 మార్కులు ఉండేవి. ఇప్పుడు రెండూ కలిపి (బోటనీకి 43 మార్కులు, జువాలజీకి 42 మార్కులు) 85 మార్కులకు పరిమితం చేశారు.

ఫిజిక్స్‌కు 60, కెమిస్ట్రీకి 60 మార్కులకు చొప్పున ప్రశ్నపత్రం ఉండేది. ప్రస్తుతం రెండింటినీ 85 మార్కులకే ఇస్తారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో ప్రాక్టికల్స్‌కు 15 మార్కులు చొప్పున కేటాయించారు. గతంలో 2, 4, 8 మార్కుల ప్రశ్నలు ఇచ్చేవారు. ఇప్పుడు 1, 2, 4, 8 మార్కుల ప్రశ్నలు ఇచ్చేలా ప్రశ్నపత్రాలకు రూపకల్పన చేశారు.

## నీటి బొట్టు.. ఒడిసి పట్టు

ఏలూరు: జిల్లాలో భూగర్భ జలాలు, నీటి మట్టాల పెంపే లక్ష్యంగా పొలాల్లో ఇంకుడు గుంతలు, చెక్‌డ్యాంలు నిర్మించాలని భూగర్భ జలవనరులశాఖ ప్రతిపాదించింది. ఈ ఏడాది మేలో భూగర్భ జలాలను కొలవగా జిల్లా సగటు 18.85 మీటర్లు ఉంది. అప్పట్లో నీటి మట్టం పైకి ఉంది. జిల్లాలో నిల్వలు ఎంతెంత ఉన్నాయో తెలుసుకోవటానికి జిల్లా వ్యాప్తంగా ఫీజో మీటర్ల యంత్రాలు నిర్దేశించిన ప్రదేశాల్లో ఏర్పాటు చేశారు. వాటి వద్ద ఎప్పటికప్పుడు అధికారులు నీటి స్థాయిలు కొలిచి జిల్లా సగటు చూస్తారు. గతేడాది నవంబరులో జిల్లా సగటు 17.56 మీటర్లు ఉండగా ఈ ఏడాది నవంబరులో 16.22 శాతం వచ్చింది. గతేడాది నవంబరు, ఈ ఏడాది మే నెలలో సరాసరి జిల్లా సగటుతో పోల్చి చూస్తే భూగర్భజలాలు స్వల్పంగా తగ్గాయనేది స్పష్టమౌతోంది. దీంతో అధికారులు అప్రమత్తమై వాటి పెంపుదలకు సూచనలు చేశారు.

**ప్రతినెలా 70 చోట్ల లెక్కలు**



వర్షాకాలం, శీతాకాలం, వేసవికాలం..ఇలా అన్ని కాలాల్లో భూగర్భజలాలు ఎంత లోతులో ఉన్నాయో కొలుస్తారు. జిల్లా పరిధి అంతా వచ్చేలా 70 బోరుబావుల నుంచి ప్రతి నెలా నీటి లభ్యతను నిర్ధారిస్తారు. వర్షాకాలం నీటి వాడకం తక్కువగా ఉంటుంది. భూమిలోకి ఇంకవు. దీంతో ఆ సీజన్లో కొంతమేర భూగర్భ జలాలు తక్కువగానే ఉంటాయని అధికారులు చెబుతున్నారు. ఎండా కాలంలో నీటి వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఎక్కువశాతం తోడటంతో నీటి మట్టాలు కిందకు పడిపోతాయి. దాన్ని దృష్టిలో పెట్టుకుని జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ భూముల్లో ఇంకుడు గుంతలు, చెక్‌డ్యాంల ఏర్పాటుతో జలాలు వృద్ధి చెందుతాయని అధికారులు తెలిపారు.

**జలాల వృద్ధికి..**

పలు చెరువుల్లో పూడికలు తీయడంతోపాటు 924 బోరుల్లోకి నీళ్లు పంపించి వాటిల్లో జలాలు వృద్ధి చెందటానికి చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు. 1619 చెక్ డ్యామ్‌లు, 75 వేల ఇంకుడుగుంతలు నిర్మించాలని ప్రతిపాదించారు. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో ఇసుక నేలలు ఉండటంతో అక్కడ కొంతమేరకు జలాలు తక్కువగా ఉన్నాయి. ద్వారకాతిరుమల మండలంలోనూ ఇదే పరిస్థితి. కొయ్యలగూడెం తదితర మండలాల్లో నీటి లభ్యత బాగానే ఉందని, ఇక్కడ కొండగుట్టలు, అటవీ ప్రాంతం ఉండటమే ఇందుకు కారణంగా నిపుణులు చెబుతున్నారు.

చురకలు



## అచ్చియమ్మ ఆయన అమ్మమ్మ పేరా?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటగా బుచ్చిబాబు సానా పెద్ది చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో చరణ్ పెద్ది పాత్రలో కనిపించబోతున్నాడు. ఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్లతో చరణ్ పాత్ర ఎలా ఉంటుంది? అన్నది ఓ ఐడియా వచ్చింది. పూర్తి మాస్ కోణంలోసాగే రోల్ గా హైలైట్ అవుతుంది. అలాగే జాన్వీ కపూర్ అచ్చియమ్మ అనే అమ్మాయి పాత్రలో నటిస్తుంది. ఇందులో మోడ్రన్ అచ్చియమ్మగా కనిపిస్తుంది. %-%పెద్ది%-% ప్రేమికురాలి రోల్ అది. ఆ రెండు పాత్రల మధ్య రొమాన్స్ కూడా ఘాటుగానే ఉంటుందని ఇప్పటికే ప్రచారంలో ఉంది.

**అచ్చియమ్మ వెనుక కారణం:** అయితే జాన్వీకపూర్ పాత్రకు అచ్చియమ్మ అనే పేరు పెట్టడంతో విషయం ఆసక్తికరంగా మారింది. ప్రత్యేకంగా అచ్చియమ్మ అన్నది హైలైట్ గా మారింది. సాధారణంగా ఇలాంటి పేర్లు పాత సినిమాల్లో కనిపిస్తుంటాయి. ఆ తర్వాత కాలంలో కూడా




ఏ హీరోయిన్ కు ఇలాంటి పేరు పెట్టలేదు. ఎంత పాత సినిమాలు చేసినా పేర్ల వరకూ మోడ్రన్ గా ఉండేలా చూసుకునే వారు దర్శకులు. కానీ పెద్ది లో హీరోయిన్ పాత్ర పేరు మాత్రం ఇప్పుడు హైలైట్ గా మారింది. ప్రత్యేకంగా అచ్చియమ్మ అని పెట్టడానికి గల కారణాలు ఏంటి? అని ఆరాలు మొదలయ్యాయి.

**స్వచ్ఛమైన తెలుగు పేరు:** ఈ నేపత్యంలో హీరోయిన్ పాత్ర అలాంటి పేరు డిమాండ్ చేయడంతో పాటు..బుచ్చిబాబు అమ్మమ్మ గారి పేరు కూడా అచ్చియమ్మ అని ఫిలిం సర్కిల్స్ లో మాట్లాడుకుంటున్నారు. ఈనేపథ్యంలో జాన్వీ కపూర్ పాత్ర కు గుర్తుగా అచ్చియమ్మ అని పేరు పెట్టారని చర్చ జరుగుతుంది. మరి ఇందులో నిజమెంత? అన్నది తేలాలి. ఏది ఏమైనా ఈ పేరు పెట్టడం అన్నది పెద్ద సాహసమే. %-%రంగస్థలం%-%లో హీరోయిన్ సమంత పక్కా పల్లెటూరి అమ్మాయి పాత్రలో కని పిస్తుంది. ఆ పాత్రకు సుకుమార్ రామలక్ష్మి అని పేరు పెట్టారు. పల్లెటూరి అమ్మాయికి ఎంతో స్వచ్ఛమైన పేరు.

**సుకుమార్ కంటే మూలాల్లోకి:** అందులో తెలుగుదనం ఉట్టి పడుతుంది. ఇప్పుడు సుకుమార్ శిష్యుడు అంతకు మించి తెలుగు దనం హైలైట్ అయ్యేలా పాత్రల పేరు పరంగా ఇంకా మూలాల్లోకి వెళ్లినట్లు కనిపిస్తోంది. అచ్చియమ్మ అన్నది టైటిల్ కార్డ్సులో పడుతుంది. సినిమాలో అదే పేరును అచ్చెమ్మ అని కూడా పిలిచే అవకాశం ఉ ంటుంది. ప్రస్తుతం పెద్ది ఆన్ సెట్స్ లో ఉన్న సంగతి తెలిసిందే. 60 శాతం చిత్రీకరణ పూర్తయింది. అన్ని పనులు పూర్తి చేసి మార్చిలో లో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు.

## అందాలతో ఉక్కిరి బిక్కిరి చేస్తున్న నర్గీస్ ఫక్రీ!

సెలబ్రిటీలు అంటే ఎప్పుడు గ్లామర్ లుక్ లోనే కాకుండా.. అప్పుడప్పుడు సాంప్రదాయంగా కూడా కనిపిస్తూ అందరిని ఆశ్చర్యపరుస్తూ ఉంటారు. అందులో భాగంగానే కొంతమంది చీర కట్టుకుంటే.. మరికొంతమంది లెహంగా ధరించి తమ అందాలతో ఉక్కిరిబిక్కిరి చేస్తూ ఉంటారు. ఈ క్రమంలోనే తాజాగా తన అందాలతో మరొకసారి ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేసింది ప్రముఖ బ్యూటీ. ఈమె బాలీవుడ్ లో తన అందాలతో ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా నటనతో అంతకుమించి పెర్ఫార్మెన్స్ కనబరుస్తూ అభిమానుల హృదయాలను దోచుకుంటోంది. తాజాగా పీచ్ కలర్ లెహంగా ధరించి తన అందాలతో అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. హెవీ ఎంబ్రాయిడరీ తో డిజైన్ చేసిన ఈ లెహంగా అటు అబ్బాయిలనే కాదు అమ్మాయిలను, ఫ్యాషన్ ప్రియులను కూడా ఆకట్టుకుంటుంది అని చెప్పవచ్చు. ఇంతకీ ఆమె ఎవరనుకుంటున్నారా ప్రముఖ బాలీవుడ్ బ్యూటీ నర్గీస్ ఫక్రీ. చాలా హెవీ ఎంబ్రాయిడరీ తో డిజైన్ చేసిన ఈ



లెహంగా ఈమె అందాన్ని మరింత రెట్టింపు చేసింది అనడంలో సందేహం లేదు. ఏదేమైనా నర్గీస్ ఫక్రీ తాజాగా షేర్ చేసిన ఈ గ్లామర్ ఫోటోలు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. నర్గీస్ ఫక్రీ కెరియర్ విషయానికొస్తే.. 1979 అక్టోబర్ 20వ తేదీన జన్మించిన ఈమె అమెరికన్ కి చెందిన భారతీయ మోడల్గా తన కెరీర్ ను మొదలుపెట్టిన ఈమె.. నటిగా 2011లో రాక్ స్టార్ అనే సినిమాతో సినీ రంగంలోకి అడుగు పెట్టింది. మొదటి సినిమాతోనే ఉత్తమ నటన కనబరిచి ఉత్తమ మహిళా నటిగా ఫిలింఫేర్ అవార్డుకు ఎంపికయింది. బాలీవుడ్లో చాలా సినిమాలలో చేసి ప్రేక్షకులను ఆకట్టుకునే ఈమె ఈ ఏడాది పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా జ్యోతి కృష్ణ దర్శకత్వంలో వచ్చిన హరిహర వీరమల్లు సినిమాలో నటించి ఆకట్టుకుంది. ఇక ఈ చిత్రాన్ని డీవీవీ బ్యానర్ పై డీవీవీ దానయ్య భారీ బడ్జెట్లో నిర్మించారు. అటు పవన్ కళ్యాణ్ కూడా ఆంధ్రప్రదేశ్ కి డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రిలీజ్ చేసిన మొదటి చిత్రం ఇది.





## ఆఫ్రో టపాంగ్ సాంగ్.. ఆ వేషాలే సంథింగ్ స్పెషల్



శివరాజ్ కుమార్, ఉపేంద్ర, రాజ్ బి శెట్టి వంటి అగ్ర నటులతో అర్జున్ జన్య తెరకెక్కిస్తున్న చిత్రం 45 ది మూవీ. సూరజ్ ప్రొడక్షన్స్ పతాకంపై శ్రీమతి ఉమా రమేష్ రెడ్డి, ఎం రమేష్ రెడ్డి భారీ ఎత్తున నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకు వచ్చిన పోస్టర్, గ్లింప్స్ భారీ హైప్‌ను సృష్టించాయి. ఈ చిత్రాన్ని డిసెంబర్ 25న విడుదల కానుంది. తాజాగా ఈ చిత్రం ఓ క్రేజీ సాంగ్‌ను విడుదల చేసారు. గెలుపు తలుపు దొరికే వరకు దిగులుపడుకురా.. అంటూ సాగే ఈ క్రేజీ సాంగ్‌కు రోల్ రైడా తెలుగులో సాహిత్యాన్ని అందించారు. రోల్ రైడా, వినాయక్ కలిసి ఆలపించిన ఈ పాటకు జానీ మాస్టర్ క్రేజీ స్టెప్పుల్ని కంపోజ్ చేశారు. ఈ వీడియో సాంగ్‌లోని వాతావరణం, చుట్టూ కనిపిస్తున్న ఆఫ్రికన్స్ తో జానీ మాస్టర్ వేయించిన స్టెప్పులు అదిరిపోయాయి. ఇక ఈ పాటలో శివ రాజ్ కుమార్, ఉపేంద్ర, రాజ్ బి శెట్టి విభిన్న అవతారాల్లో క్రేజీగా కనిపిస్తున్నారు. ఉపేంద్ర ఎప్పటిలాగే పిలకముడి, ఒళ్లంతా పచ్చ బొట్లు రంగు రంగుల డిజైనర్ డ్రెస్ లో వెరైటీగా కనిపించగా, రాజ్ బి శెట్టి కోయ దొర వేషంలో కనిపించాడు. కొంచెం హాస్యం, కొంచెం వెరైటీ, చాలా ఎనర్జీతో పాట ఆద్యంతం ఆకట్టుకుంది. కొంత మోడ్రన్ లుక్ లో శివన్న కనిపిస్తున్నాడు. ఈ పాటకు అర్జున్ జన్య ఇచ్చిన బాణీ కూడా చాలా డిఫరెంట్‌గా ఉంది. ప్రస్తుతం ఈ పాట యూత్‌ను విపరీతంగా ఆకర్షిస్తోంది. ఈ సినిమాకు డాక్టర్ కె రవి వర్మ, జాలీ బాస్టియన్, డిఫరెంట్ డానీ చేతన్ డిసౌజా స్టంట్స్ కొరియోగ్రాఫ్ చేయగా, అనిల్ కుమార్ మాటల్ని అందించారు. సత్య హెగ్డే కెమెరామెన్‌గా, కె.ఎం. ప్రకాష్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. త్వరలోనే అన్ని కార్యక్రమాల్ని పూర్తి చేసుకుని డిసెంబర్ 25న చిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు.

## 'పెద్ది' జాన్వీ లుక్.. పక్కా మాస్ క్యారెక్టర్




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో వస్తున్న 'పెద్ది' సినిమాపై అంచనాలు హై లెవెల్ లో ఉన్నాయి. ఇప్పటికే చరణ్ మేకోవర్, సినిమా బ్యాక్‌డ్రాప్ గురించి రకరకాల వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఇప్పుడు, ఆ అంచనాలను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్తూ, మేకర్స్ ఈ సినిమా నుంచి హీరోయిన్ జాన్వీ కపూర్ ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ఈ ఒక్క పోస్టర్‌తో జాన్వీ తన ఇమేజ్‌ను పూర్తిగా మార్చేసేలా కనిపిస్తోంది. జాన్వీ కపూర్ అనగానే మనకు గుర్తొచ్చేది బాలీవుడ్ గ్లామర్, ఫ్యాషన్ ఐకాన్. కానీ 'పెద్ది' కోసం ఆమె చేసిన మేకోవర్ చూసి అందరూ షాక్ అవుతున్నారు.

ఇది సింపుల్ డీ గ్లామ్ రోల్ కాదు, పక్కా మాస్ క్యారెక్టర్. శ్రీదేవి కూతురిగా 'అతిలోక సుందరి' ఇమేజ్ ఉన్న జాన్వీ, ఇప్పుడు 'అచ్చియమ్మ'గా పూర్తి మాస్ అవతార్‌లో కనిపించబోతోంది. ఇది ఆమె కెరీర్‌లోనే బిగ్గెస్ట్ ట్రాన్స్‌ఫర్మేషన్. ఇక నేడు రిలీజ్ చేసిన పోస్టర్ లో, ముఖ్యంగా ఓపెన్ టాప్ జీపుపై నిలబడి, జనం మధ్యలో అభివాదం చేస్తున్న లుక్ అదిరిపోయింది. ఆ కట్టుబొట్టు, ఆ సన్ గ్లాసెస్, ఆ బాడీ లాంగ్వేజ్ చూస్తుంటే, ఇది కేవలం హీరో పక్కన పాటలు పాడుకునే హీరోయిన్ పాత్ర కాదని, కథలో చాలా పవర్ ఉన్న రోల్ అని అర్థమవుతోంది. అందుకే మేకర్స్ ఆమె క్యారెక్టర్‌ను "ఫియర్స్ అండ్ ఫియర్‌లెస్" అని పిలుస్తున్నారు. డైరెక్టర్ బుచ్చిబాబు సానా తన గురువు సుకుమార్ స్టైల్‌లోనే, హీరోయిన్ పాత్రలను చాలా బలంగా డిజైన్ చేసినట్లున్నాడు. 'ఉప్పెన'లో 'బేబమ్మ' పాత్రకు ఎంత ఇంపార్టెన్స్ ఇచ్చాడో, ఇప్పుడు 'అచ్చియమ్మ' పాత్రను కూడా అంతే పవర్‌ఫుల్‌గా మలిచాడని ఈ లుక్ ప్రూవ్ చేస్తోంది. ఇది కేవలం లవ్ స్టోరీ కాదు, ఒక పల్లెటూరి సోషల్ డ్రామాలా కనిపిస్తోంది. బాలీవుడ్‌లో పీక్ స్టేజ్‌లో ఉన్న ఒక స్టార్ హీరోయిన్, సౌత్ సినిమాలో, అది కూడా పాన్ ఇండియా లెవల్‌లో ఇంత పూర్తిస్థాయి మాస్ రోల్ చేయడం పెద్ద ఛాలెంజ్. ఒకవేళ 'అచ్చియమ్మ' పాత్ర 'రంగస్థలం'లోని 'రామలక్ష్మి'లా పేలితే, జాన్వీ రేంజ్ ఇండియా వైడ్‌గా మారిపోతుంది. ఆమె కేవలం గ్లామర్ డాల్ కాదని, పెర్ఫార్మెన్స్‌తోనూ మెప్పించగలదని ప్రూవ్ చేసుకున్నట్లే. ఈ భారీ బడ్జెట్ సినిమాను వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నాయి. ఏఆర్ రెహమాన్ సంగీతంఅ అందిస్తున్న ఈ సినిమాకు రత్నవేలు లాంటి టాప్ టెక్నీషియన్స్ పనిచేస్తున్నారు. 2026 మార్చి 27న రానున్న ఈ సినిమాలో, చరణ్ మేకోవర్‌తో పాటు, 'అచ్చియమ్మ'గా జాన్వీ మాస్ పెర్ఫార్మెన్స్ కూడా నెవ్వర్ బిఫోర్ అనేలా ఉండనున్నట్లు అర్థమవుతుంది.

## శ్రీలీల.. ఎన్ని రోజులు ఇలా

ఒక హీరోయిన్ తొలి సినిమా ఫ్లాప్ అయితే.. మళ్లీ అవకాశాలు దొరకడం కష్టమే. కానీ శ్రీలీల విషయంలో మాత్రం దీనికి భిన్నంగా జరిగింది. తెలుగులో తన తొలి సినిమా 'పెళ్లి సంద-డి' డిజాస్టర్ అయినా.. అందులో తన అందచందాలు, డ్యాన్సులు యూత్‌కు బాగా నచ్చేశాయి. దీంతో తెలుగులో శ్రీలీలకు మంచి ఛాన్సులే వచ్చాయి. అందులోనూ రెండో చిత్రం 'ధమాకా' పెద్ద హిట్టయి శ్రీలీల డ్యాన్సులకు ఇంకా మంచి పేరు రావడంతో ఆమె వెనుదిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకపోయింది. కెరీర్ ఆరంభంలోనే ఏకంగా మహేష్ బాబుతో 'గుంటూరు కారం'లో జట్టు కట్టే ఛాన్స్ లభించింది. అది కాక స్కంద, భగవంత్ కేసరి లాంటి క్రేజీ ప్రాజెక్టుల్లో నటించే అవకాశం అందుకుంది శ్రీలీల. కానీ 'ధమాకా' తర్వాత కథానాయికగా ఆమెకు ఒక్కటంటే ఒక్క సక్సెస్ లేదు. పైగా ఆమె పాత్రలు రొటీన్ అయిపోతుండడం.. తన నటన తేలిపోతుండడంతో శ్రీలీల కెరీర్



డోలాయమానంలో పడేలా కనిపిస్తోంది. ఒక్క 'భగవంత్ కేసరి'లో తప్పితే శ్రీలీల పెర్ఫామెన్సుకి ఎందులోనూ ప్రశంసలు దక్కలేదు. ఆమెవి కూరలో కరివేపాకు తరహా పాత్రలుగానే ఉంటున్నాయి. హీరోతో రొమాన్స్, కామెడీ చేయడం.. పాటల్లో డ్యాన్సులేయడం.. ఇదీ వరస. మొదట్లో క్యూట్‌గా అనిపించిన తన పాత్రలు, నటన.. తర్వాత ప్రేక్షకులకు మొనాటనస్‌గా తోస్తున్నాయి. స్కంద, ఆదికేశవ, ఎక్స్‌ట్రార్డినరీ మ్యాన్, రాబిన్‌హుడ్, జూనియర్.. ఈ సినిమాలు వేటిలోనూ తన పాత్రకు ప్రాధాన్యం లేదు. నటన గురించి చెప్పుకోవడానికేమీ లేదు. ఆ జాబితాలోకి కొత్తగా 'మాస్ జాతర' కూడా వచ్చి చేరింది. ఇందులో శ్రీలీల పాత్ర, నటన తేలిపోయాయి. అసలే రవితేజ మార్కు రొటీన్ మాస్ మసాలా సినిమా.. అందులో వీక్ క్యారెక్టర్ పడడంతో శ్రీలీల మినిమం ఇంపాక్ట్ కూడా వేయలేకపోయింది. కేవలం డ్యాన్సుల్లో మాత్రం ఆమె మెరిసింది. కానీ సరైన పాత్ర, పెర్ఫామెన్స్ లేకుండా ఎన్నాళ్లిలా పాటల్లో మెరుపులతో సరిపెడుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సుధ కొంగర దర్శకత్వంలో రానున్న 'పరాశక్తి'లో మత్రం ఆమె కొత్తగా అనిపించే, పెర్ఫామెన్స్‌కు స్కోప్ ఉన్న పాత్ర చేస్తున్నట్లు కనిపిస్తోంది. అదైనా ఆమె కెరీర్‌ను మారుస్తుందేమో చూడాలి.

## జాక్ పాట్ కొట్టిన రష్మిక.. ఏకంగా డబుల్!

నేషనల్ క్రష్ రష్మిక మందన్న, కన్నడ హీరో దీక్షిత్ శెట్టి కాంబినేషన్లో రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన చిత్రం ది గర్ల్ ఫ్రెండ్. నవంబర్ 7వ తేదీన తెలుగు , హిందీ భాషలలో ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. నవంబర్ 14న తమిళ్, మలయాళం, కన్నడ భాషలలో విడుదల కాబోతున్న నేపథ్యంలో.. సినిమా ప్రమోషన్స్ లో జోరుగా పాల్గొంటున్నారు చిత్ర బృందం. అయితే ఈసారి ఏకంగా కనీ వినీ ఎరుగని రీతిలో ఈ చిత్ర నిర్మాతలు సినిమా గురించి, సిని మాలో హైలెట్ గా నిలిచిన అంశాల గురించి చెప్పి అందరిని ఆశ్చర్యప రిచారు. మరి వారి మాటల్లోనే ఈ సినిమా హైలెట్స్ ఏంటో ఇప్పుడు చూద్దాం.

**ది గర్ల్ ఫ్రెండ్ నిర్మాత ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ..** కోవిడ్ 19 సమయంలో థియేటర్లు క్లోజ్ అయ్యాయి. అయితే ఆ తరువాత థియేటర్స్ అన్ని అందుబాటులోకి వచ్చాయి. అప్పుడే స్క్రిప్ట్ డెవలప్ చేసే పనిలో పడ్డాం. ఈ ప్రాజెక్టు తీసుకున్నప్పటి నుంచి థియేటర్ గానే వెళ్లేందుకు ప్లాన్ చేసాము. ప్రొడ్యూసర్ గా.. కమర్షియల్ గా




మూవీ ఉండాలని కోరుకుంటాం కదా.. మేము రిస్క్ చేసినా పర్వాలేదు. స్టోరీ బాగుండాలి అనే నమ్మాను. మేము అనుకున్న దానికంటే స్టోరీ మమ్మల్ని మెప్పించింది. విద్యాతో కూడా నాకు మంచి స్నేహబంధం ఏర్పడింది. నిర్మాణ వ్యయంలో పూర్తి నిర్ణయం తీసుకోవడంలో ఎటువంటి ఇబ్బందులు ఏర్పడలేదు. లవ్ స్టోరీస్ ను ఎవరో ఒకరి పాయింట్ ఆఫ్ వ్యూలో చెప్పాలి. అయితే ఈ కథ హీరోయిన్ కోణంలోనే ఉంటుంది. అందుకే స్టార్స్ ని ఇందులో హీరోగా తీసుకోలేదు. పర్ఫామెన్స్ ని మెయిన్ గా తీసుకొని దీక్షిత్ తీసుకున్నాము. దీక్షిత్ చాలా మంచి పెర్ఫార్మర్ ఈ ఏజ్ గ్రూప్ వాళ్ళను కూడా నటించేలా ఆకట్టుకున్నాడు. థియేట్రికల్ గా ఈ సినిమా చాలా బాగా వర్క్ అవుట్ అవుతుందని నమ్ముతున్నాము. అటు దీక్షిత్ ను తీసుకోవడం వల్ల కన్నడ మార్కెట్ కు కూడా ఉపయోగపడుతుందని మేము అనుకోలేదు. ఆయన పాత్రకు ఆయన కరెక్ట్ గా సెట్ అవుతాడనే తీసుకున్నాము. అయితే రష్మిక , దీక్షిత్ కలిసి ఇందులో నటించడం వల్లే మాకు కన్నడలో కూడా అడ్వాంటేజ్ ఏర్పడింది. ఈ సినిమా రిలీజ్ తర్వాత మరో కొత్త ప్రాజెక్టు కూడా అనౌన్స్ చేస్తామని తెలిపారు.